SINGIDI
తెలుగు దినపత్రిక
ప్రభాతనవ
# సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
singidinews.com
బుధవారం 23 సెప్టెంబర్ 2026 | సంపుటి: 1 సంచిక: 97 పేజీలు 12 వెల: 6.50
Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

## ఉత్తమ నటి యామీ గౌతమ్

**జాతీయ అవార్డు అందుకున్న సుకుమార్, నాగ్ అశ్విన్**
**72వ జాతీయ చలనచిత్ర అవార్డులు**
**'ఆర్టికల్ 370' చిత్రంలోని నటనకు దక్కిన పురస్కారం**
**నిజాయితీగా పనిచేస్తే గమ్యాన్ని చేరుకుంటామని చెప్పిన యామీ**
**ఉత్తమ చిత్రంగానూ 'ఆర్టికల్ 370' ఎంపిక**


2


2

ట్రంప్‌కు జై కొట్టినా.. భారత సంతతికి
## తప్పని అవమానాలు!

---

**తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు భూములు.. ఆస్తులు.. నీళ్ల చుట్టూ చర్చ సాగుతోంది. ఒక అంశంపై ప్రశ్నలు వచ్చినప్పుడు.. మరో అంశాన్ని తెరపైకి తీసుకు రావడం.. అసలు సమస్యను పక్కకు నెట్టే ప్రయత్నమేనా అన్న చర్చ మొదలైంది. అధికార పక్షం ఒక లెక్క చెబుతుంటే.. ప్రతిపక్షం మరో అంశాన్ని ముందుకు తెస్తోంది. దీంతో ప్రజలకు అసలు సమస్య ఏంటి.. రాజకీయంగా ఎవరు ఏం సమాధానం చెబుతున్నారనే అయోమయంలో ఉన్నారు.**

- హైదరాబాద్ బ్యూరో - సింగిడి

## ఇదినాన్నారుల్లా..
# డైవర్షన్ పాలిటిక్స్
## 22-ఏ అంశం పక్కదారి... తెరపైకి భూములు
**మరోవైపు ఆస్తులు, నీళ్ల రాజకీయాలు**
**ప్రజలను గాలికొదిలేసిన అధికార-ప్రతిపక్షాలు**



### 22-ఏ లెక్కలు..
22-ఏ భూముల వ్యవహారం తెలంగాణలో చాలాకాలంగా కొనసాగుతున్న సమస్య. భూమి రికార్డుల్లో పేరు ఉండటం.. అది కూడా నిషేధిత జాబితాలో ఉండటం.. రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడం వంటి కారణాలతో పలువురు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ అంశంపై ప్రభుత్వం తన లెక్కలు చెబుతోంది.. బీఆర్ఎస్ మాత్రం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తోంది. ఇలాంటి సమయంలో.. బీఆర్ఎస్ నేతలు, వారి కుటుంబాలకు సంబంధించిన భూముల వివరాలు సభలో ప్రస్తావనకు రావడంతో చర్చ మరో మలుపు తీసుకుంది. ఎవరి దగ్గర ఎంత భూమి ఉంది.. ఏ ప్రాంతంలో ఉంది.. ఏ సర్వే నంబర్‌లో ఉంది అన్నదే ప్రధాన చర్చగా మారింది. దీంతో 22-ఏ సమస్యకు పరిష్కారం ఎప్పుడు అనే అసలు ప్రశ్న మరుగున పడిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### డైవర్షన్ కోసం
22-ఏ అంశాన్ని పక్కదారి పట్టించేందుకే తమ నేతల భూముల వ్యవహారాన్ని ప్రభుత్వం తెరపైకి తెచ్చిందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ప్రభుత్వం మాత్రం భూముల విషయంలో నిజానిజాలు బయటకు రావాల్సిందేనని చెబుతోంది. అంటే.. ఒకవైపు 22-ఏ సమస్య.. మరోవైపు నేతల భూముల లెక్కలు.. రెండూ ఒకేసారి రాజకీయ చర్చగా మారాయి.

### నీళ్ల రాజకీయాలు..
ఇదే సమయంలో బీఆర్ఎస్ సాగునీరు.. ప్రాజెక్టులు.. రైతులకు నీటి విడుదల వంటి అంశాలను ముందుకు తెస్తోంది. ప్రభుత్వ హయాంలో రైతులకు నీరు అందుతున్న తీరు.. ప్రాజెక్టుల పరిస్థితి.. పాలమూరు-రంగారెడ్డి వంటి సాగునీటి అంశాలను ప్రతిపక్షం ప్రశ్నిస్తోంది. అయితే.. బీఆర్ఎస్ నేతల ఆస్తులు, భూములపై చర్చ జరుగుతున్న సమయంలోనే నీళ్ల అంశాన్ని తెరపైకి తీసుకురావడం కూడా రాజకీయ డైవర్షన్‌లో భాగమేనని అధికారపక్షం విమర్శిస్తోంది.

### అసలు అంశం ఏంటి..
ఇలా చూస్తే.. ఒకరి దగ్గర భూముల లెక్కలు ఉంటే.. మరొకరి దగ్గర నీళ్ల లెక్కలు ఉన్నాయి. ఒకరు ఆస్తులపై ప్రశ్నిస్తే.. ఇంకొకరు ప్రాజెక్టులపై ప్రశ్నిస్తున్నారు. ఫలితంగా అసలు సమస్య కంటే.. ఎవరు ఏ అంశాన్ని ఎప్పుడు తెరపైకి తెచ్చారన్నదే రాజకీయ చర్చగా మారుతోంది.

### ప్రజల లెక్క..
కానీ సామాన్యుడికి మాత్రం ఈ రాజకీయ లెక్కల కంటే.. తన ఇంటి లెక్క ముఖ్యం. పెన్షన్ వస్తుందా.. ఇందిరమ్మ ఇల్లు వస్తుందా.. రైతు భరోసా అందుతుందా.. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ సాయం అందుతుందా.. వైద్యం, విద్య, ఉపాధి విషయంలో ప్రభుత్వం ఏం చేస్తోంది అన్నదే ప్రత్యక్షంగా ప్రభావం చూపే అంశాలు. ఎవరి భూములు ఎంత.. ఎవరి ఆస్తులు ఎంత.. ఎవరు ఎవరిపై ఆరోపణలు చేశారు అన్నది రాజకీయంగా ఆసక్తికరంగా ఉండొచ్చు. కానీ ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చేది మాత్రం సంక్షేమం.. అభివృద్ధి.. ఉపాధి.. రైతుకు భరోసా.. సాధారణ కుటుంబానికి ఆర్థిక భద్రత.

### చివరికి ఇదే లెక్క...
***రాజకీయాల్లో భూముల ఆరోపణలు ఉంటాయి.. ఆస్తుల లెక్కలు వస్తాయి.. నీళ్ల అంశాలు తెరపైకి వస్తాయి.. వాటికి కౌంటర్లు కూడా వస్తాయి. కానీ ప్రజల దృష్టిలో చివరికి మిగిలేది ఒక్కటే.. తన జీవితానికి ఏం వచ్చింది.. తన కుటుంబానికి ఏం జరిగింది.. ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఏం అమలైంది.. అందుకే.. రాజకీయ పార్టీలకు భూములు, ఆస్తులు, నీళ్లు ఎంత పెద్ద అంశాలైనా.. ప్రజలకు మాత్రం తమ ఇంటి గడపలోకి వచ్చే సంక్షేమం.. తమ జీవితాల్లో కనిపించే మార్పే అసలు లెక్క... ఈ లెక్క ఎవరు చెప్పాలి..ఎవరు రావాలి..?***

---

**దళితులు, గిరిజనుల అభివృద్ధే**
# ప్రభుత్వ లక్ష్యం
## ఎస్సీ, ఎస్టీలపై జరిగే దాడులు, అత్యాచారాలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంది: రేవంత్ రెడ్డి
**ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాలపై రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమీక్ష**
**ఇందిరమ్మ ఇళ్లలో 31 శాతం దళితులకు కేటాయిస్తున్నట్లు రేవంత్ వెల్లడి**
**విద్యా వికాసమే పేదరికాన్ని నిర్మూలిస్తుందని వ్యాఖ్య**

దళితులు, ఆదివాసీ, గిరిజనుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమన్న సీఎం రేవంత్ రెడ్డి దళితులు, ఆదివాసీ, గిరిజనుల కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని తెలిపారు. జనాభా దామాషా ప్రకారం బడ్జెట్ కేటాయిస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్లలో 31 శాతం లబ్ధిదారులు దళితులేనని అన్నారు. ఎస్టీలకు 17 శాతం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని గుర్తు చేశారు. అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు.

- హైదరాబాద్, సెప్టెంబర్ 22 (సింగిడి)


2

# జూరాలకు నీళ్లివ్వండి
## కర్ణాటక సీఎంకు రేవంత్ ఫోన్
**జూరాలకు 5 టీఎంసీల నీరు ఇవ్వాలని కోరిన రేవంత్**
**నీటి విడుదలకు శివకుమార్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం**
**బెంగళూరులో శివకుమార్‌తో మంత్రులు, ఎమ్మెల్యేల భేటీ**
**విడతల వారీగా నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి**
**జూరాల నీటి కోసం రైతుల ఆందోళన**
2

## హైదరాబాద్‌ను
# ముంచెత్తిన వర్షం
## అధికారులను అప్రమత్తం చేసిన సీఎం రేవంత్ రెడ్డి
**హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షం**


2

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రానున్న రెండు రోజుల పాటు తెలంగాణ వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

- హైదరాబాద్, సెప్టెంబర్ 22 (సింగిడి)

---



## వందేమాతరం
# వివాదం
**డీకే శివకుమార్ ప్రభుత్వానికి గవర్నర్ వార్నింగ్**
2
**'వందేమాతరం' గీతంపై కర్ణాటక ప్రభుత్వానికి గవర్నర్ లేఖ**
**గీతాన్ని రెండు చరణాలకే పరిమితం చేయడంపై తీవ్ర అభ్యంతరం**
**ప్రభుత్వ ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధమని స్పష్టీకరణ**

---

## ఉపాధ్యాయులపై దాడిలో
# ఏ ఒక్కరినీ వదిలిపెట్టం
## డేట్, టైమ్ ఫిక్స్ చేసుకొని మాట్లాడుదాం.. వైసీపీకి లోకేశ్ సవాల్
**ఎక్కడున్నా పట్టుకొచ్చి జైల్లో వేస్తామని హెచ్చరిక**
**తనపై కోపం ఉంటే నేరుగా తేల్చుకోవాలని సవాల్**
**డీఎస్సీ, ఏపీపీఎస్సీ, కల్తీ మద్యంపై చర్చకు సిద్ధమని వెల్లడి**
**150 రోజుల్లో 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశామన్న లోకేశ్**
**కార్యకర్తల కోసం ప్రమాద బీమా, రూ.175 కోట్ల సాయం**

2


ఉపాధ్యాయులపై దాడికి పాల్పడిన వారిలో ఏ ఒక్కరినీ వదిలిపెట్టబోమని టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఏపీలోనే కాదు.. అండమాన్, ఆస్ట్రేలియాలో ఉన్నా పట్టుకొచ్చి జైల్లో వేస్తామని హెచ్చరించారు. తనపై కోపం ఉంటే నేరుగా తనతో తేల్చుకోవాలని అన్నారు. డేట్, టైమ్ ఫిక్స్ చేసుకుని మాట్లాడుకుందామని చెప్పారు. డీఎస్సీతో పాటు ఏపీపీఎస్సీ, కల్తీ మద్యంపై కూడా చర్చిద్దామని సవాల్ చేశారు.

- అమరావతి, సెప్టెంబర్ 22 (సింగిడి)

---

## ఆదిలాబాద్ రిమ్స్‌లో
# అగ్నిప్రమాదం

## ఏసీ పేలి మంటలు, ఊపిరాడక ముగ్గురు చిన్నారులు మృతి

ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో పిల్లలవార్డులోని నియోనాటల్ స్పెషల్ కేర్ యూనిట్-NICU ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. సోమవారం అర్ధరాత్రి AC పేలి దట్టంగా పొగ అలముకుంది. ఆ సమయంలో ఇంక్యూబెటర్లలో 27 మంది పసికందులు చికిత్స పొందుతుండగా, పొగ కారణంగా వారికి ఊపిరి ఆడని పరిస్థితి నెలకొంది. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది, వైద్యాధికారులు, అద్దాలను పగలగొట్టి పసికందులను బయటకు తీసుకొచ్చారు. అప్పటికే ఇచ్చోడకు చెందిన సలీం ఐదురోజుల చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. అనంతరం మరో చిన్నారి కూడా ప్రాణాలు విడిచింది. పరిస్థితి విషమంగా ఉన్న 20 రోజుల చిన్నారిని నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆ చిన్నారి మృతి చెందింది. మిగిలిన 23 మంది పిల్లల్ని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, వారి పరిస్థితి బాగానే ఉన్నట్లు అధికారులు, వైద్యులు తెలిపారు
2

- ఆదిలాబాద్, సెప్టెంబర్ 22 (సింగిడి)





## ఆసుపత్రిని పరిశీలించిన
## మంత్రి దామోదర రాజనర్సింహ

ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలోని పిల్లల వార్డులో షార్ట్ సర్క్యూట్ జరిగిన ప్రాంతాన్ని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పరిశీలించారు. సోమవారం రాత్రి ఎస్ఎంసీలో జరిగిన అగ్ని ప్రమాదంలో ముగ్గురు శిశువులు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నవజాత శిశువుల వార్డులో జరిగిన ప్రమాద ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రమాదం గురించి జిల్లా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రిమ్స్‌లో అధికారులతో అంతర్గత సమీక్ష నిర్వహిస్తున్నారు. ఆయనతో పాటు ఎమ్మెల్యే పాయల్ శంకర్, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, డీఎంఈ వాణి, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటీడీఏ పీఓ మంద మకరందు, డీఎంహెచ్ఓ సాధన, రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్ తదితరులు ఉన్నారు.

---

# నిమ్స్ వైద్యుడి నివాసంలో ఏసీబీ సోదాలు
## రూ. 80 కోట్లకు పైగా ఆస్తుల గుర్తింపు
**నిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీభాస్కర్‌పై ఏసీబీ దాడులు**
**రూ.80 కోట్లకు పైగా విలువైన ఆస్తులను గుర్తించిన అధికారులు**
**హైదరాబాద్, విశాఖ, ఇతర ప్రాంతాల్లో ఫ్లాట్లు, ప్లాట్లు, బంగారం**
**బ్యాంకుల్లో రూ.41 లక్షల నగదు, ప్రైవేటు సంస్థల్లో రూ.35 లక్షల పెట్టుబడులు**
**20 ఏళ్లుగా నిమ్స్‌లో పనిచేస్తున్న లక్ష్మీభాస్కర్‌పై గతంలోనూ ఆరోపణలు**
2

## జైలుకెళ్లేందుకు
# సిద్ధం: షేక్ హసీనా
**2026 డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌లో ఉంటా..**
**ఉరిశిక్ష రాజకీయ ప్రేరేపితమని, జైలుకు వెళ్లేందుకైనా సిద్ధమని స్పష్టం**
**అవామీ లీగ్ పార్టీని పునర్నిర్మించి, ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడమే లక్ష్యం**
**ఉగ్రవాదం ముప్పు తీవ్రంగా ఉందన్న మాజీ ప్రధాని**
2

ప్రభాతనవ సింగిడి తెలుగు దినపత్రిక
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
బుధవారం 23 సెప్టెంబర్ 2026



## నిమ్స్ వైద్యుడి నివాసంలో ఏసీబీ సోదాలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 22 (సింగిడి)**

హైదరాబాద్‌లోని ప్రతిష్టాత్మక నిమ్స్ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నోరి లక్ష్మీభాస్కర్ నివాసంలో భారీగా ఆస్తులు వెలుగుచూశాయి. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలతో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం ఏకకాలంలో ఆయన నివాసం, కార్యాలయంతో పాటు మరో ఏడు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు రూ .80 కోట్లకు పైగా విలువైన స్థిర, చరాస్తులను గుర్తించడంతో అధికారులు విస్తుపోయారు.

ఏసీబీ గుర్తించిన ఆస్తుల వివరాల ప్రకారం, కూకట్‌పల్లిలో రెండు విలాసవంతమైన ఫ్లాట్లు, మణికొండ, పేట్ బషీరాబాద్ ప్రాంతాల్లో మరో ఐదు ఫ్లాట్లు ఉన్నాయి. వీటితో పాటు యాదాద్రి, నందిగామ, శామీర్‌పేటలో నాలుగు ఓపెన్ ప్లాట్లు, విశాఖపట్నంలో 800 గజాల స్థలం ఉన్నట్లు తేలింది. అలాగే, వివిధ బ్యాంకు ఖాతాల్లో రూ. 41 లక్షల నగదు, పోస్టాఫీసు ఖాతాల్లో రూ. 12 లక్షల డిపాజిట్లు, ఒక ప్రైవేటు సంస్థలో రూ. 35 లక్షల పెట్టుబడులు ఉన్నట్లు అధికారులు కనుగొన్నారు. వీటితో పాటు 517 గ్రాముల బంగారం, మూడు కార్లు, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. డాక్టర్ లక్ష్మీభాస్కర్ గత 20 ఏళ్లుగా నిమ్స్‌లో పనిచేస్తుండగా, గత ఐదేళ్లుగా డిప్యూటీ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయనపై గతంలోనూ పలు ఆరోపణలు వచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం ఏసీబీ అధికారులు లభ్యమైన ఆస్తుల పూర్తి విలువను అంచనా వేసే పనిలో నిమగ్నమయ్యారు.

## జూరాలకు నీళ్లివ్వండి

ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి సమస్యపై సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. జూరాల ప్రాజెక్టుకు ఐదు టీఎంసీల నీటిని విడుదల చేయాలని కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌ను కోరారు. మంగళవారం ఫోన్‌లో మాట్లాడిన రేవంత్‌రెడ్డి.. జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను ఆయనకు వివరించారు. జూరాల నుంచి సాగునీరు అందక ఇప్పటికే సాగు చేసిన పంటలు ఎండిపోయే పరిస్తితి ఉందని తెలిపారు. రైతుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఐదు టీఎంసీల నీటిని జూరాలకు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై శివకుమార్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీహరి, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మేగా రెడ్డి, జి. మధుసూదన్‌రెడ్డి మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిశారు. కర్ణాటక సీఎంతో చర్చించాల్సిన అంశాలపై వారితో మాట్లాడారు. అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు బెంగళూరుకు బయలుదేరారు. మంగళవారం రాత్రి 8 గంటలకు శివకుమార్‌తో భేటీ కానున్నారు. జూరాలకు నీరు ఇచ్చేందుకు సానుకూలంగా స్పందించినందుకు ఆయనకు కృతజ్ఞతలు చెప్పనున్నారు. ఐదు టీఎంసీల నీటిని ఒకేసారి కాకుండా విడతల వారీగా విడుదల చేయాలని కోరనున్నారు. జూరాలకు సాగునీరు విడుదల చేయాలని కోరుతూ రైతులు ఇప్పటికే ఆందోళనకు దిగారు. ఈ ఆందోళనలకు బీఆర్ఎస్ మద్దతు ప్రకటించింది. బీజేపీ కూడా ఈ అంశంపై స్పందించింది. దీంతో జూరాల నీటి వ్యవహారం రాజకీయంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది.

## దళితులు, గిరిజనుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

సన్నబియ్యంతో దళిత, గిరిజన వర్గాలకు మంచి భోజనం అందిస్తున్నామని, అత్యాచార ఘటనలపై ప్రభుత్వం మానవీయ కోణంలో స్పందిస్తోందని రేవంత్ రెడ్డి వెల్లడించారు. అత్యాచార బాధితులకు పరిహారాన్ని గ్రీన్‌ఛానల్ ద్వారా విడుదల చేయిస్తున్నామని పేర్కొన్నారు. పిల్లలను చదువు, క్రీడలవైపు ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. సొంత తల్లిలా ప్రేమ చూపించిన ఇందిరమ్మను ఇప్పటికీ మరిచిపోలేదని, 25 లక్షల ఎకరాలకు అసైన్డ్ పట్టాలు అందించిన ఘనత ఇందిరాగాంధీదని కొనియాడారు. ఇందిరా గాంధీ స్ఫూర్తితోనే ఈ ప్రభుత్వం పనిచేస్తుందని, బడ్జెట్‌లో జనాభా దామాషా ప్రకారం బడ్జెట్ కేటాయిస్తున్నామని, ప్రభుత్వం ఈ వర్గాల కోసం చిత్తశుద్ధితో పనిచేస్తోందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 27.5 లక్షల మంది విద్యార్థులకు నర్సరీ నుంచి పన్నెండో తరగతి వరకు బ్రేక్ ఫాస్ట్ అందిస్తున్నామని, రాష్ట్రంలో 3 కోట్ల 48 లక్షల మందికి తెలంగాణలో సన్న బియ్యం అందిస్తున్నామని, సన్న బియ్యంతో దళిత, గిరిజన వర్గాలకు మంచి భోజనం అందించగలుగుతున్నామని రేవంత్ రెడ్డి వెల్లడించారు. దళితులు, గిరిజనులు, ఆదివాసీలను దృష్టిలో ఉంచుకుని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, అత్యాచార ఘటనలపై ప్రభుత్వం మానవీయ కోణంలో స్పందిస్తోందని, బాధితుల నష్టపరిహారాన్ని బడ్జెట్‌తో ముడి పెట్టకుండా గ్రీన్ ఛానెల్‌లో విడుదల చేయాలని అధికారులను ఆదేశిస్తున్నానని వెల్లడించారు. చదువొక్కటే జీవితాలను మారుస్తుందని, అట్టడుగు వర్గాలను చదువు వైపు నడిపించకపోతే సమస్య పరిష్కారం కాదని, పిల్లల్ని చదువు వైపు, క్రీడలవైపు ప్రోత్సహించాలని సీఎం కోరారు. రాజకీయాలకి అతీతంగా ఈ వర్గాల అభివృద్ధి చేసుకుందమని, ఈ ప్రభుత్వం మీది మీ కోసం పని చేస్తుందని స్పష్టం చేశారు.

## కర్ణాటకలో 'వందేమాతరం' వివాదం

**బెంగళూరు (సింగిడి)**

జాతీయ గీతం 'వందేమాతరం' గానంపై కర్ణాటక ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు వివాదాస్పదంగా మారాయి. ఈ వ్యవహారంపై రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో 'వందేమాతరం' గీతాన్ని కేవలం రెండు చరణాలకే పరిమితం చేయడాన్ని తప్పుబడుతూ ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు ఆయన లేఖ రాశారు. ఈ ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధమని, వీటిని వెంటనే పునఃపరిశీలించాలని ఆయన కోరారు.

2026 సెప్టెంబర్ 8వ తేదీన కాంగ్రెస్ నేతృత్వంలోని కర్ణాటక ప్రభుత్వం ఒక జీవో జారీ చేసింది. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని లేదా గవర్నర్ హాజరయ్యే కార్యక్రమాలు మినహా, ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లో 'వందేమాతరం' గీతంలోని మొదటి రెండు చరణాలు మాత్రమే పాడాలని అందులో పేర్కొంది. అయితే, జాతీయ గౌరవ పరిరక్షణ చట్టం–2026 సవరణ ప్రకారం జాతీయ గీతానికి కూడా చట్టబద్ధమైన రక్షణ ఉందని గవర్నర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు.

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలకు, జాతీయ గౌరవ పరిరక్షణ చట్టానికి విరుద్ధంగా ఉన్నాయని గవర్నర్ తన లేఖలో స్పష్టం చేశారు. జాతీయ చిహ్నాలపై నిర్ణయం తీసుకునే అధికారం కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వస్తుందని, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి శాసన, కార్యనిర్వాహక అధికారాలు లేవని రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 162, 256, 257(1)ను ఆయన ఉటంకించారు. ఈ ఉత్తర్వులను ఇలాగే కొనసాగిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అనవసర వివాదాలు తలెత్తడమే కాకుండా, రాజ్యాంగపరమైన చిక్కులకు దారితీస్తుందని గవర్నర్ హెచ్చరించారు. కావున, 'వందేమాతరం' పాడే విషయంలో కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన సూచించారు.

# హైదరాబాద్‌ను ముంచెత్తిన వర్షం





ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి కూకట్‌పల్లి, ఆల్వాల్, బాలానగర్, మల్కాజిగిరి, బోయిన్‌పల్లి, అంబర్‌పేట, కోఠి, లక్డీకాపూల్ వంటి అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులపై వర్షపు నీరు భారీగా చేరడంతో పలుచోట్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ముఖ్యంగా షేక్‌పేట పరిసర ప్రాంతాల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాయుగుండం ప్రభావంతో మంగళ, బుధవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ క్రమంలో పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం సహా ఎనిమిది జిల్లాలకు 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేయగా, మరో 20 జిల్లాలకు భారీ వర్ష సూచన జారీ చేసింది. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని సూచించారు. సహాయక బృందాలు, కంట్రోల్ రూమ్‌లు 24 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# ఆదిలాబాద్ రిమ్స్‌లో అగ్నిప్రమాదం




అర్ధరాత్రి దాటిన తర్వాత ఒక్కసారిగా ఏసీ పేలిపోవటం కలకలం సృష్టించింది. ఈ ఘటనతో ఉలిక్కి పడిన సిబ్బంది హాహాకారాలతో భయానక వాతావరణం నెలకొంది. ఏం జరుగుతుందో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొంది. ఆ సమయంలో రౌండ్స్‌కు వచ్చిన డైరెక్టర్ జైసింగ్ విషయం తెలుసుకొని సిబ్బంది సహా అంబులెన్స్ డ్రైవర్లతో కలిసి ఎన్ఎన్‌సీయూ వెళ్లగా ఊపిరి ఆడనీయకుండా దట్టమైన పొగ అలముకుంది. ఈ ఘటన గురించి తెలుసుకున్న కలెక్టర్ రాజార్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ హుటాహుటిన రిమ్స్ ఆసుపత్రికి చేరుకున్నారు. దగ్గరుండి సహాయక చర్యలు చేపట్టారు. బాధితులను ఓదార్చే ప్రయత్నం చేశారు.

"నేను ఒక పేషెంట్‌ను చూడటానికి వచ్చాను. ఆస్పత్రి డైరెక్టర్‌తో మాట్లాడుతున్న క్రమంలో ఒక నర్సు వచ్చి బ్లాస్ట్ అయ్యి పొగ వస్తుందని చెప్పడంతో అందరం లోపలికి వెళ్లాం. అప్పటికే నల్లటి పొగ కమ్ముకుంది. మొత్తం చీకటిగా ఉంది. కరెంటు కూడా లేదు. కొంతమంది పసిపిల్లలను బయటకు తీసుకొచ్చాం. పొగ కారణంగా మా దుస్తులు మొత్తం నల్లగా అయ్యాయి" - సంతోశ్, ప్రత్యక్ష సాక్షి, ఆదిలాబాద్

**ఘటనపై విచారణకు సీఎం ఆదేశం**

ఈ ప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. చిన్నారులు మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. చికిత్స పొందుతున్న మిగిలిన చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఘటనకు దారితీసిన కారణాలపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని ఆసుపత్రుల్లో భద్రతా చర్యలను పటిష్టం చేయాలని ఆదేశించారు. పలువురు మంత్రులు సైతం రిమ్స్ ఘటనపై విచారం వ్యక్తం చేశారు.

**ఆసుపత్రికి వచ్చిన మంత్రి దామోదర**

ప్రమాదం దృష్ట్యా వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ రిమ్స్ ఆసుపత్రికి వెళ్లారు. ముగ్గురు చిన్నారుల మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంపై కమిటీ వేశామన్న మంత్రి, నివేదిక వచ్చిన అనంతరం కార్యాచరణ చేపడతామన్నారు. రిమ్స్‌లో ఎమర్జెన్సీ, హెమటాలజీ, తల్లి, పిల్లల వైద్యంపై ప్రత్యేక దృష్టిసారించి మెరుగైన వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే రిమ్‌లో 100 పడకలతో MCH భవనం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

**కేటీఆర్ దిగ్భ్రాంతి**

రిమ్స్‌లో చిన్నారుల మృతిపై కేటీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్'లో అగ్నిప్రమాదంపై ఆవేదనకు గురైనట్లు తెలిపారు.



## జైలుకెళ్లేందుకు సిద్ధం: షేక్ హసీనా

**న్యూఢిల్లీ (సింగిడి)**

బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా కీలక ప్రకటన చేశారు. 2026 డిసెంబర్ నాటికి తాను తప్పకుండా స్వదేశానికి తిరిగి వెళ్తానని ఆమె స్పష్టం చేశారు. తాను ఎప్పుడు వెళతాననే దానికంటే, ఏ విధంగా వెళతాననేదే అత్యంత ప్రధానమని ఆమె వ్యాఖ్యానించారు. ఒక ఆంగ్ల వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో హసీనా ఈ విషయాలను వెల్లడించారు. తన పునరాగమనం శాంతియుత మార్గంలో, చట్టబద్ధంగానే ఉండాలని తాను ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

2025 నవంబర్‌లో బంగ్లాదేశ్ ట్రిబ్యునల్ తనకు మరణశిక్ష విధించడాన్ని హసీనా తీవ్రంగా ఖండించారు. అది పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని, అన్యాయమైన తీర్పు అని ఆమె ఆరోపించారు. తన నిష్క్రమణ అనంతరం కొలువుదీరిన ప్రస్తుత ప్రభుత్వాన్ని రాజ్యాంగ విరుద్ధమైనదిగా, తనపై జరుగుతున్న విచారణను ఒక ప్రహసనంగా ఆమె అభివర్ణించారు. తన రాజకీయ పోరాటంలో భాగంగా జైలుకు వెళ్లేందుకైనా తాను సిద్ధంగా ఉన్నానని ఈ సందర్భంగా ఆమె తేల్చిచెప్పారు.

ప్రస్తుతం రాజకీయ కార్యకలాపాలపై నిషేధం ఎదుర్కొంటున్న తన 'అవామీ లీగ్' పార్టీని పునర్నిర్మించడం, పార్టీ శ్రేణులతో సంబంధాలను తిరిగి బలోపేతం చేసుకోవడంపై దృష్టి సారిస్తానని హసీనా వివరించారు. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య పాలనను పునరుద్ధరించడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో ఉగ్రవాద, తీవ్రవాద శక్తుల నుంచి ముప్పు పొంచి ఉందని, ఇది కేవలం ఆ దేశ అంతర్గత సమస్య మాత్రమే కాదని, ఒక తీవ్రమైన ప్రాంతీయ ముప్పు అని ఆమె హెచ్చరించారు.

అయితే, తన పునరాగమన ప్రణాళికలకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా ఖరారు కాలేదని ఆమె వెల్లడించారు. ఈ విషయంపై బంగ్లాదేశ్ లేదా భారత ప్రభుత్వాలతో తాను ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక లేదా అనధికారిక చర్చలు జరపలేదని హసీనా స్పష్టం చేశారు.

## ఉత్తమ నటి యామీ గౌతమ్

**న్యూఢిల్లీ (సింగిడి)**



2024 సంవత్సరానికి సంబంధించి ప్రకటించిన 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో 'ఆర్టికల్ 370' చిత్రం ప్రభంజనం సృష్టించింది. ఈ చిత్రంలో అద్భుత నటనను కనబరిచిన ప్రముఖ నటి యామీ గౌతమ్ ధర్ జాతీయ ఉత్తమ నటిగా అవార్డును అందుకున్నారు. గుజరాత్‌లోని కేవడియాలో జరిగిన ఈ వేడుకలో గౌరవ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ పురస్కారాల ప్రదానోత్సవం వైభవంగా నిర్వహించబడింది. జాతీయ పురస్కారాన్ని అందుకున్న అనంతరం యామీ గౌతమ్ తన సంతోషాన్ని మీడియాతో పంచుకున్నారు. "ఈ క్షణాన్ని నేను ఇంకా పూర్తిగా ఆస్వాదిస్తూనే ఉన్నాను. ఎన్నో కలలతో మహానగరానికి వచ్చి, నిరంతరం శ్రమించే ప్రతి కళాకారుడికి ఇది ఒక గర్వకారణం. జీవితం మన కోసం ఎలాంటి ప్రణాళికలు సిద్ధం చేసిందో ఎవరూ ఊహించలేరు. మనం వంతుగా మనం చేయాల్సింది కేవలం నిజాయితీగా కష్టపడటమే. అలా అంకితభావంతో పనిచేస్తే ఏదో ఒక రోజు ఖచ్చితంగా గమ్యాన్ని చేరుకుంటాం" అని ఆమె వ్యాఖ్యానించారు. దేశంలో ఒక కళాకారుడికి లభించే అత్యున్నత గుర్తింపు అయిన జాతీయ అవార్డును అందుకోవడం తనకెంతో గర్వంగా ఉందని యామీ పేర్కొన్నారు.

ఇదే వేడుకలో 'ఆర్టికల్ 370' జాతీయ ఉత్తమ చిత్రంగానూ పురస్కారాన్ని దక్కించుకుంది. అలాగే 'భ్రమయుగం' చిత్రంలో కనబరిచిన అద్భుత నటనకు గాను మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి ఉత్తమ నటుడిగా నిలిచారు. కల్కి 2898 ఏడీ చిత్రానికి గాను ఉత్తమ ప్రజాదరణ పొందిన సినిమా విభాగంలో దర్శకుడు నాగ్ అశ్విన్, నిర్మాత అశ్వినీదత్ అవార్డులను అందుకున్నారు. ఇక పుష్ప–2 చిత్రానికి గాను ఉత్తమ స్క్రీన్ ప్లే విభాగంలో సుకుమార్ జాతీయ పురస్కారాన్ని స్వీకరించారు.

## ట్రంప్‌కు జై కొట్టినా.. భారత సంతతికి తప్పని అవమానాలు!

**న్యూఢిల్లీ (సింగిడి)**

అమెరికాలో డొనాల్డ్ ట్రంప్, ఆయన 'మాగా' (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్) ఉద్యమానికి గట్టి మద్దతుదారులుగా ఉన్న భారత సంతతి కన్జర్వేటివ్‌లకు ప్రస్తుతం అనూహ్య అనుభవాలు ఎదురవుతున్నాయి. తమ భావజాలం తమను అమెరికన్‌లుగా పూర్తిస్థాయిలో గుర్తిస్తుందని వారు భావిస్తున్నప్పటికీ, వారిలో కొందరు సొంత పార్టీ నుంచే జాత్యహంకార వ్యాఖ్యలను, వివక్షను ఎదుర్కోవడం చర్చనీయాంశంగా మారింది. ట్రంప్ రాజకీయాల్లో భావజాలానికే ప్రాధాన్యత ఉంటుందని, జాతి, మూలాలకు తావుండదని చాలా మంది భారతీయ–అమెరికన్లు విశ్వసించారు. అయితే, ఇటీవలి పరిణామాలు దీనికి భిన్నంగా ఉన్నాయి. వారు భావజాల పరంగా తమ నిబద్ధతను చాటుకున్నప్పటికీ, "మీరు ఎంతవరకు అమెరికన్లు?" అనే ప్రశ్నలను ఎదుర్కోవాల్సి వస్తోందని ప్రముఖ కాలమిస్ట్ చిదానంద్ రాజఘట్ట తన కథనంలో విశ్లేషించారు. ట్రంప్ ప్రభుత్వంలో పనిచేస్తున్న చండీగఢ్ మూలాలున్న హర్మీత్ ధిల్లాన్, తనను తాను అమెరికన్‌గా చాటుకునేందుకు బీఫ్ డిన్నర్ ఫొటో పోస్ట్ చేశారు. దీనిపై 'మాగా' మద్దతుదారులే ఆమెను ఎగతాళి చేశారు. తనను 'పేపర్‌వర్క్ అమెరికన్' అంటూ రోజూ జాత్యహంకార వ్యాఖ్యలు ఎదుర్కొంటున్నానని ఆమె స్వయంగా తెలిపారు. అలాగే, దినేశ్ డిసౌజా తన కుమార్తెపై వచ్చిన జాతి వివక్ష దాడిని తిప్పికొట్టేందుకు, ఆమె తల్లి శ్వేతజాతీయురాలని చెప్పాల్సి రావడం విమర్శలకు దారితీసింది. గతంలో వివేక్ రామస్వామి, నిక్కీ హేలీ వంటి వారు కూడా తమ అమెరికన్ గుర్తింపును నిరూపించుకోవడానికి ప్రయత్నించాల్సి వచ్చింది. సాధారణంగా ప్రగతిశీల భావాజాలం కలిగిన ప్రమీలా జయపాల్ వంటి నేతలు 'మీ దేశానికి తిరిగి వెళ్లండి' వంటి విమర్శలను మొదటి నుంచీ ఎదుర్కొంటున్నారు. అయితే, ఇప్పుడు ట్రంప్ వాదాన్ని అత్యంత బలంగా వినిపిస్తున్న కన్జర్వేటివ్‌లు సైతం అదే వర్గం నుంచి ఇటువంటి వివక్షను ఎదుర్కోవడం గమనార్హం.

# ఉపాధ్యాయులపై దాడిలో ఏ ఒక్కరినీ వదిలిపెట్టం



**చంద్రబాబుపై ఒక్క కేసైనా నిరూపించారా?**

తమది నీతి, నిజాయతీలతో బతికిన కుటుంబమని లోకేశ్ అన్నారు. చంద్రబాబుపై తప్పుడు కేసులు పెట్టి 53 రోజులు జైలులో పెట్టారని చెప్పారు. ఆయనపై పెట్టిన ఒక్క కేసు కూడా నిలబడలేదని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే భయపడలేదని, ఇప్పుడు ఎందుకు భయపడతామని ప్రశ్నించారు. జగన్‌పై విమర్శలు చేస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు.

**డీఎస్సీపై వైసీపీ 300 కేసులు**

ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ ప్రకటించలేదని, ఒక్క జాబ్ క్యాలెండర్ ఇవ్వలేదని లోకేశ్ విమర్శించారు. బాబు తొలి సంతకం డీఎస్సీపైనే చేశారని తెలిపారు. దాన్ని ముందుకు సాగనీయకుండా వైసీపీ నాయకులు 300 కేసులు వేశారని చెప్పారు. 150 రోజుల్లో 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశామని పేర్కొన్నారు. వారికి అమరావతిలో అపాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చామని అన్నారు.

**జగన్‌పై లోకేశ్ తీవ్ర వ్యాఖ్యలు**

అబద్ధానికి ప్యాంటు, షర్టు వేస్తే వచ్చే రూపమే జగన్ అంటూ లోకేశ్ వ్యాఖ్యానించారు. నిజం చెబితే తల వెయ్యి ముక్కలు అవుతుందనే శాపం ఆయనకు ఉందంటూ విమర్శించారు. 2019 ఎన్నికలకు ముందు నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. ఇప్పుడు వచ్చి డీఎస్సీలో అవినీతి జరిగిందని ఆరోపిస్తున్నారని చెప్పారు.

**టీడీపీకి సేవే లక్ష్యం**

టీడీపీలో తెలుగు యువత, తెలుగు మహిళ, తెలుగు విద్యార్థి వంటి అనుబంధ విభాగాలు ఉన్నాయని లోకేశ్ తెలిపారు. ప్రజలకు సేవ చేయడమే తమ నాయకత్వ లక్ష్యమని చెప్పారు. పరిటాల శ్రీరామ్ లాంటి యువ నాయకత్వం పార్టీలో ఉందన్నారు. వైసీపీ నాయకత్వానికి, టీడీపీ నాయకత్వానికి తేడాను ప్రజలు గమనించాలని కోరారు. ఎన్టీఆర్, చంద్రబాబు నేర్పిన క్రమశిక్షణతోనే పార్టీ ముందుకు సాగుతోందన్నారు.

**పార్టీ కార్యకర్తలకు ప్రాధాన్యం**

కార్యకర్తే అధినేత నినాదాన్ని ఆచరణలో అమలు చేస్తున్నామని లోకేశ్ చెప్పారు. కార్యకర్తల త్యాగాలను చంద్రబాబు మరువరని అన్నారు. కార్యకర్తల కోసం ప్రమాద బీమా తీసుకొచ్చామని తెలిపారు. రూ.175 కోట్లు కార్యకర్తలకు అందించి ఆదుకున్నామని చెప్పారు. కార్యకర్తల ఆరోగ్యాన్ని చూసుకునే బాధ్యత తనదేనని పేర్కొన్నారు.

**పనిచేస్తే పదవులు వస్తాయి**

పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారిని గుర్తిస్తామని లోకేశ్ తెలిపారు. కార్యకర్తలు తాము చేస్తున్న కార్యక్రమాలను మై టీడీపీ యాప్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. ప్రజల చుట్టూ తిరిగితే పదవులు వెదుక్కుంటూ వస్తాయని అన్నారు. పనిచేయకుండా పదవులు రావాలంటే కుదరదని స్పష్టం చేశారు. పార్టీ ఇచ్చే ప్రతి కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

**అప్పర్ పెన్నార్ రైతులకు పరిహారం**

కూటమి ప్రభుత్వం ప్రాజెక్టులను ఒక్కొక్కటిగా పూర్తి చేస్తూ వెళ్తోందని లోకేశ్ చెప్పారు. అప్పర్ పెన్నార్ రైతులకు పరిహారం అందజేస్తామని తెలిపారు. ఇరిగేషన్ మంత్రితో మాట్లాడి నిధులు కేటాయిస్తామని అన్నారు. రాప్తాడు ప్రాంతానికి పరిశ్రమలు, ఉద్యోగాలు రావాల్సిన అవసరం ఉందన్నారు. పెట్టుబడులు తీసుకురావడంలో స్థానిక నాయకత్వానికి కూడా బాధ్యత ఉందని చెప్పారు.

**అనంతపురంలో సేవాభావం**

అనంతపురం జిల్లాలో సేవాభావం ఉందని లోకేశ్ అన్నారు. లేపాక్షి, నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయం, ప్రశాంతి నిలయం ఉన్న నేలగా అనంతపురాన్ని ప్రస్తావించారు. ఆర్‌డీటీ దశాబ్దాలుగా ప్రజలకు సేవలు అందిస్తోందన్నారు. సేవ చేయాలనే భావన తమలో ఉందని చెప్పారు. అందుకే ఎన్టీఆర్ అనంతపురం జిల్లాను సొంతం చేసుకున్నారని పేర్కొన్నారు.

**పరిటాల కుటుంబంతో అనుబంధం**

పరిటాల కుటుంబంతో తమ కుటుంబానికి దశాబ్దాల అనుబంధం ఉందని లోకేశ్ తెలిపారు. అన్యాయం జరిగిన చోట ఎదురొడ్డి నిలబడటం ఇరు కుటుంబాల ధ్యేయమని చెప్పారు. భూస్వాములతో పోరాడి నిరుపేదలకు భూమి పంచారని పరిటాల శ్రీరాములయ్యను గుర్తుచేశారు. పరిటాల రవీంద్ర ఫ్యాక్షన్‌కు ఫుల్‌స్టాప్ పెట్టారని అన్నారు. ఉమ్మడి అనంతపురంలో పలువురు కార్యకర్తలను కోల్పోయామని తెలిపారు.

**రాప్తాడులో కార్యకర్తలకు అండగా**

2019 నుంచి 2024 వరకు రాప్తాడులో టీడీపీ కేడర్‌ను ఇబ్బంది పెట్టారని లోకేశ్ ఆరోపించారు. తప్పుడు కేసులు బనాయించారని చెప్పారు. తనపై 23 కేసులు పెట్టారని తెలిపారు. పార్టీ కేడర్‌పై పెట్టిన తప్పుడు కేసులను తొలగించే బాధ్యత తనదేనన్నారు. ఇప్పటికే 80 శాతం తప్పుడు కేసులు తొలగించామని చెప్పారు.

## శాసనసభ సమావేశాలు ప్రజా సమస్యలను చర్చించకుండా భూముల చుట్టూ మాత్రమే తిరగడం దురదృష్టకరం



**వికారాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 22 (సింగిడి):** ఇటీవల నిర్వహించిన శాసన సభాసమావేశాల్లో ప్రజా సమస్యలకంటే భూముల విషయంలోనే చర్చ అధికంగా జరగడం దురదృష్టకరమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో ధరణిలోని అక్రమాలన్నింటినీ వెలికి తీసి పేద ప్రజలకు న్యాయం చేయాలని, గతంలో కాస్తుకాలం తొలగించడం వల్ల దశాబ్దాలుగా కాస్తులో ఉన్నటువంటి రైతులకు తీవ్ర అన్యాయం జరిగింది వారికి న్యాయం చేయాలని కోరుతున్నట్లు బీజేపీ నాయకుడు ముకుంద నాగేశ్వర్ అన్నారు. కేవలం గత ప్రభుత్వ ఆయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్ భూముల సర్వే మరియు వివరాలే కాకుండా గత 20 సంవత్సరాలుగా ఎమ్మెల్యేలు ఎంపీలు మంత్రులు, ఎన్నికల అఫిడవిట్ లో పొందు పరిచిన ఆస్తులకు ప్రస్తుత వారి పేర్ల మీద ఉన్న ఆస్తులను పరిశీలించి ప్రజాక్షేత్రంలో ఉంచాలన్నారు. అక్రమాలకు పాల్పడ్డ నాయకుల పై ఎంతటివారైనా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా నిషేధిత భూముల జాబితా 22 ఏ లో చేర్చబడ్డ ప్రైవేట్ ఆస్తులను తిరిగి తొలగిస్తామని చెప్పడం శుభపరిణామమని అన్నారు. అదేవిధంగా పరిగి నియోజకవర్గంలోని నిషేధిత 22 ఏ జాబితాలో ఉన్నటువంటి వేణుగోపాలస్వామి ఆలయం, సంజీవ స్వామి ఆలయ భూములు అన్యాక్రాంతం కాబడ్డాయని, కొంత భాగం ప్రైవేట్ వ్యక్తుల పేర్లపై మార్చబడ్డాయని, వాటిని కూడా సంబంధిత అధికారులతో సర్వే చేయించి దేవాలయ భూముల అన్యాక్రాంతానికి పాల్పడ్డ ప్రైవేట్ వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేకాకుండా పరిగిలో కొత్తచెరువులో ఎఫ్ టీ ఎల్ లో లేఔవుట్ ఇచ్చిన సర్పంచ్ పై చర్యలు తీసుకోవడమే కాకుండా అందులో ప్లాట్లు కొనుగోలు చేసిన పేద వాళ్ల ఇల్లు కట్టుకోలేక, అవసరానికి అమ్ముకోలేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న వారికి ప్రభుత్వం ఎల్బీనగర్లో అసైన్మెంట్ భూముల్లో ఇల్లు కట్టుకున్న పేద వారికి జీ వో నెంబర్ 118 తీసుకువచ్చి ఏవిధంగా న్యాయం చేస్తున్నారో వీరికి కూడా ఇంకోచోట భూములను కేటాయించి న్యాయం చేయాలని కోరారు. మాజీ మంత్రులు, ప్రస్తుత ఎమ్మెల్యేలు హరీష్ రావు కేటీఆర్ భూములను సందర్శిస్తున్న ఎంపీలు, ఎమ్మెల్యేలు పరిగి నియోజకవర్గంలోని దేవాలయ భూములను ఎఫ్ టీ ఎల్ లో ఉన్న కొత్తచెరువు భూములను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## గణనాథుడి సేవలో కాటా సుధా శ్రీనివాస్ గౌడ్



- భక్తులకు అన్నదానం..
- ఉత్సవ నిర్వాహకులకు అభినందనలు తెలిపిన మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు

**అమీన్‌పూర్, సెప్టెంబర్ 22 (సింగిడి):** వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని అమీన్‌పూర్, బీరంగూడ డివిజన్ల పరిధిలోని వివిధ కాలనీల్లో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాల్లో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా శ్రీనివాస్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అమీన్‌పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డితో కలిసి పలు వినాయక మండపాలను సందర్శించి గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కాటా సుధా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భక్తులకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ లావణ్య శశిధర్ రెడ్డి, బీరంగూడ ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్, సభ్యుడు మల్లేష్ యాదవ్, పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దండు రమేష్ యాదవ్, ఈశ్వర్ రెడ్డి, కృష్ణ యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, శ్రీధర్, శ్రీనివాస్ రెడ్డి, సురేష్‌నాయక్, బిళ్ళ శీను, రాము తదితరులు పాల్గొన్నారు.

## డీజేలకు పోలీస్ అనుమతి లేదు ఎస్ఐ గిరి



**వికారాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 22 (సింగిడి):** వినాయక నిమజ్జన శోభయాత్రను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని నవాబుపేట ఎస్ ఐ గిరి సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్ లో డి జే వినియోగం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ ఉత్సవాల ఊరేగింపులు మరియు ఇతర కార్యక్రమాల సందర్భంగా డీజేలు వినియోగించడానికి పోలీస్ అనుమతి లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో గణేష్ ఉత్సవ కమిటీలు, నిర్వాహకులు మరియు డీజే నిర్వాహకులు ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలు ఏర్పాటు చేయరాదని తెలిపారు. అనుమతి లేకుండా డీజేలు వినియోగించినట్లయితే, నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకొనున్నట్లు హెచ్చరించారు. ఈ తరుణంలో ప్రజలందరూ పోలీసులకు సహకరించి శాంతిభద్రతలు మరియు ప్రశాంత వాతావరణాన్ని కాపాడాలని ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులకు సూచించారు.

## ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి లేఖను జిల్లా కలెక్టర్‌కు అందజేసిన నాయకులు



**వికారాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 22 (సింగిడి):** వికారాబాద్ పట్టణ పరిధిలోని రైల్వే ఓవర్ బ్రిడ్జిలు (ఆర్ వో బి ఎస్ ) ముఖ్యంగా కోర్ట్ నుండి తాండూర్ మీదుగా, రామయ్య గూడ మీదుగా రైల్వే అండర్ బ్రిడ్జిలు లెవల్ క్రాసింగ్‌లు మరియు ఇతర రైల్వే సంబంధిత పనుల సమన్వయం కోసం రాష్ట్ర ప్రభుత్వం తరపున ఒక ప్రత్యేక లైజన్ అధికారిని నియమించడం కోసం చేవెళ్ళ ఎంపీ కొండ విశ్వేర్ రెడ్డికి సంబంధించిన లేఖను జిల్లా కలెక్టర్ దీపక్ తివారికి బీజేపీ నాయకులు జిల్లా కలెక్టర్ కు అందజేశారు. ప్రతిపాదిత మరియు కొనసాగుతున్న ఆర్ వో బి, ఆర్ యూ బి మరియు లెవల్ క్రాసింగ్ పనులకు సంయుక్త తనిఖీలు నిర్వహించడం మరియు వాటికి సహకరించడం, అవసరమైన అనుమతులు, క్లియరెన్స్‌లు మరియు ఆమోదాలు పొందేందుకు సంబంధిత రాష్ట్ర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేయడం కోసం, సంబంధిత డీపీర్ లు మరియు ఇతర సాంకేతిక ప్రతిపాదనల తయారీ, ప్రాసెసింగ్‌లో సహకరించడం కోసం ఎంపి చేవెళ్ల కొండా విశ్వేశ్వర్ రెడ్డి పంపిన లేఖను వికారాబాద్ బీజేపీ నాయకులతో కలిసి జిల్లా కలెక్టర్ ని కలిసి అందించిన వికారాబాద్ బిజెపి అసెంబ్లీ కోఆర్డినేటర్ వడ్ల నందు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ బీజేపీ పట్టణ అధ్యక్షురాలు యాస్కి శిరీష, 5వ వార్డు కౌన్సిలర్ శ్రావంతి శ్యామ్ రెడ్డి, సువాని, యాదవ రెడ్డి పాల్గొన్నారు.

## విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో

# అధ్యాపకుల పాత్ర కీలకం

- బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే వివేకానంద్





**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 22 (సింగిడి):** 2025 - 26 విద్యా సంవత్సరం ఒకేషనల్, ఇంటర్మీడియట్, డిగ్రీ ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంలో విద్యార్థులను ప్రోత్సహించి, వారి ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడంలో తమ జ్ఞానాన్ని పంచిన గురువులను సన్మానిస్తూ కేయం. పాండు మెమోరియల్ ఒకేషనల్ కళాశాల వేదికగా గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ కళాశాల అధ్యాపకులను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని, క్రమశిక్షణ పట్టుదలతో ముందుకు సాగాలని ప్రోత్సహించారు. విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని నమ్మి విద్యాభివృద్ధికై నిత్యం పాటుపడిన మా నాన్నగారైన మాజీ మున్సిపల్ చైర్మన్, దివంగత నేత కేఎం. పాండు పేరు మీద ఏర్పాటుచేసిన ఈ కళాశాలలో విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తూ రాష్ట్రస్థాయి గుర్తింపు పొందేలా ఉత్తమ ఫలితాలు సాధించడం ఎంతో సంతోషంగా ఉన్నదన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకై వారిని ప్రోత్సహిస్తున్న కళాశాల ప్రధానోపాధ్యాయులకు, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో ఈ కళాశాలను మరింత అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపల్ షేక్ మైమూన్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేందర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి. రాజు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్, వెలుగు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఫౌండర్ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరంగా పరిష్కరించాలి

**ప్రతి వినతిపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి సత్వర చర్యలు తీసుకోవాలి**

**అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు**



**సంగారెడ్డిబ్యూరో, సెప్టెంబర్ 22 (సింగిడి):** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, అర్హత మేరకు వేగవంతంగా పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్లు ఆదేశించారు. కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు లు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమానికి హాజరైన అర్జీదారుల సమస్యలను ఆలకిస్తూ, ప్రతి దరఖాస్తును పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా ప్రతి ఫిర్యాదుకు సత్వర పరిష్కారం అందించాలని తెలిపారు. ప్రజావాణిలో మొత్తం 79 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. వాటిలో సంగారెడ్డి డివిజన్‌కు 20, నారాయణఖేడ్ డివిజన్‌కు 2, జహీరాబాద్ డివిజన్‌కు 2, కలెక్టరేట్‌కు 55 దరఖాస్తులు అందగా, అందోల్ డివిజన్‌కు ఎలాంటి వినతులు అందలేదని వెల్లడించారు. ప్రజావాణిలో ప్రధానంగా రెవిన్యూ, హౌసింగ్, పెన్షన్లు, పంచాయతీరాజ్, ఎంప్లాయిమెంట్, ఆర్టీసీ, ఎలక్ట్రిసిటీ, ఇరిగేషన్, మిషన్ భగీరథ గ్రిడ్, యూత్ వెల్ఫేర్, కోపరేటివ్, లేబర్, అగ్రికల్చర్, విద్య, వైద్య ఆరోగ్య శాఖ, డి ఆర్ డి ఓ, సర్వే ల్యాండ్ రికార్డ్స్, పోలీస్, ట్రైబల్ వెల్ఫేర్, మహిళా ,శిశు, వికలాంగులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, ఈ ఈ పి ఆర్, ఎక్సైజ్, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించిన ఫిర్యాదులు, వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించండి

**జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి**



**మేడ్చల్ కలెక్టరేట్, సెప్టెంబర్ 22 (సింగిడి):** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి( ఐఏఎస్) అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తో కలిసి కలెక్టర్ అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీ రాజ్, సివిల్ సప్లైస్, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించి మొత్తం 106 దరఖాస్తులు ప్రజల నుండి స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితుల సమస్యలకు ప్రాధాన్యతనిచ్చి వేగంగా పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టరు సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మాలతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## శివరాంపల్లిలో 'యువశక్తి' సేవా సమితి సన్మాన మహోత్సవం

- 40 ఏళ్ల స్నేహ-సేవలకు ఘన నీరాజనం
- ఆకట్టుకున్న భరతనాట్య విన్యాసాలు, కన్నులపండువగా అన్నదానం



**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 22 (సింగిడి):** డబ్బుతో ముడిపడిన స్వార్థ సంబంధాలు రాజ్యమేలుతున్న నేటి రోజుల్లో, కులమతాలకు అతీతంగా మానవత్వమే పరమావధిగా సాగుతున్న 40 ఏళ్ల నాటి స్నేహబంధం శివరాంపల్లిలో మెరిసిపోయింది. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లి 'యువశక్తి సేవా సమితి' ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన మహోత్సవం అత్యంత కన్నులపండువగా సాగింది. ఈ సందర్భంగా సేవా సమితి ప్రతినిధులు రాజు యాదవ్, గడ్డి చౌదయ్య, సాంబ ఆంజనేయులు, పి. లక్ష్మణ్, నరేందర్, కిరణ్ కుమార్, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణ, జి. శ్రీనివాస్, శ్రీహరి, రాజేష్, జంగయ్య, శివ యాదవ్, మల్లేష్, పి. శివ, వినోద్, విజయ్, గోవర్ధన్ రెడ్డి, ప్రభాకర్, సుధాకర్ తదితరులు పాల్గొని సీనియర్ సభ్యులను శాలువాలు కప్పి, మమకారంతో జ్ఞాపికలను అందజేసి ఘనంగా సత్కరించారు. చిన్ననాటి నుంచి ఒకే తాటిపై నిలిచి, మట్టి వినాయకుడి విగ్రహాలను స్వయంగా తయారు చేసి ప్రతిష్ఠించడం నుంచి నేటి వరకు అంగరంగ వైభవంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించడం వెనుక ఈ సీనియర్ల కష్టం అపారమైనదని నిర్వాహకులు కొనియాడారు. ఎంతటి వ్యయప్రయాసలు ఎదురైనా భక్తిశ్రద్ధలు, సేవానిరతి వీడకుండా సాగుతున్న వీరి ప్రయాణం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. డబ్బు ఉన్న మనుషుల కంటే.. గుండె నిండా మానవత్వం, సేవాభావం ఉన్న మనుషులే సమాజానికి అవసరమని పలువురు వ్యాఖ్యానించారు.

**నృత్య నీరాజనం.. ఆధ్యాత్మిక సంబరం**

సన్మాన కార్యక్రమం అనంతరం ప్రఖ్యాత నర్తకీమణులు కావాలి శ్లోక, రిషిక రెడ్డి తమ అద్భుత భరతనాట్య విన్యాసాలతో భక్తజనాన్ని మైమరిపించారు. గణపతి తత్వానికి నృత్య రూపాన్నిస్తూ, "గణనాథుడి గీత" మధుర స్వరాలకు అనుగుణంగా వారు వేసిన అడుగులు విఘ్నేశ్వరుడి సన్నిధిలో దివ్యానుభూతిని పంచాయి. భావ ప్రకటన, అభినయం, అడుగుల లయతో వేదికపై వారు చూపిన ప్రతిభకు భక్తులు కరతాళ ధ్వనులతో నివాళులర్పించారు. సాంస్కృతిక శోభతో విలసిల్లిన ఈ కార్యక్రమం భక్తి రస పారవశ్యంలో ముంచెత్తింది.

**అన్నదానం.. కడుపు నింపే మహాయజ్ఞం**

ప్రతి ఏటా గణనాథుని సన్నిధానంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం తన పూర్వజన్మ సుకృతమని ప్రముఖ వినాయక భక్తుడు గడ్డి సతీష్, వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. "యువశక్తి సేవా సమితి ఆవరణలో భక్తులకు, పేదలకు అన్నదానం చేయడం ఎంతో గర్వకారణంగా ఉంది. ప్రతి సంవత్సరం ఈ మహత్కార్యంలో భాగస్వామిని కావడం నా అదృష్టం" అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువశక్తి సేవా సమితి సభ్యులు, సీనియర్ నాయకులు, స్థానిక ప్రజలు విశేష సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రజావాణిలో 139 దరఖాస్తులు



**సిద్దిపేట బ్యూరో, సెప్టెంబర్ 22 (సింగిడి):** సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం లోని సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ ప్రజావాణి కార్యక్రమం ద్వారా ఫిర్యాదు దారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి పలువురు అర్జిదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజావాణిలో అర్జిలు మొత్తం 139 వచ్చాయనీ, అర్జిదారులకు న్యాయం చేసి తిరిగి అర్జి పెట్టుకోకుండా పని చెయ్యాలని అధికా రులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భవ్య, ఎస్డిసి సుదర్శన్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నవరాత్రులలో అన్నదానం..

**శోభాయాత్రలో పాల్గొన్న సొంటిరెడ్డి పున్నారెడ్డి**



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 22 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని వివిధ కాలనీలలో గణేష్ నవరాత్రి మండపాలను మాజీ టి పి సి సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుత్బుల్లాపూర్ నియోజక కాంగ్రెస్ పార్టీ నాయకులు సొంటి రెడ్డి పున్నారెడ్డి సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గణేష్ మండప నిర్వాహకులు ఏర్పాటుచేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో, స్వామివారి శోభాయాత్రల్లో పాల్గొని గణనాథుని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ మహారాజ్ ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు.



## అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 22 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గణేష్ నగర్ డివిజన్ పరిధిలోని ద్వారక నగర్‌లో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందజేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై రేషన్ కార్డు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అర్హులైన పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో 15 లక్షల నూతన రేషన్ కార్డులను మంజూరు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించడంతో పాటు, ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల ప్రయోజనాలు లబ్ధిదారులకు చేరుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా పేద కుటుంబాల ఆర్థిక భారం తగ్గించే దిశగా ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. సన్న బియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అర్హత కలిగిన కుటుంబాలకు ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ కార్యక్రమాలు నిరుపేదలకు ఉపయోగపడు తున్నాయని కూన శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా, పారదర్శకంగా అందే అవకాశం ఉందని ఆయన తెలిపారు. అర్హత ఉన్నప్పటికీ రేషన్ కార్డు లభించని కుటుంబాలు సంబంధిత అధికారులను సంప్రదించి తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కృష్ణ యాదవ్, పెంటయ్య ముదిరాజ్, సిహెచ్ బుచ్చిరెడ్డి, అలివేలు, బాలప్ప, నగేష్, విజయ్ గుప్తా, రవీందర్ గౌడ్, కోన రాఘవేంద్ర గౌడ్, సురేందర్, అక్బర్, సంగమ్మ, భూషణం, శ్రీధర్, రాజేశ్వరరావు, కాంగ్రెస్ కార్యకర్తలు , రేషన్‌కార్డు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## బిగోనియా హోమ్స్‌లో ఘనంగా అన్నప్రసాద వితరణ



**రాజేంద్రనగర్ సెప్టెంబర్ 22 (సింగిడి):** బిగోనియా హోమ్స్ సాంస్కృతిక కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దాత బాలరాజ్ గౌడ్ సహకారంతో ఈ సేవా కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టారు. బిగోనియా హోమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీకాంత్ , ముఖ్య దాత బాలరాజ్ గౌడ్ లకు సాదరంగా స్వాగతం పలికి సత్కరించారు. సాంస్కృతిక కమిటీ సభ్యులు సుధా మాధురి, ఉష, ఉషారాణి, ఆకాష్‌లతో పాటు ఇతర కమిటీ సభ్యుల భాగస్వామ్యంతో కార్యక్రమ నిర్వహణను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు శ్రీకాంత్ మాట్లాడుతూ.. నివాసితులందరి ఐకమత్యం, భక్తి భావం, అన్నప్రసాద సేవా స్ఫూర్తితోనే ఈ వేడుక ఇంతగా విజయవంతమైందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక కమిటీ సభ్యులకు, సొసైటీ నివాసితులు,అసోసియేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఎడిటోరియల్ NEWS సింగిడి

# ఎడిటోరియల్

సంస్కృతి ఉట్టిపడేలా పర్యావరణహితంగా

## గణేష్ నిమజ్జనం

భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ముఖ్య భూమిక పోషించిన గణేష్ నవరాత్రి ఉత్సవాలు దేశవ్యాప్తంగా వైభవంగా జరుగుతున్నాయి. గణనాథులను పల్లె, పట్నం, నగరాలు నవరాత్రులు కొలుస్తున్నాయి. సెప్టెంబర్ 14 ప్రారంభమైన చతుర్థి ఉత్సవాలు 3, 5, 9, 11 రోజులపాటు ఆధ్యాత్మికంగా నిర్వహిస్తారు. అనంతరం కుంటలు, కాలువలు, చెరువులు, నదుల్లో, హైదరాబాద్ లాంటి నగరాల్లో ట్యాంక్ బండ్ లల్లో భక్తులు, ప్రజలు, యువత, చిన్నాపెద్దా ఎంతో ఉత్సాహం, ఆనందభరితంగా నిమజ్జనం చేస్తారు.

సాంస్కృతి ఉట్టిపడేలా..

అందులో భాగంగా డీజే సౌండ్ సిస్టం, సౌండ్ బాక్సులు, బ్రాస్ బ్యాండ్ లైటింగ్ షో, మైక్ సెట్, బ్యాండ్ మేలాలతో పెద్దపెద్ద శబ్దాలు చేస్తూ, సినిమా, రీమిక్స్ పాటలు మోగిస్తూ డ్యాన్సులు చేస్తుంటారు. అయితే ఇది మన భారతీయ సంస్కృతి ఏ మాత్రం కాదు. పాశ్చాత్య సంస్కృతి అనే చెప్పాలి. దీనికి నేటితరం సమాజం, యువత స్వస్తి పలకాలి. నాటి దేశ సంస్కృతి, సాంప్రదాయాలను పాటించాలి. నిమజ్జనం వేళ భాజభజంత్రీలు, భక్తి గీతాలు, పాటలకనుగుణంగా కోలాట, సాంప్రదాయ నృత్యాలు, ఆధ్యాత్మిక తాళ మేళాల కార్యక్రమాలతో గణపయ్యను సాగనంపుదాం.

పర్యావరణహితం..

అదేవిధంగా నిమజ్జన సమయాల్లో టపాకాయలు కాల్చడం పూర్తిగా పక్కన పెడదాం. తద్వారా వాయు కాలుష్యాన్ని నియంత్రిద్దాం. విగ్రహాలు తరలించే ప్రతి వాహన ఇంజన్ ను అవసరం లేనప్పుడు ఆపివేద్దాం. దాన్నుంచి వచ్చే పొగను నిర్విరామంగా వెదజల్లకకుండా నిలిపివేసే ప్రయత్నం చేద్దాం. అలాగే దేవుడికి సమర్పించిన పూలదండలు, కొబ్బరికాయలు, పూలు, పండ్లు, వాడిన కాగితాల చెత్త, పత్రి లాంటివి నీళ్లలో వేయవద్దు. వాటిని గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్ లో సంబంధిత శాఖకు ఇవ్వాలి. ఇలాంటి పలు చర్యలతో కాలుష్యం కొంతైనా తగ్గిద్దాం. వాతావరణాన్ని పరిరక్షించుకుందాం. మంచినీటిలో నిమజ్జనం చేయకుండా జల సంరక్షణను బాధ్యతగా తీసుకుందాం. భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా, పర్యావరణహితంగా గణేష్ నిమజ్జనం చేసుకుందాం.


– తలారి గణేష్
తెలంగాణ సామాజిక రచయితల సంఘం



# వీణలో మహామహోపాధ్యాయుడైన ఈమని

### నేడు ఈమని శంకరశాస్త్రి జయంతి

**శంకరాభరణం శంకరశాస్త్రి అంటే తెలియని వారు ఉండరేమో గాని, ఈమని శంకరశాస్త్రి (సెప్టెంబర్ 23, 1922 – డిసెంబర్ 23, 1987 గురించి ఈ నాడు చాలా మందికి తెలియక పోవచ్చు. వీణలో మహామహోపాధ్యాయుడైన ఈమని శంకరశాస్త్రిగారి సంగీత కచేరీలు విన్నవారికి ఆయన గొప్పదనం ఎటువంటిదో తెలిసినదే. వాద్య సంగీతంలో శంకరశాస్త్రితో పోల్చదగిన వ్యక్తులు ఆనాడూ, ఈనాడూ కూడా చాలా తక్కువ మందే కనిపిస్తారు. గమక విన్యాసంలో, రాగ ప్రస్తారంలోనూ ఆయనది అద్వితీయమైన ప్రతిభ. వీణ మీద ఎన్ని రకాల శబ్దాలు పలికించవచ్చునో పరిశోధించి, శోధించి నిరూపించిన అనన్య సామాన్య కళాకారుడాయన.**



కారణాలేవైనప్పటికీ ఇంత గొప్ప కళాకారుడికి రావలసిన ఖ్యాతి మాత్రం రాలేదు. ఆయన తాతగారైన సుబ్బరాయశాస్త్రి, తండ్రి అచ్యుతరామశాస్త్రి కూడా గొప్ప వీణ విద్వాంసులు. 1922, సెప్టెంబరు 23న, తూర్పుగోదావరి జిల్లా దాక్షారామంలో జన్మించిన శాస్త్రి, ఆయన తండ్రి అచ్యుత రామశాస్త్రి దగ్గర వీణ అభ్యసించి ఈ వాద్యాన్ని పూర్తిగా తెలుగు వీణగా రూపుదిద్దారు. నేటి తరం వినగలిగిన వీణ విద్వాంసులలో అగ్రస్థానం నిస్సందేహంగా ఈమని శంకరశాస్త్రిగారిదే.

సీతారామ కల్యాణం (రావణుడు వీణ వాయించే ఘట్టం), వెంకటేశ్వర మహత్యం (సరస్వతి "వాచస్పతి" రాగం వాయించే సీను) మొదలైన కొన్ని తెలుగు సినిమాల్లో శాస్త్రి వీణ నేపథ్యం వినబడుతుంది.

కచేరీలలో అప్పుడప్పుడూ పాట పాడి వినిపిస్తూ అవే సంగతులను వీణ మీద పలికించే అలవాటుండేది. మంత్రపుష్పం వంటివి వాయిస్తున్నప్పుడు "ప్రజా"వంటి పదాలను ఉచ్చరిస్తూ కుడిచేత్తో అందుకు అనుగుణంగా డబుల్ మీటు వేసేవారు. ఇక కుడి చేత్తో ఆయన తీగలను మీటే పద్ధతి కూడా చాలా గొప్పగా ఉండేది. సందర్భాన్నీ, అవసరాన్నీ బట్టి ఆయన తన కుడి చేతి పొజిషన్‌నూ, తీగను మీటే స్థానాన్నీ పలు రకాలుగా మార్చేవారు. ఆయన పలికించిన తానం అనితర సాధ్యం. మూడో తీగనూ, నాలుగో తీగనూ బొటన వేలితో మీటుతూ మంద్ర, అనుమంద్ర స్థాయిల్లో స్వరాలను అత్యద్భుతంగా వాయించే వారు. మామూలుగా ఉండే మూడు తాళం తీగలే కాక మరొక రెండు ఏర్పాటు చేసి, వాటిని రాగంలోని స్వరాలకు శ్రుతిచేసి మొత్తం మీద ఒక ఆర్కెస్ట్రావంటి ప్రభావాన్ని కలిగించేవారు. కేవలం ఒక్క వీణతోనే అరుదైన రాగాలను ఎంతో డ్రమటిక్‌గా, పెద్ద సింఫొనీ స్థాయిలో వాయించేవారు. ఈ టెక్నిక్‌ల మాట ఎలా ఉన్నా సంగీతకారుడుగా ఆయనది ఎంతో పరిక్వత చెందిన మేధస్సు. రాగ స్వభావాన్ని గంభీరంగా, హుందాగా, ఎటువంటి వెకిలి తనమూ లేకుండా వినిపించడం ఆయన ప్రత్యేకత. ఏ మాత్రమూ వేగాన్నీ, ఆర్భాటాన్నీ ప్రదర్శించ కుండా స్వరకల్పనలో ఎంతో ఉద్వేగాన్నీ, ఆర్తినీ సునాయాసంగా సృష్టించేవారు. తాను పూర్తిగా రాగభావంలో లీనమై, ప్రేక్షకుల ఉనికిని కూడా గమనించ కుండానే వారిని సంగీతపు అలలలో ఓలలాడించేవారు. ఆయన కచేరీకి ఎన్నిసార్లు వెళ్ళినా, అద్వితీయ మైన ఆయన ప్రతిభ అందరినీ ఆశ్చర్య చకితులను చేస్తూ ఉండేది.

రవిశంకర్, హలీమ్ జాఫర్‌ఖాన్ వంటి సితార్ విద్వాంసులతోనూ, గోపాల్‌కృష్ణ వంటి విచిత్రవీణ కళాకారుల తోనూ జుగల్‌బందీ కచేరీలు చెయ్యడం ఆయన చేశారు. సూర్‌దాస్ భజనలకూ, ఇతర గీతాలకూ ఆయన పహాడీ మొదలైన హిందూస్తానీ రాగాల్లో స్వర రచన చేశారు. రేడియోలో అనేక గీతాలకు లలిత సంగీతం సమకూర్చారు. అందులో "న జానే క్యా లాచారీ హై" అనే హిందీ పాటను బాలమురళీకృష్ణ గుజరీతోడీ రాగంలో పాడారు. అలాగే దేవులపల్లివారి రచన "ఒదిగిన మనసున పొదిగిన భావము" అనే పాటకు శాస్త్రిగారు మిశ్ర కాఫీ రాగంలో స్వర పరిచారు. చేశారు. ఢిల్లీలో రేడియోకి చీఫ్ ప్రొడ్యూసర్‌గానూ, నేషనల్ ఆర్కెస్ట్రా కంపోజర్ కండక్టర్‌గానూ ఆయన ఎన్నో అద్భుతమైన సంగీత రచనలు చేసి వాద్యబృందాన్ని నిర్వహించారు. వాటిలో శిఖరారోహణం, భ్రమర విన్యాసం, సౌమ్య పురుష మొదలైనవి పేరు పొందాయి.

ఆయన 1942-50 మధ్యలో మద్రాసులోని జెమినీ స్టూడియోలో సాలూరు రాజేశ్వరరావుకు సంగీత దర్శకత్వంలో సహాయకునిగా ఉన్నారు. ఆ కాలంలోనే చిట్టిబాబు ఆయనకు శిష్యుడయాడు. 1951లో పి.బి.శ్రీనివాస్‌ను సినీ గాయకుడుగా పరిచయం చేసినది ఈమనే.. 1940లో తిరుచ్చి రేడియో కేంద్రంలో మొదటగా వీణ కచేరీ చేశాక ఆయనకు పేరు లభించ సాగింది. ఆకాశవాణి డైరక్టరేట్ లో సంగీత విభాగంలో చీఫ్ ప్రొడ్యూశర్ గా పనిచేసిన మరో ప్రముఖులు ఈమని శంకరశాస్త్రి. వైణికులుగా లబ్ధ ప్రతిష్ఠులైన శంకరశాస్త్రి ఢిల్లీలో సముచిత గౌరవాన్ని పొందారు.

న్యూయార్క్‌లో, వీణావిర్టో బిరుదుతో అమెరికా ప్రభుత్వం 1973లో సత్కరించింది. రష్యా, ఆస్ట్రియా దేశాలు ప్రత్యేక అతిథిగా గౌరవించాయి. ఐక్యరాజ్య సమితి, యునెస్కో అవార్డులు వరించాయి. పారిస్, రోమ్‌లో జరిగిన పలు కచేరీల్లో పాల్గొని సత్కారాలు పొందారు. కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారం అందించింది. రాష్ట్ర ప్రభుత్వ రాష్ట్ర సంగీత విద్వాంసుని గా, టీటీడీ ఆస్థాన సంగీతకారునిగా పనిచేశారు. గుంటూరులో జరిగిన ఓ కార్యక్రమంలో స్వర్ణ కంకణ ధారులై, తిరిగి చెన్నైకి రైల్లో వెళు తూ, ఈమని 1987 డిసెంబర్ 23న రైలు ప్రయాణంలోనే కన్ను మూశారు.

రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494

# వైవిధ్య భరితం... వామనావతారం

"సంభవామి యుగే యుగే"... ధర్మ సంస్థాపనకోసం అవసరమైన సందర్భాల్లో అవతరిస్తూనే ఉంటా'నని శ్రీమహావిష్ణువు అభయ ప్రదానం చేశాడు. ఆ పరంపరలో ఆవిష్కారమైనది...వామనుడు లేదా త్రివిక్రముడు, హిందూ పురాణాల ప్రకారం శ్రీమహావిష్ణువు యొక్క దశావతారాలలో ఐదవ అవతారం. భాద్రపద శుద్ధ ద్వాదశి నాడు అదితి, కశ్యపుల కుమారుడిగా శ్రీహరి వామన మూర్తిగా అవతరించాడు. దీన్ని వామన ద్వాదశిగా, విజయ ద్వాదశిగా వ్యవహరిస్తారు. సృష్టిలోని జీవావరణంలో జీవులు సూక్ష్మ రూపం నుంచి మహా భారీకాయం వరకు వైవిధ్య భరితంగా గోచరమవుతాయి. ఈ అణుత్వం, మహారూపాలు పరస్పర విరుద్ధమైనవి. కానీ, ఆ వైవిధ్యం ఆత్మ, పరమాత్మల విషయంలో లేదని వేదోక్తి. ఆత్మ అణువు కంటే సూక్ష్మమైనది, మహత్తరమైనది. అది ఎంత సూక్ష్మమైనదో, అంత స్థూల మైనదని కఠోపనిషత్తు ప్రకటించింది. వామనావతార నేపథ్యం ఇదే!

దేవాసుర యుద్ధంలో ఇంద్రునితో ఓడి పోయిన బలి, రాక్షస గురువైన శుక్రాచార్యుల దయ వలన బ్రతికి, గురూపదేశంతో విశ్వజిత్‌యాగం చేసి బంగారు రథము, మహా శక్తివంతమైన ధనుస్సు, అక్షయ తూణీరములు, కవచము, శంఖములు పొందుతాడు. బలగర్వితుడై ఇంద్రుని మదమణి చేందుకు, రాక్షసుల నందరినీ ఒకచోటచేర్చి, యుద్ధమునకు సంసిద్ధం చేసి అమరావతిపై దండెత్తుతాడు. ఆ దుర్భర దానవ శంఖా విర్భూత ధ్వనులు నిండి, విభుదేంద్ర వధూగర్భములు పగిలి, లోపలి శిశువులు ఆవురని ఆక్రోశించుచుండ, దేవతలు బృహస్పతి వచనములు విని అమరావతి వీడి పారిపోయారు.
దేవతల దుస్థితిని చూసి, సుర మాత అదితి, తన భర్తయైన కశ్యప బ్రహ్మను వేడుకున్నది. అంతట కశ్యపుడు అదితికి పయోభక్షణ వ్రతాన్ని ఉపదేశిస్తాడు. ఆమె ఫాల్గుణ మాసం, శుక్లపక్ష పాడ్యమి నుంచి 12 రోజులు హరి సమర్పణంగా వ్రతం చేసి భర్తను చేరగా, భగవ దంశతో, శ్రవణ ద్వాదశి (శ్రవణ నక్షత్రంతో కూడిన భాద్రపద బహుళ ద్వాదశిని శ్రవణ ద్వాదశి అంటారు), ఆనాడు శ్రోణ అభిజిత్ సంజ్ఞాత లగ్నంలో, రవి మధ్యాహ్నమున చరించు నప్పుడు, గ్రహ తారా చంద్ర భద్రస్థితిలో వామనుడు జన్మించాడు. వామనుడు పుట్టినప్పుడు శంఖ, చక్ర, గదా కమల కలిత, చతుర్భుజునిగా, బిశంగ వర్ణ వస్త్రాలతో, మకర కుండల మండిత గండ భాగుడై, శ్రీ విరాజిత లోలంబ, కదంబ వనమాలిగా సమస్త అలంకారాలతో, నిఖిల జన మనోహరుడిగా



అవతరించాడు. రూపాంతరంబున తన దివ్య రూపాన్ని ఉపసంహరించుకొని, కపట వటుని వలె, ఉపనయ వయస్కుండై వామన బాలకుడయ్యాడు.
బృహస్పతి యజ్ఞోపవీతాన్ని ఇచ్చాడు. కశ్యప మహర్షి మొలత్రాడు ప్రసాదించాడు . తల్లి అదితి కౌపీనాన్ని, భూమాత నల్లజింక చర్మాన్నీ , చంద్రుడు దండాన్నీ, గగనాధిష్ట దేవత ఛత్రాన్నీ , బ్రహ్మ కమండలువునూ , సరస్వతి అక్షమాలికనూ (జపం చేసే సమయాన జప సంఖ్యను లెక్కపెట్టుకోవడానికి ), సప్తర్షులు పవిత్రలను ( కుశలను /దర్భలు ) వామన మూర్తికి బహూకరించారు . స్వయంగా సూర్య భగవానుడే గాయత్రీ మంత్రాన్ని ఉపదేశించాడు.
వామనుని చూసి జనులు గుజగుజలు పోవుచూ, గజిబిజి పడుచూ, కలకలములై ఎవరీ పొట్టి బాలుడు? శివుడా? హరియా? బ్రహ్మయా? సూర్యుడా? అగ్నియా? ఈ బ్రహ్మచారి ఎవరు? అని విస్మయం చెందారు. కొందరితో చర్చించుచూ కొందరితో జటలు చెప్పుచూ, గోష్ఠిలో పాల్గొనుచూ, తర్కించుచు, ముచ్చటలాడుచు, నవ్వుచూ అనేక విధంబుల అందరికీ అన్ని రూపులై వినోదించుచూ, వెడవెడ నడకలు నడుచుచూ, బుడి బుడి నొడువులు నొడుచుచు, జిడిముడి తడబడగ, వడుగు రాజును సమీపించి "స్వస్తి ! జాగత్త్రయీ భావన శాసన కర్తకు! హాసమాత్ర విధ్వస్త నిలింప భర్తకు, ఉదారపద వ్యవహర్తకు, మునీంద్ర స్తుత మంగళాధ్వ విధాన విహర్తకు, దానవ లోక భర్తకు స్వస్తి అని దీవించెను. బలి అతనికి సముచితాదరమిచ్చి గౌరవించి...వడుగా! ఎవ్వరి వాడవు? నీకేమి కావలయును కోరుకొమ్మన్నాడు. "ఒంటి వాడను నేను. నాకు ఒకటి, రెండడుగుల మేర యిమ్ము . అయినను అడుగ మంటివి కనుక అడిగితిని. దాత పెంపు సొంపు తలపవలెను గదా! కావున నాకు మూడడుగుల నేలనిమ్ము, చాలు అని మాయా వడుగు పలికెను. ఆ వామనుడిని విష్ణువుగా గుర్తించిన శుక్రుడు బలి చక్రవర్తిని వారించెను. బలి గురువుకు వినయముగా నమస్కరించి ...ఇచ్చెదనని పలికితిని. ఆడిన మాట తప్పను అన్నాడు. అప్పుడు శుక్రాచార్యుడు నీవిచ్చినచో అఖిలంబు పోవును.
"ఇంతింతై...వటుడింతయై...
అలా ధారా పరిగ్రహంబు చేసి, ఇంతితై వటుడింతయై, దానింతై, నభో వీధిపైనంతై, తోయద మండలాగ్రమున కల్లంతై, ప్రభారాశి పైనంతై, చంద్రునికంతయై, ధ్రువుని పైనంతై, మహర్వాటి పైనంతై, బ్రహ్మాండాంత సంవర్ధియై", సత్యపదోన్నతుడైన విష్ణువునకు అప్పుడే ఉదయించిన సూర్యబింబము మొదట గొడుగులా, తదుపరి శిరోరత్నమై, చెవి కుండలమై, మెడలోని ఆభరణమై, బంగారు కేయూరమై, కంకణమై వడ్డాణపు ఘంటమై, నూపుర ప్రవరమై, చివరకు పాదపీఠమై ఒప్ప అతడు బ్రహ్మాండము నిండినాడు – అని బమ్మెర పోతన భాగవతంలో పద్య రచన అద్భుతంగా చేశాడు. వారి జాక్షులందు, వైవాహికము లందు
ప్రాణ విత్త మాన భంగమందు
జకిత గోకులాగ్ర జన్మరక్షణ యందు
బొంక వచ్చు.....తప్పు లేదు.
అది పాపము కాదు. అని శుక్రాచార్యుడు వివరించెను. దానికి బలి చక్రవర్తి ..కారే రాజులు రాజ్యముల్ కలుగవే, గర్వోన్నతిం బొందరే వారేరీ? సిరి మూట గట్టుకొని పోవంజాలిరే? భూమిపై పేరైనంగలదే! శిబి లాంటి దాతల పేరు ఈనాటికీ స్థిరములైనవి కదా! భార్గవా! అని పలుకుతూ తన మాటను తోసి పుచ్చిన రాజును పదభ్రష్టునివి గమ్మని శుక్రాచార్యుడు శపించాడు. అయినను బలిచక్రవర్తి హరి చరణములు కడిగి, "త్రిపాద ధరిణిం దాస్యామి" అనుచు నీటిధార విడిచాడు. ఆ కలశములో సూక్ష్మకీటక రూపమున చేరి శుక్రాచార్యుడు నీటిధారను ఆప బోయాడు. అప్పుడు హరి కుశాగ్రముతో కలశ రంధ్రమును బొడువగా కన్ను పోగొట్టుకొని శుక్రాచార్యుడు ఏక నేత్రుడయ్యెను. "పుట్టి నేర్చుకునెనో, పుట్టక నేర్చెనో.. ఈ పొట్టి వడుగునకీ చిట్టి బుద్ధులెట్లబ్బెనో, ఈతని పొట్టనిండా అన్నీ భూములే.. అని నవ్వుతూ మూడడుగుల నేలను బలి వడుగుకు దానమిచ్చెను.
ఒక పాదంబులో భూమిని కప్పి, దేవ లోకమును రెండవ పాదమున నిరోధించి, జగములెల్ల దాటి చనిన త్రివిక్రముడు మరల వామనుడై బలి నవలోకించి నా మూడవ పాదమునకు స్థలము జూపమన్నాడు. అప్పుడు బలి వినయముతో నీ తృతీయ పాదమును నా శిరమున ఉంచమని వేడుకొనగా సమ్మతించిన హరి బలిని ఆశీర్వదించి, ప్రహ్లాదునితో సుతల లోకమునకు పంపి, తానే ఆలోకమునకు ద్వారపాలకు డాయెను. బలి నడిగి సంపాదించిన లోకములను తన సోదరుడైన ఇంద్రున కిచ్చి సంతోషపరిచాడు శ్రీహరి.
"ఛలయసి విక్రమణే బలి మద్భుత వామన పదనఖ నీరజ నతజన పావన కేశవ ధృత వామన రూప జయ జగదీశహరే" -- జయదేవుని దశావతార స్తోత్రము ఈ వామనా వతార గాథను విన్న వారు, చదివిన వారు సకల శుభాలను పొందుతారు. దైవారాధన సమయంలో ఎవరైతే త్రివిక్రమ పరాక్రమాన్ని స్మరించు కుంటారో వారికి నిత్య సౌఖ్యాలు కలుగు. తాయని ప్రతీతి. వామన కంచిలో అద్భుతమైన వామన అవతారం గుడి ఉంది. మిత్రానంద పురము వామన మూర్తి దేవాలయం, చెరుపు, త్రిస్సూర్, కేరళ థ్రికక్కర (థ్రికక్కర ఆలయం), కొచ్చిన్, కేరళ కాంచీపురం సమీపంలోని కామాక్షి ఆలయం,
ఖజురహో, మధ్యప్రదేశ్,
ఉలగ లంథ పెరుమాళ్ దేవాలయం తిరుకొయిలూర్, విల్లుపురము జిల్లా, తమిళనాడు లలో ఆలయాలు ఉన్నాయి.

రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

# సంజ్ఞ భాషలతో చెవిటి వర్గాల సమ్మిళిత సుస్థిరాభివృద్ధి

**(23 సెప్టెంబర్ "అంతర్జాతీయ సంజ్ఞ లేదా సంకేత భాషల దినోత్సవం" సందర్భంగా)**

***సంజ్ఞ లేదా సంకేత భాష చెవిటి వారికి చదువు నేర్చుకోవడానికి, సమాచార వితరణకు, అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి, మన ప్రత్యేకతను చాటు కోవడానికి, సమ్మిళిత అభివృద్ధికి మహా వరంగా మారింది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 300 వరకు "సంజ్ఞ భాషలు" లేదా "సైన్ లాంగ్వేజెస్" ఉన్నాయి. సంజ్ఞ భాషలకు ప్రత్యేక పదకోశం, విలక్షణ వ్యాకరణం ఉంటాయి. సంజ్ఞ భాషలకు ప్రధాన ఉదాహరణలుగా భారతీయ, అమెరికన్, బ్రిటీష్ సంకేత భాషలు వస్తాయి. సంజ్ఞ భాష వ్యక్తీకరణకు ముఖ కవళికలు, బాడీ లాంగ్వేజ్‌లు ప్రధానమైనవిగా గుర్తించబడ్డాయి.***

సంజ్ఞ భాషను నేర్చుకోవడం ద్వారా వినికిడి లోపం కలిగిన అభాగ్య దివ్యాంగుల సమస్యలు అర్థం చేసుకోవడంతో పాటు వారి పట్ల సహానుభూతి పెరుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 72 మిలియన్ల చెవిటి దివ్యాంగులు ఉన్నారు. సహజ సిద్ధమైన సంజ్ఞ భాషల పట్ల సాధారణ ప్రజల్లో అవగాహన చాలా తక్కువగా కనిపిస్తుంది. చెవిటి వారు ప్రజలతో మమేకం కావడం, ప్రయాణాలు చేయడం, విద్యాభ్యాసం, కమ్యూనికేషన్ చేయడం, సమావేశాలకు హాజరు కావడం లాంటి సందర్భాలకు సంకేత భాష ప్రయోగించబడుతుంది.

వినికిడిలోపం కలిగిన దివ్యాంగులకు వరంగా సంజ్ఞ భాష:

చెవిటి తనకంతో బాధ పడుతున్న ప్రజలు ప్రజలతో మమేకం కావడానికి సంజ్ఞ భాష ఓ అద్భుత వరంగా మారింది. సంజ్ఞ భాష ప్రాధాన్యం గుర్తించిన ఐరాస 2017లో తీసుకున్న తీర్మానం ప్రకారం ప్రతి ఏట 23 సెప్టెంబర్ రోజున "అంతర్జాతీయ సంజ్ఞ భాష దినం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ సైన్ లాంగ్వేజెస్)"ను పాటించడం జరుగుతున్నది. చెవిటి వ్యక్తులు, ముఖ్యంగా వినికిడిలోపం కలిగిన యువతకు సంజ్ఞ భాష ప్రాధాన్యం వివరిస్తూ, వారికి ఈ భాషను నేర్పడం విధిగా జరగాలి. స్థానిక స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు చెవిటి ప్రజల సమస్యలను చర్చిస్తున్న వేదికల సమన్వయంతో సంజ్ఞ భాషను ఉపయోగించడం, అభివృద్ధి చేయడం, ప్రచారం చేయడం కొనసాగుతున్నది. వినికిడిలోపం కలిగిన ప్రజలను సాధారణ జనజీవన స్రవంతిలో కలిసి పోవడానికి సంజ్ఞ భాష ఉపకరిస్తున్నది. అంతర్జాతీయ సంజ్ఞ భాషల దినం-2026 ఇతివృత్తంగా "వినికిడి లోపం ఉన్న అభాగ్య దివ్యాంగుల మానవ హక్కులను పరిరక్షిద్దాం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ దినోత్సవ వేదికల్లో అవగాహన కలిపించడం, చెవిటి నిపుణుల ప్రసంగాలు ఏర్పాటు చేయడం, సంజ్ఞ భాష గూర్చి తెలుసుకోవడం, సైన్ లాంగ్వేజ్ క్లబ్బులు ఏర్పాటు చేయడం లాంటివి నిర్వహిస్తారు.

సాధారణ పౌర సమాజంతో చెవిటి వారిని అనుసంధానించడానికి సంజ్ఞ భాషలు చక్కగా ఉపయోగపడుతున్నాయి. మాటల్లో చెప్పలేని అద్భుత భావాలను సంజ్ఞలతో వ్యక్తం చేయడం ఓ అపురూప సందర్భం. సంజ్ఞ భాష ఒక కమ్యూనికేషన్ సాధనమే కాదు, అది రెండు హృదయాల కలయిక అవి తెలుసుకోవాలి. అందరితో సమానంగా విద్యను అభ్యసించడానికి సంజ్ఞ భాష దోహదపడుతున్నది. వినికిడా లోప దివ్యాంగుల మానవ హక్కుల పరిరక్షణలో సంజ్ఞ భాషలు సదా ఉపయోగపడుతున్నాయి. అన్ని అవయవాలు చక్కగా ఉన్న ప్రజలు సంజ్ఞ భాషలోని మౌళిక అంశాలను చేర్చుతొని, ఆ వర్గం ప్రజలతో సరదాగా మాట్లాడుదాం, మేం ఉన్నామన్న ధైర్యాన్ని అందిద్దాం.

లయన్ కెప్టెన్
డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

## “కోరే” కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో మహా అన్నదానం



**జమ్మికుంట, సెప్టెంబర్ 22 (సింగిడి) :** జమ్మికుంట మండలం రంగమ్మపల్లి గ్రామంలో గల ఎర్రగట్టు శివ భక్తాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గత ఐదు సంవత్సరాలుగా గ్రామానికి చెందిన కోరే లక్ష్మి కొమురయ్య కుమారుడు కోరే రాజకుమార్ నవ్యశ్రీ దంపతులు ఈ మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పుట్టిన ఊరు పై మమకారంతో ప్రతి సంవత్సరం స్వామివారి ఆశీస్సులతో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. హైదరాబాద్ డిఫెన్స్ అకాడమీ విద్యా సంస్థల చైర్మన్ నవ్య శ్రీ రాజకుమార్ దంపతులు ఈ మహత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. మంగళవారం నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో కోరే లక్ష్మి స్వయంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో కోరే స్రవంతి రమేష్ భరద్వాజ్ సూచిత ప్రణయ్ శ్రీ చరణ్ కుటుంబ సభ్యుల తో పాటు దేవస్థాన కమిటీ సభ్యులు రామాయణ కళాకారులు భజన భక్తులు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమానికి విజయవంతం చేశారు.

## హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆహ్వాన ఏర్పాట్లు




- ఏర్పాట్లకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్‌కు వినతి

**జమ్మికుంట, సెప్టెంబర్ 22 (సింగిడి) :** హిందూ ఉత్సవ కమిటీ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జమ్మికుంట గాంధీ చౌరస్తా వద్ద వినాయక నిమజ్జన స్వాగత కార్యక్రమానికి చేస్తున్న కార్యక్రమానికి అతిథిగా రావాలని ఆహ్వానిస్తూ ఇక్కడ చేస్తున్న ఏర్పాట్లకు సహకారం అందించాలని విశ్వహిందూ పరిషత్ హిందూ ఉత్సవ కమిటీ నాయకులు మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామికి మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ కు ఆహ్వాన పత్రిక అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇలాంటి మహత్తరమైన కార్యక్రమానికి తప్పకుండా మున్సిపల్ నుండి సహాయ సహకారాలు అందిస్తామని గాంధీ చౌరస్తాలో స్వాగత వేదికను ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం హిందూ ఉత్సవ కమిటీ నాయకులు మాట్లాడుతూ, మున్సిపల్ పరిధిలో గణపతి నవరాత్రి ఉత్సవాలను ఎంతో పవిత్రంగా ప్రశాంతంగా నిర్వహించుకుని నిమజ్జనానికి తరలివస్తున్న గణపతి మండప నిర్వాహకులను విశ్వహిందూ పరిషత్ హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్వాగతిస్తున్నామని తెలిపారు. గణపతి మండపనిర్వహకులు క్రమ పద్ధతిలో సాయంత్రం ఐదు గంటల వరకు జమ్మికుంట గాంధీ చౌరస్తాకి రాగానే వారికి మా తరఫున చిరు సన్మానం చేసి సత్కరిస్తామని ఇక్కడి నుండి క్రమ పద్ధతిలో గణపతి నిమజ్జనానికి తరలి వెళ్లాలని కోరారు. ప్రతి సంవత్సరం ఇక్కడ స్వాగత కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందని తప్పకుండా మా ఆహ్వానాన్ని స్వీకరించి నిర్వాహకులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ వైస్ చైర్మన్ కౌన్సిలర్ కొలుగూరి సురేష్ విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు ఇనుగంటి మధుసూదన్ రావు ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్యామ్ విశ్వహిందూ పరిషత్ పట్టణ అధ్యక్షుడు పాకాల రవీందర్ రెడ్డి కార్యదర్శి పత్తి జనార్దన్ రెడ్డి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గందె రఘు విశ్వహిందూ పరిషత్ జమ్మికుంట మహిళా అధ్యక్షులు దొడ్డ సునీత ఉపాధ్యక్షులు తమ్మిశెట్టి ఉమా సహాయ కార్యదర్శి చిటికేసి పద్మ సహాయ కార్యదర్శి సుద్దాల సుజాత యాంసాని సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పరాక్ సర్వే సూచనలకు అనుగుణంగా ప్రశ్నలు ఉండాలి

### జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి అశోక్ రెడ్డి



**జమ్మికుంట, సెప్టెంబర్ 22 (సింగిడి) :** పరాక్ రాష్ట్రీయ సర్వేక్షణ్ సర్వే--2024 నివేదికలోని సూచనల మేరకు పాఠశాలల్లో నిర్వహించే ఎఫ్ ఎ, ఎస్ ఏ పరీక్షల ప్రశ్నలు ఉండాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి కర్ర అశోక్ రెడ్డి సూచించారు. విద్యార్థులు ఎం ఎఫ్ సి నెలవారీగా దృష్టి పెట్టాల్సిన సామర్థ్యాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. హుజురాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రెండవ ప్రాథమిక స్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు నిర్దేశించిన అంశాలను తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు విధిగా తరగతి గదిలో ఇంగ్లీష్‌లో మాట్లాడాలని, తద్వారా విద్యార్థుల్లో ఇంగ్లీష్ భాషపై అవగాహన, మాట్లాడే నైపుణ్యాలు పెంపొందుతాయని తెలిపారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్ మాట్లాడుతూ... విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా బోధన చేపట్టాలని సూచించారు. ప్రతి విద్యార్థి నిర్దేశించిన అభ్యసన సామర్థ్యాలను సాధించేలా ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన విద్యా సహకారం అందించాలని అన్నారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ దేవారం గా శోభారాణి, ఆర్పీలుగా పత్తేం శ్రీనివాస్, అల్లి శ్రీనివాస్, తంగేళ్లపల్లి శ్రీనివాస్ వ్యవహరించారు. హుజురాబాద్ మండలంలోని ప్రధాన ఉపాధ్యాయులు,ఉపాధ్యాయులు 48 మంది పాల్గొన్నారు.

## నగరపాలక సంస్థలో ఘనంగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలు



**కరీంనగర్, సెప్టెంబర్22 (సింగిడి):** నగరపాలక సంస్థ కార్యాలయం లో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నవరాత్రుల్లో భాగంగా తొమ్మిదో రోజు మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మట్టి గణేశుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యం సమర్పించారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు ప్రారంభించారు. మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బందికి స్వయంగా వడ్డించి, వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వైద్యుల అంజన్ కుమార్, చాడగొండ కవిత బుచ్చిరెడ్డి, బోయినపల్లి ప్రవీణ్ రావు, మాసం గణేష్, కాల్వ మల్లేశ్వర, కాంతాల జగన్ రెడ్డి, బొట్ల శ్యామల కిరణ్, సోమిడి వేణు, పెద్దపల్లి శ్రీలేఖ జితేందర్, తాటి ప్రభావతి, ఆకుల నందిని ఉదయ్‌తో పాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మురుమూర్ పంచాయతీలో ‘నిధుల లెక్క’ ఎక్కడ?

**పనులు జరిగాయా..? బిల్లులు ఎలా వచ్చాయి..? వారపు సంత ఆదాయం ఏమైంది..?**

**పంచాయతీ వ్యవహారాలపై వరుస ఫిర్యాదులు..**

**రికార్డుల కోసం ఆర్టీఐకి కాంగ్రెస్ నాయకుడు మగ్గిడి సాగర్**

**అంతర్గాం, సెప్టెంబర్ 22 (సింగిడి):** మురుమూర్ గ్రామ పంచాయతీలో నిధుల వినియోగం, అభివృద్ధి పనులు, పంచాయతీ ఆదాయాల నిర్వహణపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పలు అంశాల్లో అవకతవకలు జరిగాయనే ఆరోపణలతో కాంగ్రెస్ నాయకుడు మగ్గిడి సాగర్ జిల్లా అధికారులను ఆశ్రయించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను తేల్చాలని ఆయన అధికారులను కోరారు. ‘రికార్డుల్లో పని.. క్షేత్రంలో కనిపిస్తుందా?’పంచాయతీలో చేపట్టినట్లు చూపుతున్న కొన్ని పనులపై ప్రధానంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డ్రైనేజీ పనులకు సంబంధించి వాస్తవంగా ఎంత పని జరిగింది? ఎంత మొత్తానికి బిల్లులు చెల్లించారు? జేసీబీ వినియోగానికి సంబంధించిన వివరాలు ఏమిటి? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉందని ఫిర్యాదుదారు పేర్కొన్నారు. ఎంబీ పుస్తకాలు, వర్క్ ఆర్డర్లు, బిల్లులు, చెల్లింపుల వివరాలను పరిశీలించడంతో పాటు సంబంధిత ప్రాంతాల్లో అధికారులు ప్రత్యక్ష తనిఖీలు నిర్వహించాలని కోరారు.

**వారపు సంత.. రూ.22 వేల వ్యవహారంపై ప్రశ్నలు**

మురుమూర్ వారపు సంత నిర్వహణకు సంబంధించిన వ్యవహారం కూడా ఫిర్యాదులో కీలకంగా మారింది. పంచాయతీ తీర్మానం లేకుండానే రెండేళ్లకు రూ.22 వేల మొత్తానికి సంతను అప్పగించారనే ఆరోపణలను మగ్గిడి సాగర్ ప్రస్తావించారు. వేలం ఎలా నిర్వహించారు? ఎవరి సమక్షంలో నిర్ణయం తీసుకున్నారు? పంచాయతీకి ఎంత ఆదాయం వచ్చింది? ఆ మొత్తం ఏ ఖాతాలో జమైంది? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరారు.

**చెట్ల ఆదాయం.. పంచాయతీ ఖాతాలో జమైందా?**

పంచాయతీ ఆవరణలోని చెట్లను నరికివేసి



విక్రయించినట్లు, దాని ద్వారా వచ్చిన సుమారు రూ.10 వేల మొత్తంపై కూడా లెక్కలు తేల్చాల్సి ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. చెట్ల తొలగింపునకు అనుమతులు, విక్రయ వివరాలు, రసీదులు, బ్యాంకు జమలను పరిశీలించాలని కోరారు.

**ఆర్టీఐతో తెరపైకి రానున్న అసలు లెక్కలు**

ఆరోపణలకు ఆధారంగా ఉన్న రికార్డులను సేకరించేందుకు సమాచార హక్కు చట్టాన్ని ఆశ్రయించినట్లు మగ్గిడి సాగర్ తెలిపారు. నూతన సర్పంచ్ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి సెప్టెంబర్ 22, 2026 వరకు పంచాయతీకి వచ్చిన నిధులు, ఖర్చులు, అభివృద్ధి పనులు, బిల్లులు, తీర్మానాలు, ఎంబీ రికార్డులు, బ్యాంకు లావాదేవీల పూర్తి వివరాలను కోరినట్లు చెప్పారు.

**కాగితాల్లో లెక్కలు కాదు.. క్షేత్రంలో నిజాలు కావాలి**

పంచాయతీ నిధులపై వచ్చిన ఆరోపణలకు రికార్డులతో పాటు క్షేత్రస్థాయి పరిశీలనతోనే సమాధానం లభిస్తుందని మగ్గిడి సాగర్ అన్నారు. పనుల అంచనాలు, బిల్లులు, చెల్లింపులు, వాస్తవ పనులను అధికారులు సరిపోల్చి సమగ్ర విచారణ నిర్వహించాలని కోరారు.

**విచారణతోనే వాస్తవం వెలుగులోకి..**

మురుమూర్ పంచాయతీపై వచ్చిన ఆరోపణలు ప్రస్తుతం ఫిర్యాదుల స్థాయిలోనే ఉన్నాయి. వాటిపై అధికారిక విచారణ పూర్తయ్యే వరకు ఆరోపణలు నిర్ధారణ అయినవిగా పరిగణించలేమని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. అధికారులు విచారణ చేపట్టి నివేదిక వెల్లడిస్తేనే నిధుల వినియోగంపై వాస్తవ పరిస్థితి స్పష్టమయ్యే అవకాశం ఉంది.

## వినాయక నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించిన చైర్మన్, కమిషనర్

**భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు**

**మండప నిర్వహకులు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలి**

**మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్‌కుమార్**

**జమ్మికుంట, సెప్టెంబర్ 22 (సింగిడి) :** నేడు జరగనున్న వినాయక నిమజ్జనానికి జమ్మికుంట పట్టణంలో గల నాయిని చెరువు పై నిమజ్జనం చేసే చోట ఏర్పాట్లు ఎందుకు పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి చైర్మన్ ప్రశాంత్ కుమార్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నిమజ్జనానికి అన్ని విధాల ఏర్పాటు చేయడం జరుగుతుందని దాదాపు పనులు చివరి దశకు చేరుకున్నాయని ప్రశాంతమైన వాతావరణంలో మండప నిర్వహకులు నిమజ్జనం చేసుకోవాలని కోరారు. నాయిని



చెరువు పై బారికెట్లు ఏర్పాటు చేయడం జరిగిందని దానితోపాటు లైటింగ్ సిస్టం కూడా ఏర్పాటు చేశామని భక్తులు గణపతి మండప నిర్వహకులు మున్సిపల్ సిబ్బందికి సహకరించి ప్రశాంతమైన వాతావరణంలో నిమజ్జనం జరుపుకోవాలని కోరారు. నిమజ్జనం కొరకు రెండు భారీ క్రేన్లను ఏర్పాటు చేశామని మున్సిపల్ సిబ్బంది గణపతి విగ్రహాలను క్రేన్ల ద్వారా నాయిని చెరువులో నిమజ్జనం చేస్తారని తెలిపారు.

**ప్లాస్టిక్ గణపతి విగ్రహాలను నిషేధిస్తాం**

ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామి చైర్మన్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ, నాయిని చెరువులో గత సంవత్సరం వేసిన పిఓపి వినాయక విగ్రహాలు ఇంకా అలాగే ఉన్నాయని ఇది ప్రమాదకరమైన విషయమని దీనిద్వారా చెరువులో కలుషిత నీరు తయారవుతుందని తెలిపారు. వచ్చే సంవత్సరం పట్టణంలో పిఓపి వినాయకులను ఏర్పాటు చేయడానికి అనుమతులు ఇవ్వమని ఇవి ప్రజా సంక్షేమం కోసం ఈ నిర్ణయం తీసుకుంటున్నామని తెలిపారు. ఒకవైపు నీటి కొరత మరొకవైపు ప్లాస్టిక్ వినియోగంతో చెరువులో విషపూరితమైన రసాయనాలు తయారై ప్రజల ఆరోగ్యంతో పాటు జంతువుల ఆరోగ్యం కూడా క్షీణిస్తుందని ప్రజలు మండప నిర్వహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి రాబోయే వినాయక చవితికి ప్లాస్టిక్ రహిత వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకోవడానికి ప్రోత్సహిస్తామని తెలిపారు. ఇది అందరి బాధ్యతగా భావించి సహకరించాలని కోరారు.

## వసతిగృహాన్ని సందర్శించిన అడిషనల్ కలెక్టర్ హరిప్రసాద్

**విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి**

**అధికారులకు సూచించిన అడిషనల్ కలెక్టర్**

**జమ్మికుంట, సెప్టెంబర్ 22 (సింగిడి) :** హాస్టల్ విద్యార్థుల కోసం జమ్మికుంటలో సొంత భవనం అందుబాటులో ఉన్నప్పటికీ, విద్యార్థులకు ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్న అద్దె భవనంలో బీసీ హాస్టల్ నిర్వహిస్తున్న అంశంపై విచారణ జరిపి తక్షణ చర్యలు తీసుకోవాలని, సమయపాలన పాటించకుండా ఇష్టానుసారం వ్యవహరి స్తున్న వార్డెన్స్‌పై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య



విద్యార్థి సంఘం కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా కు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా స్పందించిన కలెక్టర్ మంగళవారం అడిషనల్ కలెక్టర్ హరి ప్రసాద్ ను పంపగా అడిషనల్ కలెక్టర్ హరిప్రసాద్ బిసి వసతి గృహాన్ని సందర్శించారు. జిల్లా కలెక్టర్కు విద్యార్థి సంఘాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కలెక్టర్ స్పందించి ట్రైని కలెక్టర్ హరిప్రసాద్ జమ్మికుంట లోని బీసీ వసతి గృహాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న భవన నిర్మాణంతో పాటు విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలు నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అని పరిశీలించిన అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా బీసీ వెల్ఫేర్ డైరెక్టర్ అనిల్ ప్రకాష్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రేణి కలెక్టర్ తో కలిసి ఇక్కడి పాఠశాల భవనాన్ని పరిశీలించడం జరిగిందని విద్యార్థులను ప్రైవేటు భవనంలోకి మార్చి 6 నెలలలో ప్రభుత్వ భవనాన్ని పూర్తిస్థాయిలో మరమత్తులు చేసి సిద్ధం చేస్తామని ఆయన పేర్కొన్నారు. పాఠశాలకు సంబంధించి ఆహార పదార్థాల నాణ్యత ప్రమాణాలను పరిశీలించడంతో పాటు ప్రస్తుతం ఉన్న విద్యార్థుల యొక్క సంఖ్యను నమోదు చేసుకోవడం జరిగిందని అన్నారు. పాఠశాలలో ఉన్న వాడెను విద్యార్థులకు అందుబాటులో ఉంటూ తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో తాహసిల్దార్ గడ్డం సుధాకర్ డిప్యూటీ డైరెక్టర్ అనిల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ గడ్డం శంకర్ వార్డెన్ నరేష్ జిపిఓ లు హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

**జమ్మికుంట, సెప్టెంబర్ 22 (సింగిడి) :** జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ, కళాశాలలో ఈనెల 24, 25 తేదీలలో డిగ్రీ స్పాట్ అడ్మిషన్లు ఇవ్వడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి. రమేష్ తెలిపారు. జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరే విద్యార్థులు డిగ్రీ దోస్త్ ద్వార స్పాట్ అడ్మిషన్లు కల్పించనున్నామని, డిగ్రీలో చేరే విద్యార్థులకు ఇదే చివరి అవకాశమని అన్నారు. స్పాట్ అడ్మిషన్ల ద్వార డిగ్రీలో చేరే విద్యార్థులకు ఫీజు రీంబర్స్ మెంట్ లేదన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరే విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికేట్లు, జిరాక్స్ కాపీలు తీసుకొని కళాశాలకు ఈనెల 24, 25 తేదీలలో రాగలరని ఆయన కోరారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరేందుకు విద్యార్థులకు వచ్చిన మరో మంచి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం



చేసుకోవాలన్నారు. కళాశాలలో దాతల సహకారంతో ఉచిత మధ్యాహ్న భోజనం నిర్వహిస్తున్నా మన్నారు. కళాశాలలో ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ , డిజిటల్ లైబ్రరీ, టీఎస్ కేసీ ల్యాబ్ , ఆధునిక కంప్యూటర్ ల్యాబ్ లు, డిజిటల్ తరగతులు వంటి మెరుగైనా వసతులు ఉన్నాయన్నారు. గత విద్యాసంవత్సరంలో కళాశాలలో 42 మంది విద్యార్థులు వివిధ కంపెనీలలో ఉద్యోగాలు సాధించారని, మరో 40 మంది విద్యార్థులు వివిధ ఉద్యోగాల శిక్షణకు ఎంపికైయ్యారని పేర్కొన్నారు. అలాగే మరో పది మంది విద్యార్థులు కేంద్రీయ విశ్వ విద్యాలయాలలో పీజీ సీట్లు సాధించడం చాల సంతోషకరమైన విషయమన్నారు. ఈ కళాశాలలో నూతన కోర్సు బీకాం తో పాటు బిఏ బీకాం బీఎస్సీ లలో కంప్యూటర్ కోర్సులు, ఆఫీస్ మేనేజ్మెంట్, డైరీ సైన్స్, క్రాప్ ప్రొడక్షన్ వంటి ఉపాధి కల్పించే మంచి కోర్సులు ఉన్నాయన్నారు. విద్యార్థులు తమ బంగారు భవిష్యత్ కై జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరే ఈ చివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# గణేష్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

## 3,100 విగ్రహాలకు భద్రతా ఏర్పాట్లు పూర్తి : సీపీ గౌష్ ఆలం

**కరీంనగర్, సెప్టెంబర్ 22(సింగిడి):** గణేష్ నిమజ్జన మహోత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. కమిషనరేట్ పరిధిలో సుమారు 3,100 విగ్రహాలకు బందోబస్తు ఏర్పాటు చేశామని, కరీంనగర్ నగరంలో సుమారు 1,000 విగ్రహాలు ఉండగా, వాటిలో 800కు పైగా విగ్రహాలు ప్రధాన రహదారుల మీదుగా నిమజ్జన కేంద్రాలకు తరలివెళ్లనున్నాయని పేర్కొన్నారు. మానకొండూర్ చెరువులో 50 శాతం, చింతకుంట కాలువలో 30 శాతం, కొత్తపల్లి చెరువులో 20 శాతం విగ్రహాలు నిమజ్జనం కానున్నాయని తెలిపారు. భారీ విగ్రహాల కోసం మానకొండూర్ చెరువు, చింతకుంట కాలువ వద్ద క్రేన్లు, విద్యుత్ దీపాలతోపాటు అవసరమైన ఏర్పాట్లు చేశారు. నిమజ్జన విధుల కోసం 850 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని నియమించారు. ప్రధాన కూడళ్లలో స్థిర బందోబస్తు, గస్తీ బృందాలతోపాటు సున్నిత ప్రాంతాలు, ప్రార్థనా మందిరాల వద్ద ప్రత్యేక భద్రత ఏర్పాటు చేశారు. ఎత్తైన భవనాలపై ప్రత్యేక బృందాలను మోహరించడంతోపాటు అత్యవసర పరిస్థితుల కోసం అదనపు బలగాలను



సిద్ధంగా ఉంచారు. చెరువుల వద్ద అడ్డుకట్టలు, విద్యుత్ దీపాలు, గజ ఈతగాళ్లు, విపత్తు నివారణ బృందాల పడవలను అందుబాటులో ఉంచారు. జిల్లా యంత్రాంగం, నగరపాలక సంస్థ, ఇతర శాఖల అధికారులతో సమన్వయంతో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్లు సీపీ తెలిపారు. నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు అవసరమైన ప్రాంతాల్లో భారీ వాహనాల దారి మళ్లింపు, ఏకమార్గ విధానం, ఇతర ఆంక్షలు అమలు చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు గణేష్ నిమజ్జన వేడుకలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని, శబ్ద కాలుష్య నిబంధనలు పాటించాలని సీపీ కోరారు. వృద్ధులు, చిన్నారులు, ఆసుపత్రుల పరిసరాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, విధుల్లో ఉన్న పోలీసుల సూచనలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## మారుతీ యూత్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ





**మానకొండూర్, సెప్టెంబర్ 22 (సింగిడి):** మానకొండూర్ మండలం రంగపేట గ్రామంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా మారుతీ యూత్ ఆధ్వర్యంలో గ్రామంలో ఘనంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మానకొండూర్ సి.ఐ శ్రీలత, ఎస్.ఐ తిరుపతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ముందుగా గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేసి,నిమర్జనం లో తీసుకోవాల్సిన సూచనలు,జాగ్రత్తలు చెప్పారు. ఈ అన్నదాన కార్యక్రమంలో ప్రముఖులు, గ్రామ సర్పంచ్ కొత్త రాంరెడ్డి, ఉప సర్పంచ్ వేల్పుల కొమురయ్య,గుడాల మహేందర్ గౌడ్,రామిడి తిరుమలరెడ్డి, గూడాల శ్రీనివాస్ గౌడ్, మండల బకారెడ్డి, రేవెల్లి రాజలింగం, నాగుల సంపత్, కొక్కిరాల లక్ష్మారెడ్డి, గోపు వెంకట్ రెడ్డి, నాగుల సతీష్, నాగుల కొమరయ్య, నాగుల అంజయ్య, అగ్గి ఆంజనేయులు, మాందాటి అరవింద్, పిట్టల అనిల్, అమ్ముల కిరణ్, మందల రాంరెడ్డి, రాపల్లి రాకేష్, ఓదెల అఖిల్,రుద్రారం అశోక్, రుద్రారం శంకర్,మారుతీ యూత్ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలను సందర్శించిన ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు



**జమ్మికుంట, సెప్టెంబర్ 22 (సింగిడి) :** జమ్మికుంట పట్టణంలోని పాత ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థులకు న్యాయం చేయాలని భవనం చెక్కుచెదరని స్థితిలో ఉన్నా కూడా దీన్ని ఎందుకు మూసివేసారు అని ప్రశ్నించారు. సరైన హాస్టల్ వసతులు లేక సరైన హాస్టల్ లేక విద్యార్థులు ఎంతోమంది చాలా ఇబ్బందులు పడుతున్నారని ఎంతో దూరం నుండి విద్యార్థులు చదువుకోవడానికి కాలేజీలకు వస్తున్నారని వారికి సరైన సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి వెంటనే పాత భవనంలో విద్యార్థులకు హాస్టల్ వసతులు కల్పించాలని లేని యెడల విద్యార్థులతో పాటు పెద్ద ఎత్తున ధర్నాకు పిలుపునిస్తామని తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ ఎస్ ఎఫ్ డి సి ఓ కన్వీనర్ గోస్కుల అజయ్, జమ్మికుంట నగర కార్యదర్శి భోగం శశాంక్, రోహిత్, ఆఫ్రిద్, మోయిన్, సల్మాన్, రిషికేష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినుల భద్రత, ఆరోగ్యంపై రాజీ వద్దు

- మెనూ ప్రకారం భోజనం.. నాణ్యమైన విద్య అందించాలి
- కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, సెప్టెంబర్22(సింగిడి):** విద్యార్థినుల భద్రత, ఆరోగ్యం విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం, మెరుగైన విద్య అందించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం రేకుర్తిలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల గురుకులాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, ప్రయోగశాల, గ్రంథాలయం, అనారోగ్య గది, వసతి గృహం, భోజనశాలను పరిశీలించిన కలెక్టర్.. సీసీ కెమెరాల పనితీరు, సిబ్బంది వివరాలు, విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. నీట్, ఐఐటీ ప్రవేశ పరీక్షలకు సిద్ధమవుతున్న ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థినులతో మాట్లాడి వారి చదువు, పాఠ్య సామగ్రి, వసతి సౌకర్యాలపై ఆరా తీశారు. వివరాలను రిజిస్టర్లలో సక్రమంగా నమోదు చేయాలని ప్రిన్సిపాల్ మౌనిక సోనీని ఆదేశించారు. వసతి గృహం వద్ద నీరు నిల్వ ఉండటంతో మురుగు కాలువ సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. గురుకులానికి సొంత భవనం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినులకు ఏవైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ తనిఖీలో జిల్లా రెవెన్యూ అధికారి, ఇన్‌చార్జి జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి స్వామి, జిల్లా ఉర్దూ అధికారి మహమ్మద్ అఖిల్ అహ్మద్, ప్రిన్సిపాల్ మౌనిక సోనీ తదితరులు పాల్గొన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన త్యాగాలు చిరస్మరణీయం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**భూపాలపల్లి, సెప్టెంబర్ 22(సింగిడి):** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన కృషి, త్యాగాలు చిరస్మరణీయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. కొండ లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కాపాడుతూ ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కొండ లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బాపూజీ చేసిన పోరాటం, అందించిన సేవలను ఎల్లవేళలా స్మరించుకోవలసిన అవసరం ఉందన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి టౌన్ అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్, భూపాలపల్లి పద్మశాలి సంఘం నాయకులు, చిట్యాల మండల అధ్యక్షులు పద్మశాలి సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## టంగుటూరులో మెగా వైద్య శిబిరం

ఆరు నెలలకు ఒకసారి ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తాం: సర్పంచ్ జూకంటి అనిల్



**ఆలేరు, సెప్టెంబర్ 22(సింగిడి):** ఆలేరు మండలం టంగుటూరు గ్రామంలో సర్పంచ్ జూకంటి అనిల్, హ్యాండ్లూమ్ వీవర్స్ కో–ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ దాసి శంకర్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మెడిసిటీ హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరానికి గ్రామస్థుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో మెగా హెల్త్ క్యాంపును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజల సహకారంతో ఇకపై ప్రతి ఆరు నెలలకు ఒకసారి గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహించేందుకు కృషి చేస్తామని చెప్పారు. శిబిరంలో వివిధ రకాల అనారోగ్య సమస్యలకు వైద్యులు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. వైద్య శిబిరానికి గ్రామం నుంచి వందలాది మంది ప్రజలు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు కల్పించేందుకు ఇలాంటి శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ భూపల్లి అక్షయ రాజు, వార్డు సభ్యులు బండి రమేష్, జన్నే రవి, కవిడే మహేందర్, కల్లెపు సుభాష్, చేనేత సహకార సంఘం డైరెక్టర్ అందే రాములు, మాజీ కార్యదర్శి రామఋషి పాల్గొన్నారు.

## మునగాల పీహెచ్‌సీలో ఖాళీలను భర్తీ చేయాలి

**మునగాల, సెప్టెంబర్ 22(సింగిడి):** మునగాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (ప్రాఆకే)లో ఖాళీగా ఉన్న వైద్య, సిబ్బంది పోస్టులను పూర్తి స్థాయిలో భర్తీ చేయాలని ఎం. ఆంజనేయ శర్మ అధికారులను కోరారు. మునగాల మండలంలోని ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు అందించడంలో పీహెచ్‌సీ కీలకంగా ఉందని తెలిపారు. ప్రస్తుతం వైద్యులు, సిబ్బంది కొరత కారణంగా ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. పీహెచ్‌సీకి అవసరమైన సిబ్బందిని నియమించి, వైద్య సేవలను మరింత మెరుగుపరచాలని కోరారు. మునగాల పీహెచ్‌సీలో 24 గంటల పాటు పూర్తి స్థాయి వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, అత్యవసర వైద్య సేవలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను విజ్ఞప్తి చేశారు.

# ఓబీసీ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి



**హన్మకొండ, సెప్టెంబర్ 22(సింగిడి):** తెలంగాణ ఉద్యమ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతిని హనుమకొండ రాంనగర్ లోని బీసీ భవన్‌లో ఓబీసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీసీ నేతలు, వివిధ కులసంఘాల ప్రతినిధులతో కలిసి ఓబీసీ చైర్మన్, కుడా మాజీ చైర్మన్ ఎస్. సుందర్ రాజ్ యాదవ్ , ఓబీసీ ప్రధాన కార్యదర్శి, ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాలు, చేనేత కార్మికుల సంక్షేమం కోసం బాపూజీ చేసిన కృషిని ఓబిసి చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ గుర్తుచేశారు. ప్రజా ప్రయోజనాల కోసం పదవులను సైతం త్యాగం చేసిన ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమనీ కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు, స్వాతంత్ర్య సమరయోధుడని, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని సుందర్ రాజ్ యాదవ్ అన్నారు. ఓబీసీ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చూపిన నిబద్ధత, ధైర్యం, త్యాగం, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. మలిదశ ఉద్యమంలో తన నివాసాన్ని తెలంగాణ ఉద్యమం కోసం కేటాయించారన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.. ఆయన సేవలను భావితరాలకు తెలియజేసేలా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోనగాని యాదగిరి గౌడ్, బీసీ నాయకులు సంగం వేణుమాధవ్ గౌడ్, గాజుల సంపత్, చక్రపాణి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కొనసాగిద్దాం

- హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ దాసి శంకర్



**ఆలేరు, సెప్టెంబర్ 22(సింగిడి):** ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ ఆలేరు చైర్మన్ దాసి శంకర్ పిలుపునిచ్చారు. కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతి సందర్భంగా ఆలేరు పట్టణంలోని హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయం, కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దాసి శంకర్ మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ తన జీవితాన్ని సమాజ సేవకు అంకితం చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. స్వాతంత్ర్య పోరాటం, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేక ఉద్యమం, ప్రత్యేక తెలంగాణ ఉద్యమం.. ఇలా మూడు దశల ఉద్యమాల్లో ప్రముఖ పాత్ర పోషించి దేశ సేవకు అంకితమైన మహనీయుడని పేర్కొన్నారు. పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన బాపూజీ చేనేత కార్మికుల సంక్షేమం కోసం కూడా విశేషంగా కృషి చేశారని తెలిపారు. తెలంగాణ విముక్తి, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తన మంత్రి పదవిని సైతం త్యాగం చేసిన గొప్ప వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని దాసి శంకర్ అన్నారు. ఆయన త్యాగాలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. బాపూజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు చేనేత రంగం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు చింతకింది మురళి, సంఘం కార్యదర్శి గాడిపెల్లి రమేష్, వైస్ చైర్మన్ చింతకింది రంగా, సహాయ కార్యదర్శి బింగి నర్సింహులు, డైరెక్టర్లు అందె రాములు, ఎలగందుల పద్మ, బేతి భాగ్య, మాజీ కార్యదర్శి ఎలగందుల రామారుషి, చేనేత నాయకులు చింతకింది రామానుజం, రచ్చ హన్మంతు, రేగోటీ వెంకటేష్, గుజ్జ అశోక్, చింతకింది సిద్ధులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడా ఎంపికలకు రూ.10 వేల విరాళం



**మునగాల, సెప్టెంబర్ 22(సింగిడి):** మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న కోదాడ నియోజకవర్గస్థాయి అండర్–14, అండర్–17 బాలబాలికల కబడ్డీ, వాలీబాల్ క్రీడా ఎంపిక కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ శ్రీమతి నల్లపాటి ప్రమీల శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. క్రీడలతో విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి పెంపొందుతాయన్నారు. క్రీడా ఎంపికల్లో పాల్గొంటున్న విద్యార్థులకు సౌకర్యాలు కల్పించేందుకు నల్లపాటి శ్రీరామ్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ. 10,000 నగదును నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో క్రీడా నిర్వాహకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ నూతన అధ్యక్షురాలికి వాసిరెడ్డి నరేష్ శుభాకాంక్షలు



**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 22(సింగిడి):** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షురాలిగా నియమితులైన చీగిరింత పారిజాత ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త వాసిరెడ్డి నరేష్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వాసిరెడ్డి నరేష్ మాట్లాడుతూ... రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంలో నూతన అధ్యక్షురాలి నాయకత్వం కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యలపై చురుకుగా పోరాడాలని, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయాలని కోరారు. మణికొండ డివిజన్ పరిధిలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, పార్టీ సంస్థాగత బలోపేతం భవిష్యత్ కార్యాచరణపై ఇరువురు వివరంగా చర్చించారు. మణికొండ డివిజన్‌తో పాటు జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలను ఐకమత్యంగా ముందుకు నడిపిస్తూ, స్థానిక ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించినట్లు వాసిరెడ్డి నరేష్ తెలిపారు.

# యువత సామాజిక సేవలోను ముందుండాలి

- పటేల్ రమేష్ రెడ్డి



**సూర్యాపేట ప్రతినిధి సెప్టెంబర్ 22(సింగిడి):** యువత నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తూ సామాజిక సేవలోనూ చురుకుగా పాల్గొనాలని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని 21వ వార్డులో మాజీ కౌన్సిలర్లు జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎలుగూరి బాలు గౌడ్ తండు శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవడం సంతోషకరమని అన్నారు. అన్నివర్గాల ప్రజలు సమిష్టిగా వినాయక చవితి జరుపుకోవడం మతసామరస్యానికి ప్రతీకని తెలిపారు. అనంతరం కమిటీ సభ్యులు ఆయనను శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రవి, శ్రీను,హరీష్, సందీప్,చాంద్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

## గణపయ్య నిమజ్జనానికి నీటి కరువు

ట్యాంకర్లతో నీటిని నింపుతున్న అధికారులు



**జమ్మికుంట సెప్టెంబర్ 22 (సింగిడి):** విఘ్నాలను తొలగించే గణనాథుడి నిమజ్జనానికి నీటి కరువు ఏర్పడింది. హుజురాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు స్థానిక ఎస్సారెస్పీ కాలువలో నీరు లేకపోవడంతో పాటు సకాలంలో వర్షాలు కురియకపోవడంతో నిర్వాహకులు, భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో చేసేది లేక మున్సిపల్ అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించి, కాలువలోని ఒక వైపున ఇసుక బస్తాలతో అడ్డుకట్ట ఏర్పాటు చేసి నీటిని నిల్వ చేస్తున్నారు. గణపతి విగ్రహాల నిమజ్జనానికి అనువుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సమస్యపై స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అధికారులతో మాట్లాడినప్పటికీ ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో ఫలితం లేకపోయిందని స్థానికులు చెబుతున్నారు. ఏది ఏమైనా.. విఘ్నాలను తొలగించే వినాయకుడికే నీటి కష్టాలు తప్పకపోవడం ప్రస్తుతం హుజురాబాద్‌లో చర్చనీయాంశంగా మారింది.

## అలుగునూరులో గణనాథులను దర్శించుకున్న మేయర్

ప్రత్యేక పూజలు నిర్వహించి నగర ప్రజల సుఖసంతోషాల కోసం ప్రార్థన



**కరీంనగర్, సెప్టెంబర్22(సింగిడి):** నగరంలోని 8వ డివిజన్ అలుగునూరులో వివిధ ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన గణనాథులను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. కౌండిన్య యువజన సంఘం, విశ్వామిత్ర యువజన సంఘం, మహాలక్ష్మి గణపతి యువజన సంఘం, లిటిల్ స్టార్స్ యువజన సంఘం, మున్నూరుకాపు సంఘం, శ్రీ పంచముఖ హనుమాన్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద మేయర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నగర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని గణనాథుడిని ప్రార్థించారు. ఆయా ప్రాంతాల నిర్వాహకులు మేయర్‌ను సాదరంగా ఆహ్వానించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర, బీజేవైఎం మాజీ జిల్లా అధ్యక్షులు దుర్శెట్టి సంపత్, తిమ్మాపూర్ మండల అధ్యక్షులు చింతం శ్రీనివాస్, మాజీ మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరచారి, బీజేవైఎం మండల అధ్యక్షులు గడ్డం అరుణ్, బీజేపీ పోటీ చేసిన కార్పొరేటర్ అభ్యర్థి తోర్తి సంతోష్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే శ్రీ పంచముఖ హనుమాన్ యువజన సంఘం సభ్యులు, ఆలయ కమిటీ బాధ్యులు సల్ల రాజయ్య, సిరిపురం శ్రీనివాస్, రాజిరెడ్డి, సుధాకర్ రెడ్డి, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

## అశోక్‌నగర్‌లో ఘనంగా అన్నప్రసాద వితరణ

కార్పొరేటర్ ఉమారాణి జన్మదిన వేడుకలు

ముఖ్యఅతిథిగా మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్, సెప్టెంబర్22 (సింగిడి):** నగరంలోని అశోక్‌నగర్‌లో వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మంగళవారం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. అనంతరం డివిజన్ కార్పొరేటర్ ఉమారాణి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ శ్రీనివాస్ కేక్ కట్ చేయించి, ఉమారాణికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## 'రొంటాల' ఆధ్వర్యంలో గణపతి ప్రత్యేకపూజలు



**మానకొండూర్, సెప్టెంబర్22(సింగిడి):** వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్ లో గణనాథునికి దేవంపల్లి ప్యాక్స్ చైర్మన్ రొంటాల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్లు నాగిశెట్టి రాజయ్య మానకొండూర్, ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి ఊటూరు, గంగుల రాంరెడ్డి గట్టుదుద్దెనపల్లి,డైరెక్టర్లు వరహాల చారి, బాలగోని మల్లయ్య, వెల్మరెడ్డి సత్యనారాయణరెడ్డి, నల్లంగి అయిలయ్య, సంపత్, గోపు రాజు, కనకరాజు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్లపల్లి సంపత్ గౌడ్, నాయకులు మర్రి ఓదెలు యాదవ్, రామిడి తిరుమల్ రెడ్డి, రేమిడి శ్రీనివాస్ రెడ్డి, రామడుగు హరీష్, తోట శ్రీనివాస్, మాడ తిరుపతిరెడ్డి, లలితపూర్ ఉప సర్పంచ్ మర్రి కుమారస్వామి,కనకం అశోక్, దూలం వీరస్వామి, బి.సునిల్, గొల్లెన కొమురయ్య, బుర్ర చంద్రాకర్, నల్ల సూర్య, తదితరులు పాల్గొన్నారు.

## 40 ఏళ్ల వైద్య సేవలకు గుర్తింపు: డా.మురహరికి సన్మానం

డాక్టర్ చింతకింది మురహరికి ఘన సన్మానం



**ఆలేరు, సెప్టెంబర్ 22(సింగిడి):** ఆలేరు పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు సుమారు 40 సంవత్సరాలుగా వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ చింతకింది మురహరికి వైద్య పండిత అవార్డు లభించిన సందర్భంగా ఘనంగా సన్మానించారు. దీర్ఘకాలంగా ప్రజలకు అందించిన వైద్య సేవలను గుర్తించి ఈ అవార్డు దక్కడం పట్ల పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో డాక్టర్ మురహరిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ప్రజలకు నిబద్ధతతో వైద్య సేవలు అందిస్తూ నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్న ఆయన సేవలు అభినందనీయమని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు కూతాటి అంజన్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు మోతె వెంకటేష్, వి. మదార్, శ్రీశాంత్, సాగర్ హాస్పిటల్ సిబ్బంది భార్గవి, కళ్యాణి, అనూష తదితరులు పాల్గొన్నారు.

# ‘మసాలా చపాతీ రోల్’!





ఇది కేవలం రుచికరమైనది మాత్రమే కాదు, మన ఇంట్లో నిత్యం అందుబాటులో ఉండే కూరగాయలతో చేసేది కాబట్టి చాలా ఆరోగ్యకరమైనది కూడా. హోటల్ తరహా రుచిని ఇంట్లోనే పది నిమిషాల్లో తీసుకురావచ్చు. అటు అల్పాహారంగా, ఇటు సాయంత్రం స్నాక్ లాగా లేదా ఆఫీస్ లంచ్ బాక్స్ లోకి కూడా ఇది ఒక పర్ఫెక్ట్ ఛాయిస్. మరి ఈ క్రీమీ అండ్ స్పైసీ రోల్ ఎలా తయారు చేయాలో ఇప్పుడు వివరంగా చూద్దాం.



**తయారీ విధానం:**
మొదటగా ఒక బాణలిలో నూనె వేడి చేసి జీలకర్ర వేయాలి. ఆ తర్వాత సన్నగా తరిగిన ఉల్లిపాయలు, అల్లం-వెల్లుల్లి పేస్ట్ వేసి పచ్చి వాసన పోయే వరకు వేయించాలి. ఇప్పుడు తరిగి పెట్టుకున్న క్యారెట్, క్యాబేజీ, క్యాప్సికమ్ ముక్కలను వేసి కొద్దిసేపు మగ్గనివ్వాలి. కూరగాయలు మరీ మెత్తగా అవ్వకుండా కొంచెం క్రంచీగా ఉంటేనే రోల్ రుచిగా ఉంటుంది.

కూరగాయలు వేగిన తర్వాత పసుపు, కారం, గరం మసాలా, ఉప్పు వేసి బాగా కలపాలి. చివరగా ఉడికించిన బంగాళదుంప ముక్కలు లేదా పనీర్ ముక్కలు వేసి మసాలా అంతా పట్టేలా కలిపి కొత్తిమీర చల్లుకోవాలి. ఇప్పుడు సిద్ధంగా ఉన్న చపాతీని తీసుకుని దానిపై టమాటా సాస్ లేదా గ్రీన్ చట్నీని సమానంగా పూయాలి. మధ్యలో మనం తయారు చేసుకున్న మసాలా మిశ్రమాన్ని ఉంచి చపాతీని రోల్‌లా చుట్టాలి.

**రుచి పెంచే చిన్న చిట్కాలు:**
మీరు దీనిని మరింత స్పెషల్ గా చేయాలనుకుంటే లోపల కొద్దిగా చీజ్ తురుము వేయవచ్చు, ఇది పిల్లలకు చాలా ఇష్టం. అలాగే పనీర్ లేదా చికెన్ ముక్కలను జోడించడం వల్ల ప్రోటీన్ కూడా లభిస్తుంది. సర్వ్ చేసేటప్పుడు రోల్‌ను టిష్యూ పేపర్ లేదా అల్యూమినియం ఫాయిల్‌లో చుడితే తినడానికి సౌకర్యంగా ఉంటుంది.



**కావలసిన పదార్థాలు:**
మెత్తటి చపాతీలు -2 లేదా 3
ఉల్లిపాయ - 1 (సన్నగా తరిగినవి)
క్యారెట్, క్యాబేజీ, క్యాప్సికమ్ - తగినంత (సన్నని ముక్కలు)
ఉడికించిన బంగాళదుంప లేదా పనీర్ ముక్కలు - 1 కప్పు
అల్లం-వెల్లుల్లి పేస్ట్ - 1 టీస్పూన్
పసుపు -- చిటికెడు
కారం - 1 టీస్పూన్
గరం మసాలా, చాట్ మసాలా -- తగినంత
ఉప్పు - రుచికి సరిపడా
నూనె - 2 టేబుల్ స్పూన్లు
జీలకర్ర - అర టీస్పూన్
టమాటా సాస్ లేదా గ్రీన్ చట్నీ -- పూయడానికి
కొత్తిమీర - కొద్దిగా

## వంట నూనెలపై సర్కార్ సంచలన నిర్ణయం

### లూజ్ అమ్మకాలపై నిషేధం..!



**వంట నూనె విక్రయాలపై ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (FDA) కీలక నిర్ణయం తీసుకుంది. కల్తీ, నాణ్యత లేని నూనెల విక్రయాలను అరికట్టడంతో పాటు వినియోగదారుల ఆరోగ్యాన్ని కాపాడే ఉద్దేశంతో లూజ్‌గా వంట నూనెను విక్రయించడంపై నిషేధం విధించింది.**

ఇకపై దుకాణదారులు బహిరంగంగా విడిగా వంట నూనెను విక్రయించకూడదని మహారాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నూనె ప్యాకెట్‌పై దాని మూలం, తయారీ, గడువు తేదీ వంటి వివరాలు స్పష్టంగా ఉండేలా చూడాలని ఖచ్చితంగా ఆదేశించింది.

లూజ్‌గా విక్రయించే నూనె ఎక్కడ తయారైంది? ఎప్పుడు తయారైంది? దాని గడువు ఎంత? అనే వివరాలను తెలుసుకోవడం కష్టమవుతోందని FDA పేర్కొంది. ఫుడ్ పాయిజనింగ్ వంటి ఘటనలు చోటుచేసుకున్నప్పుడు నూనె మూలాన్ని గుర్తించడం, బాధ్యులపై చర్యలు తీసుకోవడం కూడా కష్టంగా మారుతుందని అధికారులు చెబుతున్నారు. అందుకే ట్రేసబిలిటీ ఉండేలా ప్యాక్ చేసిన నూనె విక్రయాలకే ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు.


మహారాష్ట్ర FDA కమిషనర్ తుకారాం ముండే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ‘సురక్షిత ఆహారం, సురక్షిత మహారాష్ట్ర’ కార్యక్రమంలో తదుపరి ప్రధాన దృష్టి వంట నూనెపై ఉంటుందని తెలిపారు. నూనె తయారీ నుంచి ప్యాకేజింగ్, పంపిణీ, రిటైల్ విక్రయాల వరకు ప్రతి దశలో నిబంధనలు పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. వంట నూనెను పదేపదే వేడి చేసి ఉపయోగించడం కూడా తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం ఉందని కమిషనర్ హెచ్చరించారు. ముఖ్యంగా హోటళ్లు, రెస్టారెంట్లు, ఫుడ్ బిజినెస్‌లలో నూనెను పదేపదే ఉపయోగించే విధానాలపై FDA ప్రత్యేకంగా దృష్టి పెట్టనుంది.

అలాగే వంట నూనె ప్యాకేజింగ్‌కు ఉపయోగించిన టిన్‌లను నిబంధనలకు విరుద్ధంగా తిరిగి వినియోగించడంపై కూడా అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. తయారీదారులు, పంపిణీదారులు, వ్యాపారులు తప్పనిసరిగా సంబంధిత లైసెన్సులు, FSSAI నిబంధనలు పాటించాలని FDA స్పష్టం చేసింది. నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తుకారాం ముండే హెచ్చరించారు. ఈ నిర్ణయంతో మహారాష్ట్రలో వంట నూనె విక్రయాలు, వినియోగంపై పర్యవేక్షణ మరింత కఠినతరం కానుంది.




## నష్టాలకు బ్రేక్..


### భారీ లాభాల్లో ముగిసిన సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రాణించాయి. దీంతో వరుసగా ఏడు రోజుల నష్టాలకు బ్రేక్ పడింది. గురువారం సెషన్‌లో సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. అమెరికా బాండ్ల రాబడులు తగ్గడం మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచింది. విదేశీ మదుపర్ల పెట్టుబడులు కలిసొచ్చాయి. రియాల్టీ, ప్రైవేట్ బ్యాంక్, ఐటీ షేర్లలో కొనుగోళ్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. సెన్సెక్స్ ఉదయం 77,468.45 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,909.68) లాభాల్లో ప్రారంభ మైంది. రోజంతా సూచీ లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 77,611.11 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 628.04 పాయింట్ల లాభంతో 77,537.72 వద్ద ముగిసింది. నిఫ్టీ 153.55 పాయింట్లు పెరిగి 24,231.85 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.71గా ఉంది. సెన్సెక్స్ 30లో టైటాన్, హెచ్‌సీఎల్, ఇండిగో, టాటా స్టీల్ కంపెనీ షేర్లు తప్ప మిగతా కంపెనీల షేర్లన్నీ లాభాలను ఆర్జించాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 93.94డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,490.60 వద్ద స్థిరపడింది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, షాంఘై, హాంకాంగ్ మార్కెట్ సూచీలు కూడా లాభాల్లోనే ట్రేడయ్యాయి.

## గోల్డ్ లోన్ రంగంలోకి ఆదిత్య బిర్లా కంపెనీ


బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ ఆదిత్య బిర్లా క్యాపిటల్ బంగారం రుణాల వ్యాపారంలోకి అడుగుపెడుతోంది. రాబోయే 3 ఏళ్లలో మొత్తం 1,000 బంగారు రుణాల శాఖలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2027 చివరి నాటికి తొలిదశలో భాగంగా 300 శాఖలు ప్రారంభిస్తామని కంపెనీ ఓ ప్రకటనలో పేర్కొంది. దేశంలో బంగారు రుణాలు బలమైన వృద్ధిని నమోదుచేస్తున్నాయని కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ రాకేశ్ సింగ్ తెలిపారు. వ్యూహాత్మక ప్రణాళికలో భాగంగా ఈ రంగంలోకి అడుగుపెడుతున్నట్టు తెలిపారు. పట్టణాల్లో, నగరాల్లో మార్కెట్‌ను



విస్తరిస్తామని తెలిపారు. డిజిటల్ ప్లాట్‌ఫాం, రిటైల్ స్టోర్‌లలో బంగారు రుణాలు కొత్త వినియోగదారులకు అందుబాటులో ఉంటాయని అన్నారు. గూగుల్ ఆఫర్: కాలేజీ విద్యార్థులకు ఏడాది పాటు ‘ఏఐ ప్లస్’ ఫ్రీ భౌగోళిక పరిస్థితుల కారణంగా బంగారానికి డిమాండ్ పెరిగిందని, సురక్షిత పెట్టుబడిగానూ మారిందని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. అందుకే ఎన్‌బీఎఫ్‌సీ కంపెనీలు బంగారు రుణాల వ్యాపారం వైపు మొగ్గు చూపుతున్నాయని అభిప్రాయపడ్డారు. బంగారు రుణాలను చెల్లించి తిరిగి బంగారాన్ని పొందొచ్చు అనే నమ్మకం రుణగ్రహీతల్లో పెరగడంతో గోల్డ్ లోన్‌లకు డిమాండ్ పెరిగిందని అన్నారు. జూన్ 2026 నాటికి ఎన్‌బీఎఫ్‌సీల బంగారు రుణాల పోర్ట్‌ఫోలియో 69.3 శాతం వృద్ధి పెరిగి రూ.3.42 లక్షల కోట్లకు చేరింది.

## కాలేజీ విద్యార్థులకు ఏడాది పాటు ‘ఏఐ ప్లస్’ ఫ్రీ

ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్ భారతీయ కాలేజీ విద్యార్థులకు శుభవార్త చెప్పింది. ‘గూగుల్ ఏఐ ప్లస్’ సబ్‌స్క్రిప్షన్‌ను ఏడాది పాటు ఉచితంగా అందించనున్నట్లు ప్రకటించింది. గూగుల్ ఏఐ అసిస్టెంట్, సెర్చ్ ద్వారా ఎడ్యుకేషనల్ టూల్స్ అందుబాటులో ఉంటాయని పేర్కొంది. అమెరికాలోని కాలేజీ విద్యార్థుల కోసం గూగుల్ ఏఐ ప్రో ప్లాన్‌ను ఉచితంగా అందిస్తుండగా.. ఇప్పుడు భారతీయ కాలేజీ విద్యార్థుల కోసం ‘గూగుల్ ఏఐ ప్లస్’ను ఏడాది పాటు ఉచితంగా తీసుకురానుంది. జీ-మెయిల్, డాక్స్‌లో జెమినై సేవలు లభించనున్నాయి. రీసెర్చ్, అనాలసిస్ కోసం నోట్‌బుక్ ఎల్‌ఎమ్ కూడా వాడుకోవచ్చు. దీంతో పాటు ఫొటోలు, డ్రైవ్, జీమెయిల్ కోసం 400 +దీ స్టోరేజీని ఉచితంగా పొందొచ్చు. సాధారణంగా గూగుల్ ఏఐ ప్లస్ సబ్‌స్క్రిప్షన్ ధరను నెలకు




రూ.399గా (ఏడాదికి రూ.4,788) కంపెనీ నిర్ణయించింది. స్టూడెంట్స్ కోసం ‘ఐకూ జెడ్ 11’.. 32ఎంపీ సెల్ఫీ కెమెరా, ఏఐ ఫీచర్లు.. గూగుల్ ఏఐ ప్లస్‌లో భాగంగా స్టడీ నోట్‌బుక్స్, ఫ్లాష్‌కార్డులను క్రియేట్ చేయడం, ప్రాక్టీస్ క్విజ్‌లు వంటి ఇతర సదుపాయాలను గూగుల్ కల్పిస్తుంది. జెమినై లైవ్ కూడా అందుబాటులో ఉంటుంది. విద్యార్థులకు గూగుల్ ఏఐ ప్రో, యూట్యూబ్ ప్రీమియం సబ్‌స్క్రిప్షన్‌పై 70 శాతం డిస్కౌంట్‌ను కూడా ఆఫర్ చేస్తోంది. గూగుల్ ఏఐ ప్రో సబ్‌స్క్రిప్షన్‌తో యూట్యూబ్ ప్రీమియం లైట్ కూడా పొందొచ్చు. అర్హత కలిగిన విద్యార్థులు పర్సనల్ గూగుల్ అకౌంట్‌తో గూగుల్ వన్‌లో సైన్ అప్ కావొచ్చు. విద్యార్థుల అర్హతను గూగుల్ గ్రాష్ట్రవవతీ×ణ ప్లాట్‌ఫామ్ ద్వారా వెరిఫై చేయనుంది.

## వడ్డీ రేట్లపై వేచి చూసే ధోరణి ఎందుకంటే..

**దిల్లీ:** ఆహార వస్తువులు, ఇంధన ధరల పెరుగుదల వల్ల ద్రవ్యోల్బణం అధికమయ్యే ముప్పు పొంచి ఉన్నా, వడ్డీ రేట్ల విషయంలో ప్రస్తుతానికి వేచి చూసే ధోరణికే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) మొగ్గుచూపింది. ఈనెల 3-5 తేదీల్లో జరిగిన ఎంపీసీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు, దారితీసిన అంశాలు బుధవారం వెలువడ్డాయి. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన సమావేశమైన ఆరుగురు సభ్యుల కమిటీ కీలక రెపో రేటును 5.25% వద్ద యథాతథంగా ఉంచాలని ఏకగ్రీవంగా నిర్ణయించిన విషయం తెలిసిందే.

అంచనాలకు మించి రాణించి..: పశ్చిమాసియా సంక్షోభం వల్ల సరఫరా వ్యవస్థలకు అంతరాయం ఏర్పడినప్పటికీ, 2026-27 మొదటి త్రైమాసికంలో భారత ఆర్థిక వ్యవస్థ అంచనాలకు మించి రాణించిందనీ మల్హోత్రా పేర్కొన్నారు. సరఫరా వ్యవస్థ షాక్‌లు, ద్రవ్యోల్బణం పెరగడానికి దారితీస్తున్నాయనే సంకేతాలు కనిపించినప్పుడే ద్రవ్యవిధానపరమైన చర్యలు అవసరమవుతాయని, ప్రస్తుతం అటువంటి పరిస్థితులు పరిమితంగానే ఉన్నాయని తెలిపారు. ద్రవ్యోల్బణం ఏ స్థాయిలో స్థిరపడుతుందనే అంశంపై మరింత స్పష్టత వచ్చేవరకు, వడ్డీరేట్లపై వేచిచూడడానికే ప్రాధాన్యత ఇస్తామని.. ధరల ఒత్తిడి మరింత పెరిగితే కీలక రేట్ల పెంపు చేయాల్సి రావొచ్చని స్పష్టం చేశారు.
అంతర్జాతీయ అనిశ్చితులు, వాతావరణ ముప్పు నేపథ్యంలో మరికొంత కాలం వేచి చూడటమే ఉత్తమమని, దీని వల్ల సరఫరా ఆధారిత ద్రవ్యోల్బణం ఎంతవరకు వెళ్తుందో అంచనా




వేయొచ్చని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ పూనమ్ గుప్తా తెలిపారు.
ఆహార, ఇంధన ధరల పెరుగుదల ప్రభావం ఇంకా ఆర్థిక వ్యవస్థలోని ఇతర రంగాలపై పడలేదని ఆర్‌బీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇంద్రనీల్ భట్టాచార్య వెల్లడించారు.
ఆర్‌బీఐ ఎంపీసీ తదుపరి సమావేశం 2026 అక్టోబరు 5-7 తేదీల్లో జరగనుంది.

# వినాయక నిమజ్జనానికి పకడ్బందీ భద్రతా చర్యలు

- అన్ని శాఖల సమన్వయంతో ప్రశాంతంగా ఉత్సవాల నిర్వహణకు సీపీ అంబర్ కిశోర్ ఝూ ఆదేశాలు
- గతేడాది ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేపట్టాలని సూచన



**రామగుండం, (సింగిడి):** : వినాయక నిమజ్జన వేడుకలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ యంత్రాం గం సన్నద్ధమవుతోంది. నిమజ్జన కార్యక్ర మాల నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన భద్రతా చర్యలు, ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకో వాల్సిన చర్యలపై పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ వివిధ ప్రభుత్వ శాఖల అధికా రులతో సమన్వయ సమావేశం నిర్వహిం చారు. గత అనుభవాలపై సమీక్ష.. ఈసారి పకడ్బందీ ఏర్పాట్లు,వినాయక నిమజ్జన కార్యక్రమాలు భారీగా జరిగే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో ముందస్తు ప్రణాళిక రూపొం దించుకోవాలని సీపీ సూచించారు. గతేడాది నిమజ్జన సమయంలో ఎదురైన ఇబ్బందులు, సమస్యలను సమీక్షించి, ఈసారి అవి పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**నిమజ్జన ప్రదేశాల్లో భద్రతకు ప్రాధాన్యం**

నిమజ్జన ప్రాంతాలు, శోభాయాత్ర మార్గాలు, రద్దీ ప్రాంతాలు, పార్కింగ్ ప్రదేశాలను ముందుగానే పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారు లను ఆదేశించారు. నీటి లోతు, ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. శిక్షణ పొందిన ఈతగాళ్లు, రక్షణ సిబ్బంది, రెస్క్యూ బృందాలు, అత్యవసర రక్షణ పరికరాలను అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. ప్రజా సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి,మున్సిపల్ అధికారులు నిమజ్జన ప్రదేశాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాల ఏర్పాటు, రహదారుల నిర్వహణ, పార్కింగ్ సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సీపీ సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు నిమజ్జన మార్గాలు, గణేష్ మండపాలు, నిమజ్జన ప్రదేశాల్లోని విద్యుత్ వైర్లు, స్తంభాలు, తాత్కాలిక కనెక్షన్లను తనిఖీ చేసి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండాలి**

అగ్నిమాపక శాఖ అధికారులు కీలక ప్రాంతాల్లో ఫైర్ టెండర్లు, సిబ్బంది, రక్షణ పరికరాలను సిద్ధంగా ఉంచాలని సీపీ సూచించారు. సింగరేణి అధికారులు తమ పరిధిలోని నిమజ్జన మార్గాలు, రహదారుల్లో అవసరమైన సహకారం అందించాలని కోరారు. పోలీస్ అధికారులు శోభాయాత్ర మార్గాల్లో ట్రాఫిక్ నియంత్రణ, రద్దీ నిర్వహణ, బందోబస్తు, పార్కింగ్ ఏర్పాట్లతో పాటు క్రేన్లు, ఇతర అత్యవసర సేవల సమన్వయంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్, ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రామగుండం సీఐ కృష్ణకుమార్, గోదావరిఖని 2 టౌన్ సీఐ ప్రసాద్ రావు, జైపూర్ సీఐ నవీన్ కుమార్, ఎస్ఐ భూమేష్‌తో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్యమే ప్రథమ లక్ష్యం




**సుల్తానాబాద్, (సింగిడి):**
గ్రామ ప్రజల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యమని స ర్పం చ్ ఉప్పు లక్ష్మి స్పష్టం చేశారు. సుల్తానాబాద్ మం డలం మంచిరామి గ్రామంలో సోమవారం కరీంన గర్ మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ ఉప్పు లక్ష్మి, వి శ్రాంత ఐపీఎస్ అధికారి తిరుపతి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో సాధారణ వైద్య నిపు ణుడు డాక్టర్ బీరకాయల లోకేష్ గ్రామస్థులకు వై ద్య పరీక్షలు నిర్వహించి అవ సరమైన వారికి తగి న సూచనలు అందించారు. శిబిరం లో బీపీ, షు గర్, తదితర పరీక్షలను ఉచి తంగా నిర్వహించి వ్యాధులను గుర్తించారు. పరీక్షల అనంతరం అ వసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అందు బాటులో వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా శిబిరాన్ని నిర్వహించినట్లునిర్వాహకులు తెలిపారు. మెడికవర్ ఆస్పత్రి కేంద్ర అధిపతి గుర్రం కిరణ్ ఆధ్వర్యం లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆస్పత్రి మార్కెటింగ్ నిర్వాహకుడు కోట కరుణాకర్, గాదే విద్యాసాగర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఐతరాజు పల్లి లో స్వచ్ఛతపై అవగాహన



**సుల్తానాబాద్, (సింగిడి):**
స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా సుల్తా నాబాద్ మండలం ఐతరాజుపల్లి గ్రామంలో ప్రజ లకు పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వ హించడం జరిగిందని సర్పంచ్ దీకొండ భూమేష్ కుమార్ స్పష్టం చేశారు. స్వచ్ఛ భారత్ మిషన్ జి ల్లా సమన్వయ కర్త సిరిపురం రాఘవులు గ్రామ ప్రజలకు తడి చెత్త, పొడి చెత్త, పారిశుధ్య వ్యర్థా లు, ప్రత్యేక వ్యర్థాలను వేర్వేరుగా సేకరించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించడం వంటి అంశా లపై అవగాహన కల్పించారు. వినాయక మండ పాల వద్ద భక్తులకు అన్నదానం, ఇతర కార్యక్ర మాల్లో ప్లాస్టిక్ ప్లేట్లకు బదులుగా స్టీల్ ప్లేట్లను వి నియోగించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియో గం వల్ల పర్యావరణానికి హాని కలగడంతో పాటు ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు ఉంటాయని వి వరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకో వడం ద్వారా అనారోగ్యాలను నివారించవచ్చని, ప్రతి ఒక్కరూ పారిశు ధ్యాన్ని తమ బాధ్యతగా భావించాలని కోరారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దీకొండ భూమేష్ కుమార్, కార్యదర్శి భాస్కర్ రెడ్డి, ఉపసర్పంచ్ దాసరి మధుసూదన్ రెడ్డితో పాటు వార్డు సభ్యులు పున్నం సాయికు మార్, గుడాల మారుతి, న్యాతరి అరవింద్, ఎర్రం రమణారెడ్డి, ఓర్గుల రాజయ్య, దాసరి రమ్య, పున్నం రజిత, కొత్తూరి నవతాదేవి, ఈర్ల నిర్మల, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో వాహనం నడిపితే జైలుకే!

-డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి మూడు రోజుల జైలు
-మరో ఇద్దరికి రూ.20 వేల జరిమానా



**గోదావరిఖని (సింగిడి):**
మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిపై రామగుండం ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. రాజేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ముగ్గురు వ్యక్తులను గోదావరిఖని ప్రిన్సిపల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం న్యాయస్థానం ఇద్దరు వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున మొత్తం రూ. 20 వేల జరిమానా విధించింది. మరో వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష విధించింది. దీంతో జైలు శిక్ష పడిన వ్యక్తిని కరీంనగర్ జిల్లా జైలుకు తరలించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. రాజేశ్వరరావు మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా ప్రాణాలను ప్రమా దంలోకి నెట్టవద్దని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడే వారిపై చట్టప్రకా రం చర్యలు తప్పవని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. వాహనాలను రాంగ్ రూట్‌లో నడపడం, అతివేగంగా ప్రయాణించడం వంటి నిబంధనల ఉల్లంఘనలకు దూరంగా ఉండాలని తెలిపారు. అదేవిధంగా, కార్లు, ఇతర నాలుగు చక్రాల వాహనాలు నడిపే వారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. రాజేశ్వరరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రహదారి భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆయన కోరారు.

## ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

-అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్



**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, (సింగిడి):**
ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందే దరఖా స్తులను సత్వరమే పరిష్కరించా లని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రెబ్బెన మండలం గోలేటికి చెందిన లావుడ్య మమత తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. జైనూర్ మండలం జంగాం గ్రామానికి చెందిన కొడప అనుతారావు దివ్యాంగ పింఛన్ మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. సిర్పూర్(టి) మండలం పారిగాం గ్రామానికి చెందిన దుర్కే విశ్వనాథ్ గతంలో వస్తున్న పింఛన్ నిలిచిపోయిందని, తిరిగి పునరుద్ధరించాలని కోరారు. జిల్లా కేంద్రానికి చెందిన కాంబ్లే కీర్తికుమార్ ప్రభుత్వ వైద్య కళాశాలలో పొరుగు సేవల కింద ఉద్యోగం కల్పించాలని దరఖాస్తు చేసుకున్నారు. సిర్పూర్(టి) మండల కేంద్రానికి చెందిన గద్దల రమేష్ విశ్వకర్మ పథకం కింద రుణ సదుపాయం కల్పించాలని కోరారు. చింతలమానేపల్లి మండలం బాబాసాగర్‌కు చెందిన పిప్పిరే బాబాజీ తన వాటా భూమిని ఇతరులు ఆక్రమించారని, తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే పోలీస్ శాఖ ధ్యేయం

- గ్రీవెన్స్ డేలో ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడిన సీపీ అంబర్ కిశోర్ ఝూ
- ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలి
- అధికారులకు సీపీ ఆదేశం



**రామగుండం, (సింగిడి):**
ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటికి చట్టబద్ధమైన పరిష్కారం చూపడమే లక్ష్యంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను సీపీ దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రాలను సమర్పించారు. ప్రతి ఫిర్యాదుదారుడితో వ్యక్తిగతంగా మాట్లాడిన పోలీస్ కమిషనర్.. సమస్యల తీవ్రత, సంబంధిత అంశాలు, ఇప్పటివరకు జరిగిన పరిణామాలను అడిగి తెలుసుకున్నారు.

**ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి.. అధికారులకు కీలక సూచనలు**

ప్రజలు అందజేసిన వినతిపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన సీపీ అంబర్ కిశోర్ ఝూ.. ఆయా ఫిర్యాదులపై సమగ్ర విచారణ చేపట్టి, చట్ట నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బాధితులకు న్యాయం జరిగేలా ప్రతి అంశాన్ని సున్నితంగా, బాధ్యతాయుతంగా పరిశీలించాలని సూచించారు.

**భయపడాల్సిన అవసరం లేదు.. నేరుగా పోలీసులను ఆశ్రయించండి**

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ సమస్యలను నేరుగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజల నుంచి అందే ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి పోలీస్ శాఖ తరఫున అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, చట్టపరమైన పరిష్కారం అందించేందుకు పోలీస్ శాఖ కట్టుబడి ఉందని సీపీ స్పష్టం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా గ్రీవెన్స్ డే వంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఆరోపణలతో కాలయాపన
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల హరీష్‌రెడ్డి ధ్వజం




**గోదావరిఖని, (సింగిడి):**
ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు ప్రభుత్వం రాజకీయ ఎత్తుగడలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వ్యాల హరీష్‌రెడ్డి ఆరోపించారు. ప్రజా సమస్యలపై సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం వివాదాస్పద అంశాలను తెరపైకి తెస్తూ పాలనాపరమైన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో హరీష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ హామీల అమలును డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు టీషర్టులు ధరించి అసెంబ్లీకి వెళ్లిన సందర్భంలో మార్షల్స్‌తో అడ్డుకున్నారని హరీష్‌రెడ్డి పేర్కొన్నారు. పార్లమెంట్‌లో కాంగ్రెస్ నేతలు టీషర్టులు ధరించి వెళ్లడాన్ని సమర్థించే వారు తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల విషయంలో భిన్నంగా వ్యవహరించడం ఎందుకని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో నిరసన తెలిపే హక్కును గౌరవించాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ భూములకు సంబంధించి గతంలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలు, తాజాగా అసెంబ్లీలో వెల్లడించిన వివరాల మధ్య వ్యత్యాసం ఉందని హరీష్‌రెడ్డి అన్నారు. భూముల విస్తీర్ణంపై భిన్నమైన ప్రకటనలు వెలువడటంపై ప్రజలకు ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళితుల పేరుతో ఉన్న అసైన్డ్ భూముల అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం సరికాదని వ్యాఖ్యానించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కార్మికులు, ప్రజలు సింగరేణి భూముల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు వీలుగా జీవో 76ను తీసుకొచ్చామని హరీష్‌రెడ్డి తెలిపారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 22ఏతో భూముల యజమానులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతోందని ఆరోపించారు. జీవో 22ఏ ద్వారా భూములు కలిగిన వారి నుంచి 30 శాతం వాటాను తీసుకునే ప్రయత్నం జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం పూర్తి వివరాలను వెల్లడించి, ప్రజల సందేహాలను నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాధాన్యత కావాలి,రాష్ట్రంలో భూవ్యవహారాలు, రియల్ ఎస్టేట్‌కు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం అనుమానాలకు తావిస్తోందని హరీష్‌రెడ్డి విమర్శించారు. ప్రజల భూములు, హక్కులకు సంబంధించిన అంశాల్లో పారదర్శకత పాటించాలని కోరారు. రాజకీయ విమర్శలు, వివాదాల కంటే ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, భూ హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు ఐత శివకుమార్, బక్కి కిషన్‌తో పాటు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జహీద్ పాషా, పోలాడి శ్రీనివాస్, బూరుగు వంశీకృష్ణ, చొప్పరి శ్రీనివాస్, పశుపుల బాపు, మేకల రామస్వామి, బోట్ల పోషం, రొడ్డ సంపత్, గొర్రె నర్సింగ్, గొర్రె శంకర్, కదర్ల శ్రీధర్, కడమండ్ల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## భక్తి.. ఆత్మీయత.. మానవీయత



**మంచిర్యాల, ౽(సింగిడి):**
వాడవాడలా గణపతి నామస్మరణ మార్మోగింది. వినాయక మండపాలు భక్తులతో కిటకిటలాడాయి. చిన్నారులు, యువత, మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పంచామృతాభిషేకాలు, పుష్పార్చనలు, హారతులతో మండపాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పూజలతో పాటు పలుచోట్ల నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలు చేపట్టి సేవాభావాన్ని చాటారు. ఆకలితో వచ్చిన వారికి అన్నం పెట్టడం, ప్రసాదం పంచడం ద్వారా పండగలోని మానవీయ కోణాన్ని ఆవిష్కరించారు. కుల, మత, వర్గ భేదాలకు అతీతంగా స్థానికులు ఒక్కటై ఉత్సవాల్లో పాల్గొనడం విశేషం. గణనాథుని సన్నిధిలో భక్తి.. ప్రజల మధ్య ఆత్మీయత.. సేవలో మానవీయత కనిపిస్తూ వినాయక ఉత్సవాలు సాగుతున్నాయి.

## ఎకో పార్క్.. శ్రీరాంపూర్‌కు కొత్త ఐకాన్



**మంచిర్యాల, (సింగిడి):**
బొగ్గు గనుల ప్రాంతమంటే దుమ్ము, ధూళి, కాలుష్యమే కాదు.. పచ్చదనం, ఆహ్లాదం, ఆరోగ్యకరమైన వాతావరణానికి కూడా నిలయంగా మార్చే ప్రయత్నాలు సాగుతున్నాయి. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణలో భాగంగా సింగరేణి చేపడుతున్న పలు పర్యావరణహిత కార్యక్రమాల్లో భాగంగా శ్రీరాంపూర్ ఏరియాలో రూపుదిద్దుకుంటున్న ఎకో పార్కు త్వరలో ప్రజలకు అందుబాటులోకి రానుంది. శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్‌పీ ఓసీపీ ప్రాంగణంలో నిర్మిస్తున్న ఎకో పార్కు పనులు తుదిదశకు చేరుకున్న నేపథ్యంలో ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ సోమవారం పనులను స్వయంగా పరిశీలించారు. సంబంధిత అధికారులతో కలిసి పార్కు నిర్మాణంలో జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. పెండింగ్ పనులను వేగవంతం చేసి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎకో పార్కులో ఏర్పాటు చేస్తున్న వాటర్ ఫౌంటెన్లు, వాకింగ్ ట్రాక్, లైటింగ్, లేక్ తదితర నిర్మాణాలను జీఎం పరిశీలించారు. పార్కు కేవలం పచ్చదనానికి పరిమితం కాకుండా సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచేలా ఉండాలని సూచించారు. పిల్లలు ఆటపాటలతో, పెద్దలు సేదతీరేలా అనువైన వాతావరణాన్ని కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**శ్రీరాంపూర్‌కు ఐకాన్‌గా..**

ప్రారంభం అనంతరం ఈ ఎకో పార్కు శ్రీరాంపూర్ ఏరియాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా అభివృద్ధి చేయాలని జీఎం సూచించారు. పచ్చదనం, నీటి వనరులు, నడక మార్గాలు, విద్యుత్ అలంకరణలను సమన్వయం చేస్తూ సందర్శకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. గనుల ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణకు సింగరేణి ఇస్తున్న ప్రాధాన్యాన్ని చాటిచెప్పేలా పార్కు రూపుదిద్దుకోవాలని సూచించారు. పార్కు నిర్మాణంలో మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, వారం రోజుల్లో మరోసారి తాను పనులను పరిశీలిస్తానని జీఎం తెలిపారు. అప్పటివరకు పనులు దాదాపుగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు వీలైనంత త్వరగా పార్కును అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ ఓసీపీ ప్రాజెక్ట్ ఆఫీసర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, డీజీఎం (ఫారెస్ట్) హరినారాయణ, సివిల్ హెచ్ఓడీ ఏ. రవికుమార్, డీవైఎస్ఈ గుండెరావు, డీవైఎస్ఈ (ఎలక్ట్రికల్) మధుకర్, సివిల్, ఫారెస్ట్ విభాగాల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

-అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు



**నిర్మల్ ప్రతినిధి, (సింగిడి): (నినాదం):**
సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వ హించిన ప్రజావాణి కార్యక్ర మంలో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయం గా స్వీకరించారు. ఈ సంద ర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ రాథోడ్ రమేష్, డిప్యూటీ కలెక్టర్ రాకేష్, ఆర్డీవో దేవీదాస్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సొంత ఊరిపై మమకారం

-సేవే శ్వాస... స్వగ్రామమే స్ఫూర్తి

-ఫిజియోథెరపీ వైద్యుడు ఆరే సతీష్





**సుల్తానాబాద్, (సింగిడి):** సొంత ఊరిపై మమ కారం.. సమాజంపై బాధ్యత.. సేవ చేయాలనే సంకల్పం ఉంటే పదవులు, హో దాలు అవ సరం లేదని నిరూపిస్తున్నారు. సుల్తా నాబాద్ మండలం గట్టేపల్లి గ్రామానికి చెందిన ఫి జియో థెరపీ వైద్యుడు ఆరే సతీష్. తన స్వగ్రామా నికి తన వంతుగా ఏదో ఒక సేవ చేయాలనే ల క్ష్యంతో ఆధ్యాత్మికత, విద్యకు ప్రాధాన్యం ఇస్తూ వినూత్న సేవా కార్యక్రమాలకు శ్రీ కారం చుట్టారు. గ్రామం చివర ఆంజనేయ స్వామి విగ్రహాన్ని, గ్రా మంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యకు ప్రతీకగా సరస్వతి మాత విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. విగ్ర హాల నిర్వహణపైనా ప్రత్యేక శ్రద్ధ చూపుతూ తా జాగా వాటికి తన సొంత ఖర్చులతో రంగులు వే యించారు. దీంతో విగ్రహాలు కొత్త శోభను సంత రించు కోవడంతో పాటు గ్రామస్తులను ఆకట్టు కుం టున్నాయి. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే వి ద్యార్థుల్లో విద్యపై ఆసక్తి, ఆత్మవిశ్వాసం పెంపొం దాలనే ఉద్దేశంతోసరస్వతిమాత విగ్రహాన్ని ఏర్పా టు చేయడం అభినందనీయమని గ్రామస్తులు పే ర్కొంటున్నారు. అదే విధంగా గ్రామం చివర ఆంజ నేయ స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆధ్యాత్మిక వాతావర ణానికి తన వంతు తోడ్పాటు అందిస్తు న్నారు. సొంత గ్రామం కోసం సొంత నిధులతో సే వా కార్యక్రమాలు చేపడుతూ డాక్టర్ ఆరే సతీష్ ఆదర్శంగా నిలుస్తున్నారని పలువురు అభినంది స్తున్నారు. సంపాదనలో కొంత భాగాన్ని సమాజ సేవకు వినియోగిస్తూ, గ్రామాభివృద్ధిలో తన వం తు పాత్ర పోషించాలనే ఆయన ఆలోచన యువ తకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

# తప్పుడు రాతల వల్ల, ఓటర్లకు నోటీసులు రాజ్యాంగంలో ఉందా?

- భగవంతుడా వృద్ధులు చదువు రానివారు ఆవేదన
- అఎస్ఐఆర్-2026పై రానున్న 30 నుంచి 40 రోజులు ప్రత్యేక దృష్టి సారించాలి : రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి
- అఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి
- అక్టోబర్ 25లోపు అన్ని ప్రక్రియలు పూర్తి చేయాలి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి




**వెల్దుర్తి, (సింగిడి):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సర్ ప్రక్రియ ఓటర్ లిస్ట్ మార్పులు చేర్పులు చేయడం జరిగింది ఈ విషయం అందరికీ తెలిసినదే అనంతరం అవగాహన లేని అంగన్వాడి టీచర్లకు ఒకపక్క చిన్న పిల్లలకు చదువులు చెబుతూ మరోపక్క గర్భవతులకు కావలసిన సూచనలు ఇస్తూ బిజీగా చిన్న పిల్లల చదువుల విషయంలో అదేవి ధంగా గర్భవతుల విషయములో ప్రోటోకాల్ ప్రకారము పాటిస్తున్నారు అనంతరం ప్రభుత్వం ఒత్తిడితో వారి మీద ఇంకా భారంగా సర్ ప్రక్రియ చేయాలని ఆదేశాలు రావడంతో అధికారులకు ఎదురు చెప్పలేక ఆవేదనకు లోనై వచ్చి రాక అవుగాన సదస్సులకు హాజరై ఇటు కుటుంబ బాధ్యతలు అటు అంగన్వాడి బాధ్యతలు గర్భవతుల విషయంలో బాధ్యతలకు మానసికంగా కృంగిపోయి తప్పుడు రాతలతో ఓటర్లకు నోటీసులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని అవ్వలు ముసలక్కలు బాధపడుతు న్నారు మా చరిత్రలో 60 సంవత్సరాలు అయితుంది ఓటు వేసి ఇప్పటివరకు ఓటు విషయంలో మాకు ఇలాంటి విషయాలు ఎప్పుడూ వినలేదని ఒకరికొకరు అనుకుంటున్నారు అదే విధంగా కలెక్టర్ సోమవారం నాడు డివిజన్, మండలం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు అనంతరం ఈ సందర్భంగా కలెక్టర్ సూచనలిస్తూఎస్ఐఆర్--2026 ప్రక్రియలో భాగంగా రానున్న 30 నుంచి 40 రోజులు ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పూర్తి చేయాలని లిరాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డిలి ఆదేశించారు. సోమవారం, హైదరా బాదు నుంచి ఎస్ఐఆర్--2026 కార్యక్రమంపై లిరాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డిలి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి లిజిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఈ వీడియో సమావేశానికి హాజర య్యారు. ఈ నేపథ్యంలో లిరాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిలి మాట్లాడుతూ.. ప్రస్తుతం ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని సూచించారు. నోటీసులు జారీ చేయడంతో పాటు వాటిపై తదుపరి చర్యలు చేపట్టి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. చివరి నిమిషం వరకు ఫారం-6, 7, 8 దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ముందు గానే పరిష్కరించాలని స్పష్టం చేశారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై వచ్చిన అభ్యంతరాలను కూడా ఎప్పటి కప్పుడు పరిశీలించి, పరిష్కరించాలని తెలి పారు. ప్రతి బీఎల్ఓకు నిర్దిష్ట లక్ష్యాలను కేటాయించి, వారి పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశిం చారు. అక్టోబర్ చివరి వారంలోగా అనామలీస్, ఇతర మ్యాపింగ్‌కు సంబంధించి ఓటర్లకు జారీ చేయాల్సిన నోటీసులు, వాటి పరిష్కార ప్రక్రియలను పూర్తి చేయాలని సూచించారు. ఎస్ఐఆర్--2026కు సంబంధించిన అన్ని పనులను అక్టోబర్ 25లోపు పూర్తి చేయాలని, చివరి 10 రోజులను చివరి క్షణంలో అవసరమయ్యే సవరణలు, ఇతర ప్రక్రియల కోసం కేటాయించు కోవాలని ఆదేశించారు. ఫారం-6 సమర్పించే సమయంలో డిక్లరేషన్ ఫారాన్ని తప్పనిస రిగా అందజేయాలని స్పష్టం చేశారు. ఫారం-6తో పాటు అవసరమైన డిక్లరేషన్, సంబంధిత పత్రాలను సమర్పించేలా అర్హులైన ఓటర్లకు అవగాహన కల్పిం చాలని సూచించారు. టర్లకు జారీ చేసే నోటీసులను బీఎల్ఓలు మాత్రమే పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. అవసరమైన సందర్భాల్లో బీఎల్ఏలు ఇళ్లను గుర్తించడంలో సహకరించవచ్చని తెలిపారు. బీఎల్ఏ ద్వారా నోటీసులు పంపిణీ చేసినట్లు గుర్తిస్తే సంబంధిత బీఎల్ఓపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వయోవృద్ధులు, దివ్యాంగులు, విదేశాల్లో ఉన్న ఓటర్ల తరపున వారి కుటుంబ సభ్యులు విచారణకు హాజరై, సంబంధిత పత్రాలను సమర్పించవచ్చని తెలిపారు. ఈ విషయంపై బీఎల్ఓలు సంబంధిత ఓటర్లకు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సమాచారం అందించాలని సూచించారు. బీఎల్ఓ స్థాయిలో ఐదు రోజులకు మించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను జిల్లా కలెక్టర్లు క్రమం తప్పకుండా సమీక్షించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులను గుర్తించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం లిజిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి, పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్--2026 ప్రక్రియలో నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. నోటీసుల జారీ, విచారణ, దరఖాస్తుల పరిష్కారం వంటి ప్రతి ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని, వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మెదక్ ఆర్డీఓ రమాదేవి ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ గఫర్‌లు పాల్గొన్నారు.

అక్రమ డిప్యూటేషన్లను
## రద్దు చేయాలి



**కోడేరు, (సింగిడి):**
మండల కేంద్రంలోని ఉన్న సి.పి.ఎస్జి.పి.ఎస్ పాఠశాలల్లో పాఠాలు బోధించడానికి తగిన ఉపాధ్యాయుల కొరత కారణంగా రెండు పాఠశాలలను ఒకే తరగతి గదిలో విద్యార్థులను కూర్చోబెట్టి విద్యాబోధన చేస్తున్నారు అయినప్పటికీ ఉన్న టీచర్లనే డిప్యూటేషన్ పేర్లతో ఇక్కడి నుండి వేరే ప్రాంతాలకు పంపించడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ నాయకులు వి.రాజేష్, గణేష్, మరియు కోడేరు యూత్ క్లబ్ వ్యవస్థాపకులు పి.తిరుపతయ్య సోమవ్వరం నాడు విద్యార్థులను బైఠాయించి పాఠశాల ముందు నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల కొరతతో పాఠశాల నడుస్తున్నప్పటికి అదే పాఠశాల నుండి ఉపాధ్యాయులను వేరే ప్రాంతాలకు పంపించడం అంటే ప్రభుత్వ బడిని నీరు కార్చడమే లక్ష్యంగా పెట్టుకున్నారని వారు అన్నారు. అక్రమ డిప్యూటేషన్ ఇచ్చిన డీఈవో ఎంఈఓ లు స్పందించి డిప్యూటేషన్ తో వెళ్లిన టీచర్లను తిరిగి మా ఊరి పాఠశాలకు రప్పించకపోతే విద్యార్థులతో మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని వారు అన్నారు... ప్రభుత్వ పాఠశాలలలో ముందే ఉపాధ్యాయుల కొరత ఉన్న ప్రభుత్వం పట్టించుకోవడంలేదని అందరికీ తెలిసిన విషయమే అయినా కూడా ఎలాంటి అనుమతులు లేకుండా ఎంఈవోలు అక్రమంగా డిప్యూటేషన్ ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని ఎస్ఎఫ్ఐ నాయకులు మండిపడ్డారు మా పాఠశాలలో విద్యను బోధించే ఉపాధ్యాయులు మాకే కావాలి అని విద్యార్థులు నిరసన కార్యక్రమం చేపట్టారు

### బిఆర్ఎస్ సాగు నీరు పోరు.. ఉద్రిక్తత



**అమరచింత, (సింగిడి):**
జూరాల ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేయాలని బి ఆర్ ఎస్ పిలుపులో భాగంగా సోమవారం బి ఆర్ ఎస్ నాయకులను, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి ఆయా పోలీస్ స్టేషన్లకు తరలించారు. జూరాల ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేయాలని జూరాల ప్రాజెక్టు దగ్గరికి వెళుతున్న మక్తల్ మాజీ ఎమ్మెల్యే, చిట్టెం రామ్మోహన్ రెడ్డిని నందిమల్ల క్యాంపు దగ్గర అరెస్టు చేసి కొత్తకోట పోలీస్ స్టేషన్ కు తరలిస్తుండగా బి ఆర్ ఎస్ నాయకులు, రైతులు అడ్డుకోవడంతో పోలీసులకు బి ఆర్ ఎస్ శ్రేణుల మధ్య తోపులాట జరిగింది. నందిమల్ల క్యాంపులో బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అధికారులుస్పం దించకపోవడంతో రైతులు ఆగ్రహంతో జూరాల ప్రాజెక్టు ఎడమ కాలువ గేట్లను ఎత్తడానికి వెళుతుండగా పోలీసులు నివారించారు. రైతులు జూరాల సమాంతర కాలువలో దిగి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ, జూరాల ప్రాజెక్టులో 5 టిఎంసీల నీరు నిల్వ ఉన్న జూరాల ఆయకట్టు రైతులకు సాగునీరు ఎందుకు ఇవ్వడం లేదని, రైతులకు సాగునీరు ఇవ్వలేని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే దిగిపోవాలని ఆయన డిమాండ్ చేశారు. జూరాల ఆయ కట్టు రైతులకు సాగునీరు ఇచ్చే దాకా బి ఆర్ ఎస్ పార్టీ ఉద్యమం చేస్తుందని రైతులకు అండగా ఉంటామన్నారు.

## పెండింగ్ హియరింగ్స్‌ను త్వరగా పూర్తి చేయాలి

**వనపర్తి ప్రతినిధి, (సింగిడి):** ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా జారీ చేసిన నోటీసులకు (నో మాపింగ్, అనామోలీస్) సంబంధిం చిన పెండింగ్ హియరింగ్స్‌ను త్వరితగతిన పూర్తి చేసి అర్హత కలిగిన ఓటర్ల వివరాలను తుది ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణకు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పి. సుదర్శన్ రెడ్డి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న సర్ ప్రక్రియ పురోగతిపై సమీక్షించారు. వనపర్తి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో సర్ ప్రక్రియలో భాగంగా జారీ చేసిన నోటీసులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న హియ రింగ్స్ వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నోటీసులు అందుకున్న ప్రతి ఓటరుకు సంబంధించిన విచారణను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. విచారణకు హాజరైన ఓటర్ల నుంచి అవసరమైన పత్రాలను స్వీకరించి వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం వివరాలను సంబంధిత రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. అన్ని వివరాలు సక్రమంగా ఉన్న (అదర్స్ కేటగిరి) ఓటర్లకు సంబంధించి దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించి అవసరమైన ప్రక్రియను పూర్తి చేసి తుది ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణకు పంపించాలని కలెక్టర్ కోరారు. అదేవిధంగా ఇటీవల నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాల్లో స్వీకరించిన ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులను కూడా త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించిన ఫారం-6, ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపునకు సంబంధించిన ఫారం-7, ఓటర్ల వివరాల్లో మార్పులు, చిరునామా సవరణలకు సంబంధించిన ఫారం-8 దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి ఎలాంటి పెండింగ్ లేకుండా పరిష్కరించాలని వెల్లడించారు. ఈ సమావేశంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ఇతర ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సాగు నీళ్లు, విద్యుత్ ఇవ్వండి రైతును రాజకీయాల్లోకి లాగొద్దు!

**పెబ్బేరు (సింగిడి):** రైతులు ఎదుర్కొంటున్న సాగునీరు, విద్యుత్ సమస్యలను రాజకీయ అంశాలుగా మార్చకుండా వాటి పరిష్కారానికి కృషి చేయాలని బీఆర్ ఎస్ నాయకులు కోరారు. రైతుల సమస్యలపై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలపై వారు స్పందించారు. సోమవారం పెబ్బేరు ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మాట్లాడారు. ఇటీవల బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పెబ్బేరు ప్రాంతంలో పర్యటించిన సందర్భంగా పలువురు రైతులు ఆయనను కలిసి తమ సమస్యలను వివరించారని నాయ కులు తెలిపారు. గుమ్మడం విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలతో పాటు సాగు నీటి ఇబ్బందులను కూడా కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఈ సందర్భంగా గుమ్మడం గ్రామానికి చెందిన రైతు వెంకటరాములు మాట్లాడుతూ.. తాను కేటీఆర్‌ను ప్రశ్నించేందుకు వెళ్లలేదని, తమ ప్రాంత రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లేందుకే కలిశానని స్పష్టం చేశారు. సింగోటం జలాశయం, జూరాల ప్రాజెక్టు పరిధిలో నీరు అందుబాటులో ఉన్నప్పటికీ తమకు సాగునీరు సక్రమంగా అందడం లేదని కేటీఆర్‌కు వివరించినట్లు తెలిపారు. సాగునీరు అందకపోతే పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేసినట్లు చెప్పారు. గతంలో విద్యుత్ సరఫరా, సాగునీటి విషయంలో రైతులకు ఎదురైన ఇబ్బందులు తక్కువగా ఉండేవని తాను కేటీఆర్‌కు చెప్పినట్లు వెంకటరాములు తెలిపారు.
అయితే తాను చెప్పిన మాటలను కొందరు వక్రీకరించి, కేటీఆర్‌ను నిలదీసినట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం బాధ కలిగించిందన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికే కోరాను తమ గ్రామంలోని రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్, సాగునీటి సమస్యలను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లడం మాత్రమే తన ఉద్దేశమని వెంకటరాములు తెలిపారు. రైతులకు సకాలంలో నీరు, విద్యుత్ అందకపోతే పంటలు దెబ్బతిని ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. రైతుల సమస్యలను శాసనసభలో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేస్తానని కేటీఆర్ తనతో చెప్పినట్లు వెంకటరాములు తెలిపారు. సమస్యలు పరిష్కారం కాకపోతే రైతుల తరఫున భవిష్యత్తులో మరింతగా పోరాడుతామని కేటీఆర్ చెప్పినట్లు వివరించారు. రైతుల సమస్యలను రాజకీయ కోణంలో చూడకుండా, సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన కోరారు. తాను మాట్లాడిన మాటలను వక్రీకరించి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం సరికాదన్నారు. ఇటీవల కాంగ్రెస్ నాయకులు చేసిన 'శవ రాజకీయాలు' వ్యాఖ్యలపైనా బీఆర్ఎస్ నాయకులు స్పందించారు. మరణించిన వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించేందుకే కేటీఆర్ వచ్చారని, ఆ పర్యటన సందర్భంగా రైతులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. రైతులు తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకెళ్లడాన్ని రాజకీయ కార్యక్రమంగా చూడటం సరికాదని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొం టున్న సమస్యలపై రాజకీయ విమర్శలకు బదులుగా పరిష్కార మార్గాలపై దృష్టి పెట్టాలని కాంగ్రెస్ నాయకులకు సూచిం చారు.



## లింగంపేట్ హత్య కేసును ఛేదించిన పోలీసులు

-నిందితుడి అరెస్ట్
- హత్యకు ఉపయోగించిన ఇనుప రాడ్, సెల్‌ఫోన్, రక్తపు మరకలున్న దుస్తులు స్వాధీనం

**కామారెడ్డి రూరల్, (సింగిడి):** ఎల్లారెడ్డి డీఎస్పీ ఎస్.శ్రీనివాస్ రావు వివరాలు వెల్లడిస్తూ మాట్లాడుతూ ఫిర్యాదురాలు చింతకుంట చంద్రవ్వ, భర్త హనుమం తు, లింగంపేట్ మండలం కొరుపోలు గ్రామ శివారులోని నాగారం గ్రామానికి చెందినవారు. ఫిర్యాదురాలి కుమార్తె గత 10 సంవత్సరాలుగా కొరుపోలుకు చెందిన గుట్టమీది సాయిలు, తండ్రి గంగయ్యతో సహజీవనం చేస్తూ ఒక కుమారుడికి జన్మనిచ్చింది. హైదరాబాద్‌లోని గుండ్లపో చమ్మ వద్ద ఉన్న సమయంలో సాయిలు తన గ్రామానికి రావాలని బలవంతం చేస్తూ, రాకపోతే చంపేస్తానని పలుమార్లు ఫోన్‌లో బెదిరించినట్లు ఫిర్యాదురాలు తెలిపింది. ఈ క్రమంలో తేదీ 18.09.2026న మధ్యాహ్నం సుమారు 2 గంటలకు భూమికి సంబంధించిన డబ్బులు వస్తాయని, పొలానికి మందు చల్లించాల్సి ఉందని చెప్పి ఆమె కుమార్తె గుండ్లపోచమ్మ నుంచి బయలుదేరింది. అనంతరం నాగారం గ్రామ శివారులో తలకు బలమైన గాయంతో రక్తస్రావమై మృతి చెందినట్లు సమాచారం అందడంతో ఫిర్యాదురాలు లింగంపేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసును జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు ఎల్లారెడ్డి డీఎస్పీ ఎస్. శ్రీనివాస్ రావు పర్యవేక్షణలో, ఎల్లారెడ్డి సీఐ డి. రాజా రెడ్డి సారథ్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ దర్యాప్తు చేపట్టగా నిందితుడు గుట్టమీది సాయిలు, తండ్రి గంగయ్య, వయస్సు 48 సంవత్సరాలు, కొరుపోలు గ్రామం, లింగంపేట్ మండలాన్ని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో మృతురాలిపై ఇనుప రాడ్‌తో దాడి చేసి హత్య చేసినట్లు నిందితుడు ఒప్పుకున్నా డు. దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం, తేదీ 19.09. 2026 ఉదయం సుమారు 11.00 గంటలకు భూమి డబ్బుల విషయమై నిందితుడు మృతురాలిని తన ద్విచక్ర వాహనంపై కామారెడ్డికి తీసుకెళ్లి జుబేర్‌తో మాట్లాడిం చాడు. అనంతరం ఇద్దరూ తిరిగి మృతురాలి పొలం వద్దకు సాయంత్రం సుమారు 5.00 గంటలకు చేరుకున్నారు. అక్కడ ఇద్దరూ మాట్లాడుకుంటున్న సమయంలో నిందితు డు తన వెంట తెచ్చుకున్న ఇనుప రాడ్‌తో మృతురాలిపై దాడి చేయడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందినట్లు దర్యాప్తులో వెల్లడైంది. నిందితుడు గుట్టమీది సాయిలును అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం జైలుకు తరలించారు. నిందితుడి వద్ద సెల్‌ఫోన్, ఇనుప రాడ్, దుస్తులను స్వాధీనం చేసుకున్నారు.

### యువకుడి ఆచూకీ తెలపండి.



**చేవెళ్ల (సింగిడి):** ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన తమ కుమారుడి ఆచూకీ తెలియక ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయిం చారు. తమ కుమారుడి ఆచూకీ గుర్తించి, సురక్షితంగా ఇంటికి చేర్చాలని, చేవెళ్ల పోలీసులను వేడుకు న్నారు.. చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని సీపీఐ కాలనీ, చేవెళ్ల గ్రామంకు చెందిన మహమ్మద్ సమీర్, తండ్రి హనీఫ్, వయస్సు 19 సంవత్సరాలు, వృత్తి: మెకానిక్ అనే యువకుడు 18.09.2026 తేదీన సాయంత్రం సుమారు 18:00 గంటల నుండి కనిపించకుండా పోయాడు. 18.09.2026న సాయంత్రం సుమారు 16:00 గంటలకు సమీర్ తల్లి శ్రీమతి ఎం.డి. ఫాతిమా పని నిమిత్తం హోటల్‌కు వెళ్లారు. ఆ సమయంలో సమీర్ ఇంట్లోనే ఉన్నాడు. ఆమె సుమారు 18:00 గంటలకు తిరిగి ఇంటికి వచ్చేసరికి సమీర్ ఇంట్లో కనిపించలేదు. బంధువులు, పరిసర ప్రాంతాల్లో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. అతని మొబైల్ నంబర్ 9032607126కు ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్‌లో ఉంది. గతంలో కూడా సమీర్ తన తల్లికి సమాచారం ఇవ్వకుండా మన్నెగూడలోని ఒక మదర్సా హాస్టల్‌లో సుమారు మూడు నెలలు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అక్కడ కూడా విచారించగా సమీర్ కనిపించలేదు.

### జర్నలిస్టును పరామర్శించిన కాంగ్రెస్ నేత



**వనపర్తి ప్రతినిధి, (సింగిడి):**
సీనియర్ జర్నలిస్టు ధనుంజయ చారిని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు బి.కృష్ణ సోమవారం పరామర్శిం చారు. వనపర్తి పట్టణంలోని సీనియర్ జర్నలిస్టు ధనుంజయ చారి అన్న భాస్కరాచారి మృతి చెందడంతో చిట్యాల రోడ్డులో ఉన్న డబుల్ బెడ్ రూమ్ కాలనీకి తీసుకొచ్చారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు బి.కృష్ణ, మాజీ కౌన్సిలర్ శేఖర్ లు జర్నలిస్ట్ ధనుంజయ చారిని పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు మండ్ల రాజు, ఎండి. నిరంజన్, చందు, సాజీద్ ఉన్నారు.

### స్వర్ణగిరి టెంపుల్ నమూనాలో ఏర్పాటు
చేసిన గణేష్ మండపాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ



**కామారెడ్డి రూరల్, (సింగిడి):**
కామారెడ్డి పట్టణంలో వాయిసేన యూత్ ఆధ్వర్యంలో స్వర్ణగిరి టెంపుల్ మాదిరిగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర సందర్శించి, గణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ నిర్వాహకులతో జిల్లా ఎస్పీ మాట్లా డారు గణేష్ నిమజ్జనం సమయంలో డీజేలకు ఎట్టి పరిస్థితు ల్లోనూ అనుమతి లేదని స్పష్టం చేశారు. పోలీస్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటిస్తూ, సాంప్రదాయ వాయిద్యా లతో ప్రశాంతమైన వాతావరణంలో గణేష్ నిమజ్జన కార్యక్ర మాన్ని నిర్వహించుకోవాలని సూచించారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించడంతో పాటు నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా పోలీసుల కు నిర్వాహకులు, భక్తులు సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు.

## అంతర్జాతీయ సంజ్ఞా భాషల దినోత్సవం: భావవ్యక్తీకరణకు భాష్యం

శబ్ద తరంగాల స్పర్శ ఎరుగని నిశ్శబ్ద జగత్తులో, హృదయపు లోతులను ఆవిష్కరించే అద్భుత దృశ్యకావ్యం సంజ్ఞా భాష. భాష అనేది కేవలం పెదవుల కదలికలకో, నాద ప్రకంపనలకో పరిమితం కాదని, అది మనోభావాల ప్రతిరూపమని నిరూపించే సజీవ సాధనం సైన్ లాంగ్వేజ్. మానవ భావవ్యక్తీక రణకు శ్రవణేంద్రియం కేవలం ఒక మాధ్యమం మాత్రమే; అసలైన భాష హృద యంలో జనించి కనుచూపుల్లో, కరచాలనాల్లో, దేహ విన్యాసాల్లో రూపుదిద్దుకుం టుంది. నిశ్శబ్దపు లోయల్లో జీవించే కోట్లాది మంది ప్రజల అంతరంగాన్ని లోకానికి అనుసంధానించే ఈ దివ్య వంతెనను గౌరవిస్తూ, ప్రతి ఏటా సెప్టెంబర్ 23న అంతర్జాతీయ సంజ్ఞా భాషల దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ దినోత్సవ నేపథ్యాన్ని పరిశీలిస్తే దీనికి ఘనమైన చారిత్రక పునాది కనిపిస్తుంది. 1951 సెప్టెంబర్ 23న ఇటలీలోని రోమ్ నగరంలో 133 దేశాల చెవిటివారి జాతీయ సంఘాల సమాఖ్యగా 'వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ది డెఫ్' (ఔఖీఱ) ఆవిర్భవించింది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 7 కోట్లకు పైగా ఉన్న బధిర జనాభా ప్రాథమిక హక్కుల సాధనకు, వారి స్వయంప్రతిపత్తికి ఈ సంస్థ నాంది పలికింది. ఆ చారిత్రక ఘట్టాన్ని చిరస్మరణీయం చేస్తూ, ప్రపంచ బధిరుల సమాఖ్య ప్రతిపాదన మేరకు ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం తీర్మానం నంబర్ 72/161 ద్వారా సెప్టెంబర్ 23ను అంతర్జాతీయ సంజ్ఞా భాషల దినోత్సవంగా అధికారికంగా ప్రకటించి, 2018 నుంచి మొదటిసారిగా దీన్ని విశ్వవ్యాప్తంగా అమలులోకి తెచ్చింది. ప్రతి ఏటా సెప్టెంబర్ చివరి వారంలో జరిగే 'అంతర్జాతీయ బధిరుల వారం' (ఇంటర్నేషనల్ వీక్ ఆఫ్ ది డెఫ్) వేడుకల్లో భాగంగా ఈ దినోత్సవం వినూత్న చైతన్యాన్ని రగిలిస్తోంది. సాధారణంగా చాలామంది పొరబడే అంశం ఏమిటంటే, సంజ్ఞా భాష అనేది కేవలం కొద్దిపాటి సంకేతాల కలయిక లేదా మూగసైగల సమాహారమని భావించడం. కానీ వాస్తవానికి సంజ్ఞా భాషకు తనదైన స్వతంత్ర వ్యాకరణం, పదకోశం, రూపనిష్ప త్తి నియమాలు, వాక్యనిర్మాణ చట్రం ఉంటాయి. ప్రకృతిలోని భావాలను ప్రతిబిం బించే అష్టాదశ వర్ణనల లాంటి విస్తృతి దీనిలో కొలువై ఉంటుంది. చేతివేళ్ల విన్యాసం, అరచేతుల స్థానం, ముఖంలో వెల్లివిరిసే రసభావాలు, కనుబొమ్మల విరుపులు, పెదవుల ముద్రలు, భుజాల కదలికలు అన్నీ ఏకకాలంలో సమన్వ యమై ఈ భాషలో ఆలోచనలు రూపుదిద్దుకుంటాయి. ప్రపంచవ్యాప్తంగా ఒకే రకమైన సంజ్ఞా భాష ఉండదు; భౌగోళిక, సాంస్కృతిక భిన్నత్వాల వల్ల ప్రపంచం లో దాదాపు 300కు పైగా విలక్షణమైన సంజ్ఞా భాషలు వర్ధిల్లుతున్నాయి. అమెరికన్ సైన్ లాంగ్వేజ్ (ూూూ), బ్రిటిష్ సైన్ లాంగ్వేజ్ (దీూూ) లాగే మన దేశంలో భారతీయ సంజ్ఞా భాష (×ూూ - ఇండియన్ సైన్ లాంగ్వేజ్) వినికిడి లోపం ఉన్నవారి సహజ నిత్యజీవన భాషగా విరాజిల్లుతోంది. భారత రాజ్యాంగ పరిధిలో విభిన్న సంస్కృతులను మమేకం చేసుకుంటూ రూపుదిద్దుకున్న ఈ భాష వికాసానికి న్యూఢిల్లీ కేంద్రంగా ఏర్పాటైన 'ఇండియన్ సైన్ లాంగ్వేజ్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్' (×ూూ=ుజ) విశేషమైన సేవలందిస్తోంది. పదివేలకు పైగా ప్రామాణిక పదాలతో నిఘంటువును తీర్చిదిద్ది, ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్యా గ్రంథాల వరకు, ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాలను సైతం దృశ్య శ్రవణ మాధ్యమాల్లోకి అనువదించి జ్ఞానభాండాగారాన్ని బధిర విద్యార్థుల ముంగిటకు తెస్తోంది. భారతదేశ దృక్పథంలో విశ్లేషిస్తే, 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో సుమారు 50 లక్షల మంది వినికిడి లోపంతో జీవిస్తున్నట్లు నమోదైనా, ప్రస్తుత అంచనాల ప్రకారం వారి సంఖ్య కోటి దాకా ఉంటుందని నిపుణుల భావన. 2016 నాటి 'దివ్యాంగుల హక్కుల పరిరక్షణ చట్టం' (=ూఔఱ చాష్) అమలులోకి వచ్చిన తర్వాత సంజ్ఞా భాష ప్రాధాన్యత చట్టబద్ధమైన హక్కుగా గుర్తింపు పొందింది. 2020 జాతీయ విద్యా విధానం (చీజూ) సైతం పాఠశాల స్థాయి నుంచే సంజ్ఞా భాషను ఒక ప్రామాణిక భాషా మాధ్యమంగా స్వీకరించాలని స్పష్టం చేయడం ఒక చారిత్రక పరిణామం. సంజ్ఞా భాషను గుర్తించడం అంటే సమాజం వారిపై ఏదో ఔదార్యం చూపడం కాదు; అది వారి భావవ్యక్తీకరణ స్వేచ్ఛకు, సమానత్వానికి సంబంధించిన రాజ్యాంగబద్ధమైన హక్కు. న్యాయస్థానాలు, శాసనసభలు, వైద్యాలయాలు, రవాణా కేంద్రాలు, విద్యాసంస్థలు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాల్లో సంజ్ఞా భాషా అనువాదకులు (ఇంటర్‌ప్రిటర్స్) తప్పనిసరిగా అందుబాటులో ఉన్నప్పుడే ఒక సమ్మిళిత, వివక్షారహిత ప్రజాస్వామ్య సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది. సమాచార ప్రసార మాధ్యమాల్లో, వార్తా విశేషాల్లో, చలనచిత్రాలలో అనువాద ఉపశీర్షికలు, సైన్ లాంగ్వేజ్ విండోలను విస్తృతంగా పొందుపరచడం ద్వారా సమాచార సమానత్వం లభిస్తుంది. ఆధునిక కృత్రిమ మేధ, డిజిటల్ విప్లవ యుగంలో సంజ్ఞా భాష వికాసానికి కొత్త ద్వారాలు తెరుచుకుంటున్నాయి. మోషన్ సెన్సార్లు, కంప్యూటర్ విజన్ ఆధారిత స్మార్ట్ పరికరాలు సైగలను క్షణాల్లో లిఖిత, శబ్ద భాషల్లోకి తర్జుమా చేస్తుండటం శుభపరిణామం. అయితే సంకేతాలను సాంకేతికతకు మాత్రమే వదిలేయకుండా, సజీవ మానవ స్పర్శను దానికి తోడు చేయాల్సిన బాధ్యత సమాజంపై ఉంది. సాధారణ పౌరులు, ఉపాధ్యాయులు, వైద్యులు, న్యాయవాదులు, పరిపాలనాధికారులు సైతం ప్రాథమిక సంజ్ఞా భాషను అభ్యసించిన నాడు నిశ్శబ్దపు సరిహద్దులు చెరిగిపోయి సమైక్యతా భావం పరిమళిస్తుంది. ఒక చిరునవ్వుకు, కనురెప్పల ఆత్మీయ స్పందనకు హద్దులు లేనట్లే, సంజ్ఞల భాషకు శబ్దాల అడ్డంకులు ఉండవు. నాద బిందువులను మించిన భావ సౌరభాన్ని గుబాళింపజేస్తూ, నవరసాలను చేతివేళ్లపై నర్తింపజేసే ఈ అపురూప సంజ్ఞా భాషను ప్రతి ఒక్కరూ గౌరవించి, నేర్చుకుని, నిశ్శబ్ద ప్రపంచపు స్నేహహస్తాన్ని అందుకోవడమే అంతర్జాతీయ సంజ్ఞా భాషల దినోత్సవం ఇచ్చే సార్వజనీన సందేశం.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్**
**కాలమిస్ట్...9440595494**

ప్రభాతనవ సింగిడి | SINGIDI తెలుగు దినపత్రిక | ప్రతి రంగూ ఓ నిజం
సింగిడి

## జిల్లా జనరల్ ఆసుపత్రిలో కనీస వసతులు కరువు

### –ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం




**బిజినపల్లి (సింగిడి):** నాగర్‌కర్నూల్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు కనీస వైద్య, మౌలిక సదుపా యాలు అందడం లేదని ఆరోపి స్తూ బాధి తులు, నాయకులు ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమ ర్పించారు. ఆసుపత్రిలో ఎంఆర్ఐ స్కానిం గ్ సౌకర్యం లేకపోవడం, రాళ్లు, గడ్డలకు సంబంధించిన వైద్య సేవలు అందకపోవడం, అత్యవసర సమయాల్లో అంబులెన్స్ సౌకర్యం సరిగా లేకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే తాగునీరు వంటి కనీస వసతులు కల్పించాలని, పేదలకు పూర్తిస్థాయి ఉచిత వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ప్రతులను ఆసుపత్రి సూపరింటెండెంట్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారికి అందజేశారు. కార్యక్రమంలో పి. శంకర్, పి. రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## జూరాల రైతులకు సాగునీరు ఇవ్వాలి.. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి



**జడ్చర్ల, (సింగిడి):** జూరాల ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఇచ్చిన ధర్నా పిలుపు నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇందులో భాగంగా అప్పన్నపల్లి సమీపంలోని తిరుమలహిల్స్‌లోని తన నివాసంలో మాజీ మంత్రి డా. సి. లక్ష్మారెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. జూరాల ప్రాజెక్టు వద్ద బీఆర్ఎస్ నిరసన నేపథ్యంలో పలువురు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకున్నట్లు తాజా నివేదికలు వెల్లడించాయి. హౌస్ అరెస్ట్ అనంతరం మాజీ మంత్రి లక్ష్మారెడ్డి మీడియాతో మాట్లాడుతూ జూరాల ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలనే డిమాండ్‌తోనే బీఆర్ఎస్ ధర్నాకు పిలుపునిచ్చిందన్నారు. ధర్నాకు వెళ్లకుండా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేయడం, నిర్బంధించడం సరికాదని ఆయన విమర్శించారు. రైతుల సమస్యలను పరిష్కరించడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఆయన డిమాండ్ చేశారు. జూరాల ఆయకట్టు పరిధిలో సాగులో ఉన్న పంటలను కాపాడేందుకు అవసరమైన సాగునీటిని విడుదల చేయాలని కోరారు. జూరాల ప్రాజెక్టులో నీటి నిల్వలు ఉన్నప్పటికీ ఆయకట్టు పంటలకు నీటి విడుదల నిలిపివేయడంపై లక్ష్మారెడ్డి ప్రశ్నలు లేవనెత్తారు. తాగునీటి అవసరాల పేరుతో సాగునీటి విడుదలను నిలిపివేస్తున్నారని ప్రభుత్వం చెబుతోందని ఆయన ఆరోపించారు. పంటలను కాపాడే అవకాశం ఉన్నందున ప్రభుత్వం తక్షణమే సాగునీటి విడుదలపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. జూరాల నీటి విడుదల అంశంపై బీఆర్ఎస్ నేతలు చేసిన ఆరోపణల్లో ప్రాజెక్టులోని నీటి నిల్వలపై వేర్వేరు సంఖ్యలు ప్రస్తావించబడ్డాయి; తాజా నివేదికల్లో బీఆర్ఎస్ నేతలు సుమారు 9 టీఎంసీల నీరు ఉందని పేర్కొన్నట్లు ఉంది. ఈ సంఖ్యను స్వతంత్రంగా నిర్ధారించే అధికారిక తాజా బులెటిన్‌ను అందుబాటులో ఉన్న నివేదికల్లో గుర్తించలేకపోయాం.

## 108 అంబులెన్స్‌లో మహిళా ప్రసవం



**బల్మూరు, (సింగిడి):** బల్మూర్ మండలంలోని బాణాల గ్రామానికి చెందిన చెంచు మహిళ నాగలక్ష్మికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచా రం ఇచ్చారు. వెంటనే స్పందించిన 108 సిబ్బంది ఆమెను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ప్రసవ వేదనలు తీవ్రం కావడంతో వైద్య సిబ్బంది సుశీల, మేరీ సహాయంతో అంబు లెన్స్‌లోనే ప్రసవం నిర్వహించారు. నాగలక్ష్మి పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు సిబ్బంది తెలిపారు. అనంతరం వారిని అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## ఎన్‌సీసీతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు



**బోధన్ ప్రతినిధి, (సింగిడి):** విద్యార్థులకు ఎన్ సీసీ శిక్షణతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ట్రస్మా జిల్లా అధ్యక్షులు, ఇందూర్ హైస్కూల్ కరస్పాండెంట్ కొడాలి కిషోర్ అన్నారు. బోధన్ పట్టణంలోని ఆచన్ పల్లి లో గల ఇందూర్ హై స్కూల్ లో ఎన్ సీ సీ సర్టిఫికెట్ ల పంపిణీ కార్యక్రమం నిర్వహించా రు. ఎన్ సీసీ ఏ సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసుకున్న 56 మంది ఎన్ సీసీ క్యాడెట్లకు 12(టి )బిఎన్ ఎన్ సీ సీ నిజామాబాద్ సుబేదార్ బల్విందర్ సింగ్ చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా కొడాలి కిషోర్ మాట్లాడుతూ ఎన్ సీసీ సర్టిఫికెట్ ఉన్నవారికి ఉన్నత విద్యలో ప్రవేశానికి, ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. తమ పాఠశాలలో ఎన్సిసి శిక్షణ పూర్తి చేసుకున్న ఎంతోమంది విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడటం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఎన్సిసి సెకండ్ ఆఫీసర్ సాయిలు ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ ఇంచార్జ్ స్వాతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజల హక్కుల పరిరక్షణే తన ధ్యేయం





**ఆమనగల్లు, (సింగిడి):** ప్రజల హక్కులు, అభివృద్ధి కోసం నిరంతరం పోరాడుతానని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచందర్ రెడ్డి అన్నారు. సోమవారం కల్వకుర్తి నియోజకవర్గంలో సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా మైసిగండిలో కొలువైన గణనాథుని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్ రెడ్డి దర్శించుకున్నారు. మంగళమూర్తి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. గణనాథుని దర్శనంతో మనసంతా భక్తిభావంతో నిండిపోయిందని ఆయన పేర్కొన్నారు. ఆమనగల్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీచంద్ రెడ్డి సందర్శించారు. ఇటీవల నియమితులైన మండల, పట్టణ అధ్యక్షులను అభినందించి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కల్వకుర్తి . కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ సాధన కోసం చేపట్టిన దీక్షకు సంబంధించి పోలీసులు నమోదు చేసిన కేసులో ఆయన కోర్టుకు హాజరయ్యారు. ప్రజలతో కలిసి సాగించిన పోరాటం ఫలితంగానే ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటైందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు,నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

# నిర్వాసితులకు పరిహారం అందజేసేందుకు కృషి



**గద్వాల బ్యూరో (సింగిడి):** జోగులాంబ గద్వాల జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణ, నిర్వాసితులకు పునరావాస కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటుకు, భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందజేసేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, బిసి సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో కలిసి సోమవారం హైదరాబాదు నుంచి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి ఇరిగేషన్ ప్రాజెక్టుల భూ సేకరణ, నిర్వాసితులకు పునరావాస కేంద్రాల ఏర్పాటు, అటవీ భూముల పరిష్కారాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని ఇరిగేషన్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు విడుదల చేస్తామని జనవరి 2026లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన మాట మేరకు విడతలవారీగా నిధులు విడుదల చేయడం జరుగుతుందన్నారు. ఇది వరకు విడుదల చేసిన నిధులు కొంతమేరకే భూ నిర్వాసితులకు ఇవ్వడం, పునరావాస కేంద్రాల ఏర్పాటుకు ఖర్చు చేయడం జరిగిందని మిగిలిన చాలా వరకు నిధులు కలెక్టర్ల ఖాతాల్లో జమ ఉన్నాయని, కలెక్టర్ల ఖాతాలలో ఉన్న నిధులను యుద్ధ ప్రాతిపదికన భూములు కోల్పోయిన రైతులకు అందజేసి భూసేకరణ చేపట్టాలని, అదేవిధంగా భూ నిర్వాసితులకు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటుకై నిధులు ఖర్చు చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ కలెక్టర్లు రైతులతో మాట్లాడి భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. అదేవిధంగా రాబోయే యాసంగిలో సాగునీటికి చాలా ఇబ్బందులు ఉన్నాయని, అందువల్ల రైతులు వరి పంట కాకుండా ఇతర ఆరుతడి పంటలు సాగు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు గద్వాల నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ నెట్టెంపాడు, గట్టు ఎత్తిపోతల పథకాలతో పాటు మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ నిమిత్తం రైతులను ఒప్పించి ముందుకెళ్తున్నామన్నారు. భూ సేకరణ పూర్తయిన రైతులకు అవార్డు పాస్ చేసి నిధులు ఖర్చు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. ఈ సమావేశంలో భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆదివారం సెలవు దినం.. రెచ్చిపోతున్న ఇసుక రవాణా!




**కల్వకుర్తి (సింగిడి):** వంగూరు మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో దుందుభి వాగు ప్రాంతంలో ఆది వారం సెలవు దినాన్ని ఆసరాగా చేసుకుని దుందుభి వాగు ప్రాంతంలో ఇసుక రవాణా మరింత జోరుగా సాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా భారీ సంఖ్యలో టిప్పర్లు ఇసుకను తరలిస్తున్నా యని, ముఖ్యంగా సెలవు రోజు ల్లో అధికారులు పర్యవేక్షణ తగ్గడంతో రవా ణా మరింత పెరుగుతోందని ప్రజలు ఆవేద న వ్యక్తం చేస్తున్నారు. వాగు పరిసర ప్రాం తాల నుంచి దొంగదారుల ద్వారా ఇసుకను తరలిస్తున్నారని స్థానికులు చెబుతు న్నారు. పెద్ద సంఖ్యలో టిప్పర్ల రాకపోకలు సాగిస్తు న్నప్పటికీ సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. అధి కారులు అన్నీ తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఇక అధికార పార్టీకి చెందిన కొందరు నాయకుల అండదండలతోనే ఇ సుక రవాణా సాగుతోందని స్థానికుల్లో చర్చ జరుగుతోంది. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారికంగా ధృవీకరణ కావాల్సి ఉంది. ఇసుక రవాణాకు అనుమతులు ఉన్నాయా? వాహనాలకు సరైన పర్మిట్లు ఉన్నాయా? నిబంధనలకు అనుగుణంగానే ఇసుక తరలిస్తున్నారా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా జరుగుతున్న ట్లు తేలితే సంబంధిత వ్యక్తులు, వాహన యజమానులు, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికు లు డిమాండ్ చేస్తున్నారు. దుందుభి వాగు ప్రాంతంలో అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి రాత్రి వేళల్లోనూ తనిఖీలు నిర్వ హించా లని కోరుతున్నారు. ఇసుక రవాణాపై వస్తున్న ఆరోపణలపై ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ చేపట్టి వాస్తవా లను వెలుగులోకి తీసుకురా వాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘిం చినట్లు తేలితే ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# చిన్నారికి రూ.6 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసీ అందచేత



**అల్వాల్ (సింగిడి):** అల్వాల్ జిహెచ్ఎంసి పరిధిలోనిబొల్లారం ప్రాంతానికి చెందిన నరేష్ కుమార్తె తన్విత అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్స పొందుతున్న నేపథ్యంలో, కుటుంబ సభ్యులు సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారి దరఖాస్తును ప్రభుత్వం పరిశీలించి రూ. 6 లక్షల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసింది. ఈ సందర్భంగా మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సోమవారం క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ. 6 లక్షల ఎల్ఓసీ పత్రాన్ని తన్విత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన్విత త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు డోలి రమేష్, నార్ల సురేష్, ప్రశాంత్ రెడ్డి, నర్సింగరావు, బషీర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు సమస్యలను ప్రజాస్వామ్య పద్ధతిలో అధికారుల దృష్టికి తేవాలి

**అమరచింత, (సింగిడి):** జూరాల కెనాల్ ఆయకట్టు పరిధిలోని రైతులు సాగునీటి సమస్యలను ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ఐపీఎస్ సూచించారు. సోమవారం జూరాల డ్యాం వద్ద ఎడమ కాలువ ప్రాంతాన్ని ఎస్పీ స్వయంగా పరిశీలించి, క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకున్నారు. రైతుల సమస్యలపై సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. రైతులు తమ సమస్యలను శాంతియుతంగా తెలియజేసే సమయంలో సంయమనం పాటించాలని, ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా నిరసన కార్యక్రమాలునిర్వహించాలని ఎస్పీ కోరారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



# పెబ్బేరు మున్సిపల్ 1వ వార్డులో సమస్యల పరిష్కారానికి వినతి

**పెబ్బేరు(సింగిడి):** పెబ్బేరులోని 1వ వార్డులో నెలకొన్న వివిధ ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరిం చాలని కోరుతూ వార్డు కౌన్సిలర్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎద్దుల కరుణశ్రీసాయి కాలనీ మహిళలు, పెద్దలు, యువకులు సం బంధిత అధికా రులకు వినతిపత్రాలు సమ ర్పించారు. ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీ డీవోకు, మున్సిపల్ కార్యాలయంలో మున్సి పల్ చైర్మన్‌కు సమస్యలను వివరిస్తూ వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా 1వ వార్డులో వీధికుక్కల బెడద తీవ్రంగా పెరిగిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. వీధికుక్కలు ప్రజలను వెంటా డుతూ దాడులకు పాల్పడుతున్నాయని, తాజాగా తెల్లవారుజామున బుతుకూరు చెన్నమ్మతో పాటు మరో ఇద్దరు మహిళ లపై కుక్కలు దాడి చేయడంతో వారు గాయపడినట్లు తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా వీధికుక్కల నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే రాత్రివేళ వీధి దీపాలు వెలగకపో వడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. చీకటి కారణంగా పాములు, ఇతర విషపురుగు లు సంచరిస్తున్నాయని, దీంతో ప్రజలు భయాం దోళనలకు గురవుతున్నారని పేర్కొన్నారు. వార్డులోని అన్ని ప్రాంతాల్లో వీధి దీపాలను ఏర్పాటు చేసి నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరా రు. తాగునీటి సమ స్య కూడా తీవ్రంగా ఉందని స్థానికులు అధికా రుల దృష్టికి తీసుకెళ్లారు. నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బం దులు పడుతున్నారని, వేసవితో పాటు సాధా రణ రోజుల్లోనూ తాగునీటి కోసం ఇబ్బం దులు ఎదుర్కొం టున్న పరిస్థితి ఉందని తెలిపారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. డ్రైనేజీలలో మురుగునీరు నిలిచిపోవడంతో పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు తెలిపారు. నిల్వ ఉన్న మురుగునీటి నుంచి దుర్వా సన వెలువడటంతో పాటు దోమలు విపరీతంగా పెరుగుతున్నాయని, దీనివల్ల ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడుతోం దని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీలను శుభ్రం చేసి మురుగునీరు సక్రమంగా ప్రవహించేలా చర్యలు చేపట్టాలని కోరా రు. ఇక రోడ్ల పక్కన పిచ్చిమొక్కలు ఏపు గా పెరిగి పారిశుధ్య సమస్యలకు కారణ మవుతున్నాయని తెలిపారు. పొదలు, పిచ్చిమొక్కల కార ణంగా దోమలు, విషపురుగుల బెడద పెరుగుతోంద ని, వాటిని తొలగించి పరిసరాలను పరిశు భ్రంగా ఉంచాలని విజ్ఞప్తి చేశారు.

## నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

### వీధి కుక్కలు, పందుల బెడదను అరికట్టాలని ప్రజావాణిలో ఫిర్యాదు



**జడ్చర్ల, (సింగిడి):** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య సోమవారం జడ్చర్ల ఎంపీడీవో కార్యాల యంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. జడ్చర్ల పట్టణంలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో కనీస వసతులు, ఆటస్థలాలు, భవన నిర్మాణ అనుమతులపై సమస్యలు ఉన్నాయని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. రాఘవేంద్ర స్కూల్ భవన నిర్మాణం, కాకతీయ టెక్నో స్కూల్, మిడ్‌ల్యాండ్ స్కూల్, శివశివాని స్కూల్, న్యూ సన్‌రైజ్ స్కూల్‌లలో వసతులపై ఫిర్యాదులు ఉన్నాయని, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై జడ్చర్ల ప్రజావాణిలో ఎంఆర్ఓ నర్సింగ్‌రావుకు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.

**వీధి కుక్కలు, పందుల బెడదపై చర్యలు తీసుకోవాలి**

జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కలు, పందులు గుంపులుగా సంచరిస్తున్నాయని, ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని సత్తయ్య ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజల భద్రత, పారిశుధ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధం గా 167వ జాతీయ రహదారిపై సింగిల్‌గడ్డ కొత్త బ్రిడ్జి వద్ద రహదారి గుంతలమయంగా మారి ప్రమాదాలకు కారణమ వుతోందని, ఆర్‌అండ్‌బీ అధికారులు తగిన చర్యలు తీసుకో వాలని కోరారు. ప్రజావాణి కార్యక్రమానికి సంబంధిత శాఖల అధికా రులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కూడా తన ఫిర్యాదులో సత్తయ్య కోరారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ



**బల్మూరు, (సింగిడి):** బల్మూర్ మండలం జినుకుంట గ్రామానికి చెందిన కాలువ భరత్ (16) మృతి పట్ల అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ సంతాపం తెలిపారు. నాగర్‌కర్నూల్‌లోని బీసీ రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న భరత్ ఉపాధ్యాయుల వేధింపులకు గురై ఆత్మ హత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ జినుకుంట గ్రామానికి చేరుకుని భరత్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఘటన వివరాలను అడిగి తెలుసుకుని, బాధిత కుటుంబానికి అండగా ఉంటా మని భరోసా ఇచ్చారు. ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకునేలా కృషి చేస్తామన్నారు.

## విజయవంతంగా అన్న ప్రసాద వితరణ



**గుండాల, (సింగిడి):** మండల కేంద్రంలోని జీసీసీ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో సోమవారం బతుకమ్మ ఘాట్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గుండాల ఎస్సై శ్రవణ్ కుమార్, ప్రముఖ వ్యాపారవేత్త మానాల ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరై అన్న ప్రసాద వితరణను ప్రారంభించారు. అనంతరం భక్తులు, గ్రామస్థు లు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుని దర్శించు కుని అన్న ప్రసాదాన్ని భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మహా అన్న ప్రసాద వితరణకు సహకరించిన దాతలు, భక్తులు, గ్రామస్థులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు వెలిశాల నరేష్, మాజోజు పవన్ కుమార్, వెలిశాల వేణు, వెలిశాల రవి, మాజోజు చంద్రా చారి, వెలిశాల రమేష్, శ్రీరంగం శ్రీను, వెలిశాల శ్రీను, వెలిశాల సత్యం, కొనపర్తి వెంకటేశ్వర్లు, మాజోజు వెంక టేష్, మాజోజు జగన్, మాజోజు ప్రవీణ్, వెలిశాల రాకేష్, వెలిశాల విద్యాసాగర్‌తో పాటు యువత, గ్రామస్థులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరంగాపూర్ మండల బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టులు



**శ్రీరంగాపూర్, (సింగిడి):** మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదేశాల మేరకు జూరాల ఎడమ కాలువ వద్ద సాగునీరు వి డుదల కోసం చేపట్టనున్న భారీ ధర్నాకు శ్రీరంగాపూర్ మండలం నుంచి బీఆర్ఎస్ నాయ కులు, కార్యకర్తలు బయలుదేరారు. ధర్నాలో పాల్గొనేందుకు వెళ్తున్న ఎంపీపీ గాయత్రీ పృథ్వీరాజ్, కంబాలాపూర్ సర్పంచ్ విజయ్, శ్రీరంగాపూర్ మండల అధ్యక్షుడు ఆర్ వెంకటయ్య, నాగరాల మాజీ సర్పంచ్ నిర్మల రాధాకృష్ణ, పలుస శంకర్ గౌడ్, నుప్రసాద్, షఫీ, పర్వతాలు తదితరులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ధర్నా నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అరెస్టులపై బీఆర్ఎస్ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. జూరాల ఎడమకాల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ధర్నాను అడ్డుకోవడం సరికాదని వారు పేర్కొన్నారు.

ప్రభాతనవ సింగిడి తెలుగు దినపత్రిక
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం



# జ్వరంతో ఆస్పత్రికి వచ్చే ప్రతి రోగికి డెంగ్యూ పరీక్షలు నిర్వహించాలి

**-ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉన్న ఎక్స్‌రే, ల్యాబ్, ఇతర సదుపాయాలను వినియోగించాలి**

**-కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం**





**వనపర్తి ప్రతినిధి, (సింగిడి):** జ్వరంతో ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి డెంగ్యూ పరీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఖిల్లా ఘనపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను, ప్రజలకు అందుతున్న వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముందుగా ఆసుపత్రిలోని ల్యాబ్, ఎక్స్‌రే గదిని కలెక్టర్ పరిశీలించారు. ప్రయోగశాలలో అందుబాటులో ఉన్న పరీక్షలు, రోజువారీగా నిర్వహిస్తున్న పరీక్షల వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి అందుబాటులో ఉన్న ఎక్స్‌రే యంత్రాన్ని పూర్తిస్థాయిలో వినియోగించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జ్వరంతో ఆసుపత్రికి వచ్చే రోగులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. సకాలంలో వ్యాధిని గుర్తించి అవసరమైన చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే క్షయ వ్యాధి అనుమానం ఉన్న రోగులను గుర్తించి అవసరమైన వారికి ఎక్స్‌రే పరీక్షలు విస్తృతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రులకు ప్రభుత్వం అందించిన ఎక్స్‌రే యంత్రాలను నిరుపయోగంగా ఉంచకుండా అవసరమైన రోగులకు పరీక్షలు నిర్వహించేందుకు పూర్తిస్థాయిలో వినియోగించాలని చెప్పారు. క్షయ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి సంబంధిత వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న మందులపై కలెక్టర్ వైద్యులను, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, మందుల నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఆసుపత్రిలో ప్రసవాల నిర్వహణకు సంబంధించిన అంశాలపై కూడా కలెక్టర్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే గర్భిణులకు అవసరమైన వైద్య సేవలు, ప్రసవ సమయంలో అందించాల్సిన సౌకర్యాలను సమర్థవంతంగా కల్పించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ వైద్య సేవలు అందించేలా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఆసుపత్రి పరిసరాలు, వార్డులు, ఇతర ప్రాంతాల్లో పరిశుభ్రతను ఎల్లప్పుడూ కాపాడాలని కలెక్టర్ ఆదేశించారు. రోగులకు, వారి సహాయకులకు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఖిల్లా ఘనపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహాన్ని పరిశీలించారు. వసతి గృహ భవనం శిథిలావస్థకు చేరిన ప్రస్తుత పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. శిథిలావస్థకు చేరిన వసతి గృహ భవనానికి సంబంధించి పూర్తి వివరాలతో ఫైల్‌ను సిద్ధం చేసి సమర్పించాలని ఎస్సీ సంక్షేమ అధికారిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుత భవనం పరిస్థితి, నూతన భవనం నిర్మాణం ఆవశ్యకత తదితర అంశాలను పొందుపరుస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల వసతికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు తాత్కాలికంగా వసతి కల్పించేందుకు అనువైన భవనాన్ని గుర్తించి అవసరమైన సౌకర్యాలతో అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు. శిథిలావస్థలో ఉన్న భవనంలో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. తాత్కాలిక భవనం గుర్తింపు, నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయడం వంటి చర్యలను సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి భాస్కర్ నాయక్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రాంజీరావు, తహసిల్దార్, ఎంపీడీవో, సంబంధిత వైద్యులు, వైద్య సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు

## అసెంబ్లీలో బి ఆర్ ఎస్ నేతల అనుచిత ప్రవర్తనకు నిరసనగా నేడు ఆత్మకూర్‌లో ధర్నా

**కాంగ్రెస్ ఆత్మకూరు పట్టణ అధ్యక్షులు ఈర్లదిన్నె శ్రీనివాసులు**



**అమరచింత (సింగిడి):** రాష్ట్రంలో గత మూడు రోజులుగా జరుగుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో బీ ఆర్ ఎస్ నేతల తీరును నిరసిస్తూ నేడు ఆత్మకూరు గాంధీ చౌరస్తాలో ధర్నా నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఆత్మకూరు పట్టణ అధ్యక్షులు ఈర్లదిన్నె శ్రీనివాసులు తెలిపారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి డా. వాకిటి శ్రీహరి ఆదేశాలు, వనపర్తి డిసిసి అధ్యక్షులు శివసేన రెడ్డి సూచనల మేరకు ఈ ధర్నా చేపడుతున్నట్లు మండల అధ్యక్షులు ఎన్. నాగేశ్వర్, పట్టణ అధ్యక్షులు శ్రీ శ్రీనివాసులు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా సమస్యలను అసెంబ్లీలో లోతుగా చర్చించి పరిష్కరించే దిశగా కృషి చేస్తుంటే నేతలు ఉద్దేశపూర్వకంగా ఘర్షణ వాతావరణం సృష్టించి అలజడి లేపుతున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఆవరణలో నిబంధనలకు విరుద్ధంగా నల్ల టీషర్టులు ధరించి, స్లోగన్స్ రాసుకుని వచ్చి రాద్ధాంతం చేయడం, ఏకంగా స్పీకర్ పైనే దుర్భాషలాడటం, దళిత స్పీకర్ పై అసభ్య పదజాలంతో దూషించడం, మహిళా పోలీసుల పట్ల పురుష బీ ఆర్ ఎస్ ఎమ్మెల్యేలు షర్టులు విప్పి ప్రవర్తించడం సభ్య సమాజం తలదించుకునేలా ఉందని విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రేవంత్ రెడ్డిపై రాయలేని భాషలో దుర్భాషలాడారని పేర్కొన్నారు. ఈ ధర్నా కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

## భూత్పూర్ సాగునీటి కాలువ తూముల ధ్వంసం

**-బాధ్యులపై పీడీ యాక్ట్ కింద చర్యలు తీసుకోవాలి**



**అమరచింత, (సింగిడి):** భూత్పూర్ సాగునీటి కాలువ తూములు, షట్టర్లు ధ్వంసం చేసిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, రైతు సంఘాల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం అమరచింత మండల పరిధిలోని ధర్మాపురం, మస్తిపురం డిస్ట్రిబ్యూటరీ తూము షట్టర్లను తొలగించి, రాడ్లు, ఇతర సామాగ్రిని ధ్వంసం చేసిన ప్రదేశాలను రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతు పొలాలకు సాగునీరు అందించే లక్ష్యంతో నిర్మించిన కాలువలు, తూములకు ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం, ఉన్నతాధికారుల అలసత్వం కారణంగా రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. చివరి ఆయకట్టు రైతుల పొలాలకు నీళ్లు రాకుండా కొందరు విద్రోహ శక్తులు కుట్రపన్ని ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సాగుజలాలను, కాలువలు, తూములను రక్షించాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. చివరి ఆయకట్టు రైతులు పొలాలకు నీళ్లు లేక పంటలు ఎండిపోతుంటే ఇలాంటి పనులు చేయడం, ప్రభుత్వ ఆధీనంలోని తూములను ధ్వంసం చేయడం చట్టరీత్యా నేరమని, సమగ్ర విచారణ జరిపి పర్యవేక్షణ లస్కర్ తో పాటు బాధ్యులైన అధికారులు, నిందితులపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అమరచింత సీపీఐ రైతు సంఘం నేత కె. లక్ష్మీనారాయణ, రైతులు చిన్న వెంకటరెడ్డి, కోదండరెడ్డి, కాలువ లస్కర్ శ్రీనివాసులు, అమరచింత మున్సిపాలిటీ చైర్మన్ జింక సువర్ణ రవి, మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రవికాంత్, చెరువు అధ్యక్షులు పి. విష్ణు, రాఘవేంద్ర, ఎం. శేఖర్, ఆంజనేయులు, రఘు, సుబ్యా నాయక్, పి. రాము, ఉప్పరి రంగన్న, భూత్పూర్ కాలువ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభకు పట్టం.. సంబరాలకు వేదిక

**ఘనంగా ప్రారంభమైన వార్షికోత్సవ వేడుకలు**



**బిజినపల్లి, (సింగిడి):** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వారోత్సవ వేడుకలు విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య ఘనంగా ప్రారంభమయ్యాయి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రథమ సంవత్సరం విద్యార్థుల కోసం ఈ వేడుకలను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి నాగర్ కర్నూల్ నోడల్ అధికారి శ్రీ వెంకటరమణ ముఖ్యఅతిథిగా హాజరుకాగా, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ స్వామి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి శ్రీ వెంకటరమణ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం కళాశాలలో అత్యధిక ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆయన చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రశ్నోత్తర పోటీలు, ఇతర పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కూడా పురస్కారాలను అందించి అభినందించారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు తమలోని ప్రతిభను వెలికితీసుకుని అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు వి. మదన్మోహన్ రెడ్డి, గౌస్ మొయిద్దీన్, బండి నరసింహ, గుంటి గోపి, జానయ్య, పద్మజ, వినోద్, విష్ణు, ప్రవీణ్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు. అధ్యాపకులు విద్యార్థులను అభినందిస్తూ, తమ సందేశాల ద్వారా వారిలో ఉత్సాహాన్ని నింపారు. విద్యార్థిని, విద్యార్థులు ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉపన్యాసాలతో ఆకట్టుకున్నారు. వివిధ కార్యక్రమాలతో కళాశాల ప్రాంగణం సందడిగా మారింది. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ శ్రీ స్వామి స్వాగతం పలికారు. కళాశాల అభివృద్ధికి చేదోడువాదోడుగా ఉంటూ సహకరిస్తున్న గ్రామ సర్పంచ్ శ్రీ రామకృష్ణను, మాజీ ప్రిన్సిపాల్ శ్రీ రాముడిని ఈ సందర్భంగా అభినందించారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు అధ్యాపకులు, ప్రజాప్రతినిధులు అందిస్తున్న సహకారం అభినందనీయమని నిర్వాహకులు పేర్కొన్నారు.

## వరి బోనస్ ఆన్లైన్ నమోదు గడువు 17 వరకు పొడిగింపు

**ములకలపల్లి, (సింగిడి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావు పేట నియోజకవర్గం ములకలపల్లి మండల రైతులకు వ్యవసాయ అధికారి బీ అరుణ్ బాబు ప్రతి ఒక్కరైతులు ప్రభుత్వం నిర్ణయించిన వరి రకాలైన తెలంగాణ సోనా (ఆర్ ఎన్ ఆర్ 15048), సాంబా మసూరి (బీ పి టి 5204), కే ఎన్ ఎం 1638, హెచ్ఎంటి సోనా, జై శ్రీరామ్, డబ్ల్యూ జి ఎల్ 44, కె ఎన్.ఎం 7715 రకాలను సాగు చేస్తున్న రైతులు తమ పంట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించింది. డీలర్ వద్ద విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్ మరియు విత్తనాలు కొనుగోలు బిల్లు తీసుకుని, విత్తనాలు కొనుగోలు చేసిన డీలర్ వద్ద తమ వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. అలాగే, సొంత విత్తనం లేదా ఇతర రైతుల నుంచి పొందిన విత్తనాలను వినియోగించే రైతులు రైతు ధృవీకరణ పత్రంతో పాటు సంబంధిత వివరాలను ఏఈఓకి సమర్పించాలని సూచించారు.

## పంటల మార్పిడిపై రైతులకు అవగాహన



**తాడూర్ (సింగిడి):** తాడూర్ మండలంలోని ఐతోల్ గ్రామంలో రైతులకు పంటల మార్పిడి పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి డి. సందీప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రైతులు ఎక్కువ నీరు అవసరమయ్యే, ఎక్కువ కాలపరిమితి కలిగిన పంటలను సాగు చేయకుండా తక్కువ కాలపరిమితి కలిగిన మినుములు, నువ్వులు, పెసర్లు, ఉలవలు వంటి పంటలను సాగు చేసుకోవాలని సూచిం చారు. ప్రస్తుతం నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని రైతులు పంటల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. వానాకాలంలో ఇప్పటికే సాగు చేసిన పంటలకు అవసరమైన మేరకే నీటిని వినియోగిస్తూ తక్కువ మొత్తంలో నీటితో పంటలను కాపాడుకోవాలని కోరారు. నీటిని పొదుపుగా వినియోగించుకోవడం ద్వారా పంటలను కాపాడుకోవడంతో పాటు భవిష్యత్ సాగుకు కూడా నీటి లభ్యతను కొనసాగించవచ్చని తెలిపారు. తక్కువ కాలపరిమితి కలిగిన పంటలను సాగు చేయడం వల్ల తక్కువ నీటితో పంటను పూర్తి చేసుకునే అవకాశం ఉంటుందని రైతులకు వివరించారు. అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకుని వ్యవసాయంలో నష్టాలను తగ్గించుకోవాలని సూచించారు.

## రోడ్డు మరమ్మతు పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్



**కాప్రా, (సింగిడి):** రానున్న వినాయక చవితి పండుగను పురస్కరించుకుని చక్రిపురం లో జరుగుతున్న రోడ్డు మరమ్మత్తు పనులను శుక్రవారం మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ పరిశీలించారు. చక్రిపురం ప్రధాన రహదారి, అంతర్గత రోడ్లలో గుంతలు పడి వాహనదారులకు ఇబ్బంది కలుగుతుండటంతో, వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని, వినాయక విగ్రహాల తరలింపు, నిమజ్జన ఊరేగింపు సమయంలో ఎలాంటి ఆటంకాలు కలగకుండా రోడ్లను సిద్ధం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా బొంతు శ్రీదేవి యాదవ్ మాట్లాడుతూ చక్రిపురం తో పాటు చర్లపల్లి, కుషాయిగూడ డివిజన్ లోని అన్ని ప్రధాన రహదారులను త్వరితగతిన మరమ్మత్తు చేస్తామని, భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, స్థానిక నాయకులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నేత మాజీ కౌన్సిలర్ చెన్నయ్యపై కఠిన చర్యలు తీసుకోవాలి

**ఆత్మకూరు నాయీ బ్రాహ్మణ సేవా సంఘం డిమాండ్**

**అమరచింత, (సింగిడి):** భారత రాష్ట్ర సమితి పార్టీ మాజీ కౌన్సిలర్ చెన్నయ్యపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు నాయీ బ్రాహ్మణ సేవా సంఘం డిమాండ్ చేసింది. బుధవారం ఆ పార్టీ విలేకరుల సమావేశంలో ఖానాపురం మాజీ కౌన్సిలర్ చెన్నయ్య నాయీ బ్రాహ్మణ కులాన్ని దూషిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ శుక్రవారం సంఘం నేతలు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు సంతోష్ కుమార్, మండల అధ్యక్షులు తిప్పడంపల్లె శంకర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆత్మకూరు, అమరచింత మండల, జిల్లా సభ్యులు మాట్లాడుతూ రాజకీయ విలేకరుల సమావేశంలో మాజీ ప్రజాప్రతినిధి తమ కులాన్ని దూషించడం హేయమైన చర్య అని ఖండించారు. సంబంధిత వ్యాఖ్యలపై బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ఆ మాజీ కౌన్సిలర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భవిష్యత్ లో ఏ పార్టీ నాయకులైనా రాజకీయ సమావేశాల్లో ప్రాస లేదా సామెత రూపంలోనైనా తమ కులాన్ని ఉద్దేశించి మాట్లాడితే సహించబోమని హెచ్చరించారు. బహిరంగ క్షమాపణ చెప్పకపోతే పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్ర మంలో అమరచింత పట్టణ అధ్యక్షులు శివ, మండల అధ్యక్షులు రాఘవేంద్ర, జిల్లా జాయింట్ సెక్రెటరీ లక్ష్మీనారాయణ, జిల్లా పూర్వ ఉపాధ్యక్షులు హనుమంతు, గ్రాడ్యుయేట్ సంఘం నాయకులు వినోద్, ఆత్మ కూర్ టౌన్ ఉపాధ్యక్షులు గోపాల్, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, సభ్యులు మల్లికార్జున్, రాజు, శేఖర్, శివయ్య, విష్ణు, రవి, ఆరేపల్లి బాలస్వామి, అమరచింత టౌన్ పూర్వ అధ్యక్షులు ఎస్. అనిల్ కుమార్, ఉమ్మడి పాలమూరు జిల్లా నాయకులు చింతకుంట మధు పాల్గొన్నారు.

## దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే కాంగ్రెస్ చూస్తూ ఊరుకోదు



**బల్మూరు, (సింగిడి):** బల్మూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కెసిఆర్ ఫామ్‌హౌస్ వద్ద జరిగిన ఘటనకు నిరసనగా అంబేద్కర్ విగ్రహా నికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెల్లమల్ల రాంప్రసాద్ గౌడ్ మాట్లా డుతూ.. దళిత వర్గానికి చెందిన శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ పట్ల బి ఆర్ ఎస్ నాయకుల వ్యవహార శైలి దళిత సమాజాన్ని, ప్రజాస్వామ్య వ్యవ స్థను అవమానించడమే నని విమర్శించారు. దళిత ఆత్మగౌరవాన్ని, రాజ్యాంగబద్ధ పదవులను గౌరవించాలని, ఘటనపై బి ఆర్ ఎస్ నాయకులు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి ఖదీర్, మాజీ మార్కెట్ చైర్మన్ శ్రీపతిరావు, ఎస్సీ సెల్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు, సర్పంచు లు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, యువ నాయకులు, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంబీబీఎస్లో సీటు సాధించిన గిరిజన విద్యార్థికి సన్మానం



**కోడేరు (సింగిడి):** కోడేరు మండల పరిధిలోని నాగులపల్లి తండాకు చెందిన గిరిజన విద్యార్థి రాత్లావత్ శివ ప్రభుత్వ కళాశాలలో ఎంబిబిఎస్ సీటు సాధించిన విషయాన్ని తెలుసుకున్న కొల్లాపూర్ తాలూకా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లేపల్లి జగన్మోహన్ రెడ్డి శుక్రవారం నాడు ఆయన నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛము అందించి శాలువా లతో ఘనంగా సన్మానించారు గిరిజన తండాకు చెందిన శివ ఎంబిబిఎస్ లో సీటు సాధించడం తండావాసుల అదృష్టకరమని ఆయన అన్నారు ఇంకా ఉన్నత చదువులు చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన సూచించారు పోటీ సమాజంలో విద్యార్థికి సీటురావడం నాగులపల్లి తండాకు గర్వకారమని ఆయన కొనియాడారు ఈ కార్యక్రమంలో రఘునాథ నాయక్ హనుమంతు ఉప సర్పంచ్ పిక్ మీటు నాయక్ రెండో వార్డ్ మెంబర్ భాషా నాయక్ రాజు నాయక్ స్వామి నాయక్ హాబీ నాయక్ రాజు జగపతి శివ మరియు గ్రామ పెద్దలు యువకులు, మహిళలు పాల్గొన్నారు.

**పెరుగుతున్న వీధి కుక్కల బెడద.. ప్రజల్లో ఆందోళన**

**జడ్చర్ల, (సింగిడి):** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో రోజురోజుకూ వీధి కుక్కల సంఖ్య పెరుగుతుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారులు, కాలనీలు, నివాస ప్రాంతాల్లో గుంపులుగా తిరుగుతు న్న వీధి కుక్కలతో చిన్నారులు, వృద్ధులు బయటకు వెళ్లేందుకు భయపడుతున్న పరిస్థితి నెలకొంది. గతంలో కూడా వీధి కుక్కలు చిన్నారులను కరిచిన ఘటనలు చోటుచేసుకున్నాయని స్థానికులు గుర్తుచేస్తున్నారు. ప్రస్తుతం కుక్కల సంఖ్య మరింత పెరుగుతున్న నేప థ్యంలో మున్సిపల్ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# 22ఏ భూముల సమస్యపై బీఆర్ఎస్ కీలక సమావేశం

**22 బాధితులకు అండగా బీఆర్ఎస్ పోరాటం: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**



**అల్వాల్, (సింగిడి):** 22 నిషేధిత భూముల సమస్యపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌లో కీలక సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే శ్రీ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్). మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు 22A ప్రభావిత ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు 22ఏ భూముల సమస్యకు సంబంధించిన అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. 22ఏ నిషేధిత జాబితాలో భూములను చేర్చడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా వేలాది కుటుంబాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ఆస్తులపై ఏర్పడుతున్న ఆంక్షలు, ప్రజలకు కలుగుతున్న నష్టాలను ఈ సందర్భంగా వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సుమారు 16 లక్షల ఎకరాలు మాత్రమే నిషేధిత జాబితాలో ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిషేధిత జాబితాలో భూముల విస్తీర్ణం భారీగా పెరిగి కోటికి పైగా ఎకరాలకు చేరిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. 22ఏ పేరుతో సామాన్య ప్రజల భూములను నిషేధిత జాబితాలో చేర్చి ఇబ్బందులకు గురిచేయడం అన్యాయమని, నిజమైన ప్రైవేట్ ఆస్తులకు రక్షణ కల్పించి బాధితులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ముఖ్య మంత్రి, రెవెన్యూ మంత్రి భాగోతాలు బయటపడతాయనే భయంతోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను శాసన సభ నుంచి సస్పెండ్ చేశారని నాయకులు విమర్శించారు. తమపై ఎన్ని కుట్రలు, నిర్బంధాలు, అణచి వేత చర్యలు చేపట్టినా ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా "గజానికి ఒక గజ దొంగ ఉన్న ఈ ప్రభుత్వాన్ని వదిలి పెట్టం" అంటూ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. 22ఏ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు బాధిత ప్రజల తరఫున బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. అనం తరం 22 ప్రభావిత ప్రాంతాల ప్రజలతో నాయకులు మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మాజీ కార్పొరేటర్లు శ్రీమతి చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, తోట నరేందర్ రెడ్డి, శ్రీ నేమురి శ్రీధర్ గౌడ్, భాస్కర్ రెడ్డి, శ్రీ శోభన్ బాబు, శ్రీ వంశీ ముదిరాజ్, శ్రీ మారెడ్డి రాజశేఖర్ రెడ్డి, గణేష్ తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

సిన్మా సింగిడి
Cinma Singidi

బుధవారం
23-9-2026



Kayadu Lohar

రణబాలి..

# ఏందయ్యా సామీ

## ఫుల్‌సాంగ్ వచ్చేసింది..

ఆరు నెలల క్రితం రణబాలి నుంచి విడుదలైన చిన్న బీట్ 'ఏందయ్యా సామీ' పాట ఎంతటి సెన్సేషన్ క్రియేట్ చేసిందో తెలిసిందే. ఇప్పుడీ పూర్తి పాటను టీమ్ విడుదల చేసింది. 'అమ్మవో.. ఆలివో.. నువ్వు ఎవరో గానీ.. ఏలవే రణబాలిని రాణి' అనే లిరిక్స్ రణబాలి, జయమ్మల మధ్య అనుబంధాన్ని తెలిపేలా ఉన్నాయి విజయ్ దేవరకొండ, రష్మిక జంటగా నటించిన ఈ సినిమా అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రానుంది

సుబ్బలక్ష్మి సర్‌ప్రైజ్‌లకు

# మైండ్ బ్లాంక్ :

## కయాదు లోహర్

సుబ్బలక్ష్మి 'ది ప్యారడైజ్' కథను మలుపు తిప్పుతుందని థియేటర్‌లో తన పాత్ర ఇచ్చే సర్‌ప్రైజ్‌లకు ప్రేక్షకుల మైండ్ బ్లాంక్ అవుతుందని అంటున్నారు కయాదు లోహర్. నానికి జోడీగా ఆమె నటించిన పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్ 'ది ప్యారడైజ్'. శ్రీకాంత్ ఓదెల దర్శకుడు. మోహన్‌బాబు, సోనాలి కులకర్ణి, రాఘవ్ జుయల్ కీలక పాత్రలు పోషించారు. ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మించారు. సెప్టెంబరు 24న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా కయాదు పంచుకున్న క్యూట్ కబుర్లు మీకోసం..

'డ్రాగన్' సినిమా చూసిన తర్వాత నేను ఈ క్యారెక్టర్ చేయగలనని దర్శకుడు శ్రీకాంత్ నన్ను నమ్మి కథ చెప్పారు. తర్వాత లుక్ టెస్ట్ చేసి ఓకే చేశారు. ఇది నా కెరీర్‌లో చాలా పెద్ద ప్రాజెక్ట్. ఇందులో నన్ను అందరూ 'సుబ్బు' అని పిలుస్తారు! నా పాత్ర చాలా గ్రే షేడ్స్‌తో ఉంటుంది ఎన్నో సర్‌ప్రైజెస్ ఉంటాయి అవి తెరపైనే చూడాలి. సాధారణ కమర్షియల్ సినిమాల్లో కథానాయిక పాత్ర అంత బలంగా ఉండవు. ఇందులో జడల్ జర్నీతో పాటు నా క్యారెక్టర్‌కి కూడా ఒక ప్రత్యేక ప్రయాణం ఉంటుంది. ఇది పూర్తి కంటెంట్ ఉన్న సినిమా. 'జడల్' లుక్‌లో నానిని చూసి షాకయ్యా.. తెలుగు సినీ పరిశ్రమలో ఇలాంటి స్క్రీన్ ప్రెజెన్స్ ఇంతవరకు ఎవరూ చూసుండరు.

శ్రీకాంత్ ఓదెలలాంటి దర్శకులు అరుదుగా ఉంటారు. ఆయన విజన్, మేకింగ్ స్క్రీన్ మీద మ్యాజిక్ క్రియేట్ చేస్తాయి. దాన్ని తెరపైకి తీసుకురావడంలో నిర్మాత సుధాకర్ అన్నింటిలోనూ సహకరించారు. ఈ సినిమా కోసం నేనే డబ్బింగ్ చెప్పాలని ట్రై చేశా. దర్శకుడు శ్రీకాంత్ కూడా ప్రోత్సహించారు. కానీ కుదరలేదు. 'ది ప్యారడైజ్' చాలా పెద్ద ప్రాజెక్ట్.. ఈ సినిమా కోసం ఏకంగా ఏడాది పాటు షూటింగ్‌లో పాల్గొన్నా! ప్రతి నెలా షూట్ జరుగుతూనే ఉండేది. యాక్షన్ సినిమాలు, స్పోర్ట్స్ సినిమాలు చేయాలని ఉంది. అలాగే బయోపిక్ కూడా అవకాశం వస్తే చేయాలని ఉంది. సూర్యతో ఒక సినిమా చేస్తున్నాను. అలాగే మారి సెల్వరాజ్‌తో ఒక సినిమా చేస్తున్నా.

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala mohan, PRGI.REGN.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737